తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
Estd : 2002
# జనంసాక్షి
www.janamsakshi.org
RNI NO.TELTEL / 2013 /50370
శుక్రవారం 24.01.2025 | సంపుటి : 11 సంచిక : 196 | పేజీలు : 12 వెల: రూ. 4/-
తెలంగాణ | Simultaneously Published from Hyderabad & Karimnagar | ఎడిటర్ : ఎం.ఎం. రహమాన్

ప్రకటనల కోసం సంప్రదించండి
98483 28698




తెలంగాణకు

# పెట్టుబడుల వరద

## పలు సంస్థల ద్వారా రూ.1.78 లక్షల కోట్లు

- ఈ ప్రాజెక్టుల వల్ల సుమారు 49,550 మందికి ఉద్యోగాలు
- అద్భుత ఫలితాన్నిచ్చిన తెలంగాణ రైజింగ్ నినాదం
- హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్‌తో మరింత ఆకర్షణ
- పెట్టుబడుల్లో రికార్డు నమోదు చేసిన రేవంత్ బృందం

తాజాగా తెలంగాణలో అమెజాన్ రూ.60వేల కోట్ల భారీ పెట్టుబడులు

హైదరాబాద్‌లో రూ.15వేలకోట్లతో 'టిల్మాన్ గ్లోబల్ హోల్డింగ్స్' అత్యాధునిక డేటా సెంటర్

ముఖ్యమంత్రి రేవంత్, శ్రీధర్‌బాబుల సమక్షంలో కంపెనీల ఒప్పందం



హైదరాబాద్(జనంసాక్షి): ప్రపంచ ఆర్థిక సదస్సు దావోస్ వేదికగా తెలంగాణ రాష్ట్రానికి భారీగా పెట్టుబడులు వచ్చాయి. గతంలో ఎన్నడూ లేని విధంగా భారీ పెట్టుబడుల రికార్డు నమోదుచేసింది. 16 ప్రముఖ కంపెనీలు సుమారు రూ. 1.78 లక్షల కోట్ల మేర పెట్టుబడులు పెట్టేందుకు ఒప్పందాలు చేసుకున్నాయి. ఈ ప్రాజెక్టుల వల్ల సుమారు 49,550 మందికి ఉద్యోగాలు వస్తాయని ప్రభుత్వం తెలిపింది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో పాటు ఐటీ మంత్రి శ్రీధర్‌బాబు, ఆశాఖ ముఖ్య కార్యదర్శి జయేష్ రంజన్ తదితరులు దావోస్ పర్యటనలో పాల్గొన్నారు. దాదాపు నాలుగురోజుల పర్యటనలో సిఎం రేవంత్ బృందం బిజీగా గడిపింది. అనేక కంపెనీలతో చర్చలు జరిపి పెట్టుబడులను ఆకర్శించింది. తెలంగాణ రైజింగ్ నినాదాం బాగా కలిసివచ్చింది. అలాగే హైదరాబాద్‌కు ఉన్న బ్రాండ్ ఇమేజ్ కూడా పనికి వచ్చింది. దీంతో పలు కంపెనీలు పెట్టుబడులు పెట్టడానికి ఆసక్తి చూపాయి. ప్రధానంగా 6 ప్రముఖ సంస్థలతో ఒప్పందాలు జరిగాయి. సన్ పెట్రో కెమికల్స్ సంస్థ భారీ పంప్డ్ స్టోరేజీ జల విద్యుత్తు, సోలార్ విద్యుత్తు ప్రాజెక్టుల ఏర్పాటుకు ముందుకు వచ్చింది. నాగర్ కర్నూలు, మంచిర్యాల, ములుగు జిల్లాల్లో ప్లాంట్లు. 3400 మెగావాట్ల

మిగతా 2లో..

## తెలంగాణలో డ్రైపోర్టు నిర్మిస్తాం

దావోస్ వేదికగా ప్రకటించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

మచిలీపట్నంకు అనుసంధానం చేయాలని నిర్ణయం

హైదరాబాద్(జనంసాక్షి):తెలంగాణకు భారీగా పెట్టుబడులు తీసుకురావడమే లక్ష్యంగా దావోస్ వెళ్లిన సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రభుత్వం, అధికారుల బృందం.. అక్కడి పారిశ్రామిక వేత్తలను ఆకర్షించే

మిగతా 2లో..

హైదరాబాద్‌లో

## ఇన్ఫోసిస్ విస్తరణ

2లో

అదనంగా 17వేల ఉద్యోగాలు

మొదటి దశలో రూ. 750 కోట్లతో ఐటీ భవనాలు

# కొత్తరేషన్‌కార్డులతో 40 లక్షల మందికి లబ్ధి

- జాబితాలో పేరులేని వారు ఆందోళన చెందొద్దు
- మళ్లీ గ్రామసభల్లో దరఖాస్తు చేసుకోవచ్చు
- రేషన్ దుకాణాల్లో ఇకనుంచి సన్న బియ్యం పంపిణీ
- మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి కీలక ప్రకటన





హైదరాబాద్(జనంసాక్షి): ప్రస్తుతం తెలంగాణలో కొత్త రేషన్ కార్డుల జారీ ప్రక్రియ కొనసాగుతోంది. అయితే ఇప్పటికే అప్లై చేసుకున్న వారికి సంబంధించి రేషన్ కార్డు అర్హత కలిగిన వారి జాబితాను ప్రభుత్వం విడుదల చేసింది. అయితే దరఖాస్తు చేసుకున్న జాబితాలో పేరు లేని వారు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. ఈ నేపథ్యంలోనే ఇప్పటికే గ్రామ సభలు నిర్వహిస్తున్న ప్రభుత్వం.. రేషన్ కార్డు జాబితాలో పేరు లేని వారు ఈ గ్రామసభల్లో మరోసారి దరఖాస్తు చేసుకోవాలని అధికారులు, ప్రభుత్వం సూచిస్తోంది. దీంతో గ్రామ సభల్లో కొత్త రేషన్ కార్డుల కోసం దరఖాస్తు చేసుకునే వారి సంఖ్య భారీగా పెరుగుతోంది. అయితే రేషన్ కార్డుల కోసం రాష్ట్రవ్యాప్తంగా అనేక గ్రామ సభల్లో తీవ్ర గందరగోళం, ఆందోళనలు చోటు చేసుకుంటున్నా యి. ఈ నేపథ్యంలోనే రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి కీలక ప్రకటన చేశారు. గతంలో అధికారంలో ఉన్న బీఆర్ఎస్ ప్రభుత్వం.. 10 ఏళ్ల పాటు రేషన్ కార్డుల జారీపై దృష్టి పెట్టలేదని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తీవ్రంగా విమర్శించారు. ఈ క్రమంలో కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం రాష్ట్రంలో 40 లక్షల మందికి లబ్ధి చేకూర్చేలా కొత్త రేషన్ కార్డులు జారీ చేస్తోందని చెప్పారు. కరీంనగర్ జిల్లాలోని

మిగతా 2లో..

కృష్ణా జలాల కేటాయింపు వ్యవహారం

## ఎపి పిటిషన్‌పై ఫిబ్రవరిలో విచారిస్తాం

సుప్రీం కోర్టు ధర్మాసనం స్పష్టీకరణ



న్యూఢిల్లీ(జనంసాక్షి):ఆంధ్రప్రదేశ్, తెలంగాణ మధ్య కృష్ణా జలాల కేటాయింపు వ్యవహారంలో ఏపీ ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌పై ఫిబ్రవరిలో విచారణ చేపడతామని సుప్రీంకోర్టు తెలిపింది. కృష్ణా ట్రైబ్యునల్ నీటి పంపకాల విషయంలో గురువారం సర్వోన్నత న్యాయస్థానంలో ఏపీ ప్రభుత్వం మెన్షన్ చేయడంతో.. ఈ

మిగతా 2లో..



అలకనంద ఆస్పత్రి కిడ్నీ రాకెట్..

## 8 మంది దళారుల గుర్తింపు

హైదరాబాద్(జనంసాక్షి): అలకనంద ఆస్పత్రి కిడ్నీ రాకెట్ కేసులో పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు. ఈ వ్యవహారంతో సంబంధం ఉన్న ఎనిమిది మంది దళారులను పోలీసులు గుర్తించారు.గత ఆరు నెలలుగా అలకనంద ఆస్పత్రిలో ఈ తతంగం నడుస్తున్నట్లు గుర్తించారు. బెంగళూరుకు చెందిన వైద్యుడు కీలకంగా వ్యవహరించినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. వైద్యు డితోపాటు మరికొంత మంది ప్రమేయం ఉందేమోనన్న కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ఈ కేసుకు సంబంధించి ఇప్పటికే ఆస్పత్రి నిర్వాహకుడు సుమం త్‌తోపాటు మరికొందరిని అదుపులోకి తీసుకొని ప్రశ్నిస్తున్నారు.

చిత్ర నిర్మాణ సంస్థల్లో

2లో

## కొనసాగుతున్న ఐటీ దాడులు

దిల్‌రాజ్ నివాసంలో మూడోరోజూ సోదాలు

హైదరాబాద్ పెట్టుబడులు పెట్టిన కంపెనీలతో దావోస్‌లో

# మళ్లీ ఒప్పందాలా.?



హైదరాబాద్(జనంసాక్షి):రాష్ట్రానికి పెట్టుబడులు తీసుకురావటమే లక్ష్యంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారథ్యంలోని తెలంగాణ రైజింగ్ ప్రతినిధి బృందం దావోస్‌లో పర్యటిస్తున్న సంగతి తెలిసిందే. దావోస్ వేదికగా జరుగుతున్న వరల్డ్ ఎకనమిక్ ఫోరంలో పలు కంపెనీలతో చర్చలు, ఒప్పందాలు చేసుకుంటున్నారు. ఇప్పటికే మేఘా, స్కైరూట్ ఏరోస్పేస్, కంట్రోల్‌ఎస్ వంటి పలు కంపెనీలతో వేల కోట్ల ఒప్పందాలు జరిగాయి. అయితే ఈ పెట్టుబడుల ఒప్పందాలపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ట్విట్టర్

మిగతా 2లో..

## ఉబర్, ఓలాలకు కేంద్రం నోటీసులు

ఫిర్యాదులు ఎక్కువ కావడంతో స్పందించిన కేంద్ర వినియోగదారుల మంత్రిత్వశాఖ



న్యూఢిల్లీ(జనంసాక్షి):యాప్ ఆధారంగా క్యాబ్ సర్వీసులు అందిస్తున్న ఉబర్ , ఓలా సంస్థలపై ఇటీవల ఫిర్యాదులు ఎక్కువ కావడంతో కేంద్ర వినియోగదారుల మంత్రిత్వ శాఖ స్పందించింది.ఆ రెండు సంస్థలకు నోటీసులు జారీ చేసింది. ఈ తరహా యాప్‌లు ఫోన్ ధరను బట్టి ఛార్జీలు వసూలు చేస్తున్నాయంటూ ఎప్పటి నుంచో ఆరోపణలు ఉన్నాయి. ఆండ్రాయిడ్, ఐఓఎస్ అనే తేడా మాత్రమే కాకుండా.. ఫోన్ రేటును బట్టి కూడా ధరల్లో తేడా ఉంటోందని పలువురు వినియోగదారులు సోషల్ మీడియా వేదికగా ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఆరోపణలపై పూర్తి వివరణ ఇవ్వాలని ఉబర్, ఓలా సంస్థలను వినియోగదారుల మంత్రిత్వశాఖ ఆదేశించింది. మరోవైపు ఒకే సర్వీసుకు ఈ రెండు సంస్థలు వేర్వేరు ఛార్జీలు వసూలు చేస్తున్నట్లు ఫిర్యాదులు వచ్చాయి. దీనిపైనా కేంద్ర వినియోగదారుల రక్షణ సంస్థ (సీసీపీఏ)

మిగతా 2లో..



ఛత్తీస్‌గఢ్ ఎన్‌కౌంటర్‌లో మరో అగ్రనేత

# చంద్రహాస్ మృతి

ఇప్పటి వరకు 17 మృతదేహాలను స్వాధీనం చేసుకున్న పోలీసులు

మిగతా మృతదేహాల కోసం సెర్చ్ ఆపరేషన్.. భారీగా పేలుడు సామగ్రి స్వాధీనం



మావోయిస్టులకు చెందిన భారీ పేలుడు సామాగ్రిని స్వాధీనం చేసుకున్న పోలీసులు

చర్ల(జనంసాక్షి): ఛత్తీస్‌గఢ్-ఒడిశా సరిహద్దులో ఇటీవల భారీ ఎన్‌కౌంటర్ జరిగింది. గరియాబంద్, నౌపాడ జిల్లాల్లో భద్రతాబలగాలతో జరిగిన ఎదురుకాల్పుల్లో 20 మందికిపైగా మావోయిస్టులు మరణించారు.ఈ ఎన్‌కౌంటర్ లోనే మావోయిస్టు మరో అగ్ర నేత కూడా మృతిచెందినట్లు తాజాగా తెలిసింది. ఇప్పటి వరకు 17 మృతదేహాలను స్వాధీనం చేసుకుని పోస్ట్‌మార్టం నిమిత్తం ఛత్తీస్‌గఢ్ రాజధాని రాయ్‌పుర్‌కు తరలించారు. మిగతా మృతదేహాల కోసం సెర్చ్ ఆపరేషన్ కొనసాగుతోంది. ఛత్తీస్‌గఢ్-ఒడిశా సరిహద్దులో ఇటీవల భారీ ఎన్‌కౌంటర్ జరిగింది. గరియాబంద్, నౌపాడ జిల్లాల్లో భద్రతాబలగాలతో జరిగిన ఎదురుకాల్పుల్లో మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడు రామచంద్రారెడ్డి ప్రతాప్‌రెడ్డి అలియాస్ చలపతితో పాటు కీలక నాయకులు మరణించారు.ఈ ఎన్‌కౌంటర్ లోనే మావోయిస్టు మరో అగ్ర నేత కూడా మృతిచెందినట్లు తాజాగా తెలిసింది. తెలంగాణకు చెందిన చంద్రహాస్ మృతదేహాన్ని పోలీసులు గుర్తించారు.మంగళవారం నాటి ఎన్‌కౌంటర్‌లో హైదరాబాద్‌లోని జవహర్‌నగర్ పరిధి యాప్రాల్ వాసి ప్రమోద్ అలియాస్ చంద్రహాస్ మరణించినట్లు పోలీసులు నిరాధరించారు. ఒడిశాతో పాటు ఈస్ట్ జోనల్ బ్యూరో

మిగతా 2లో..

## మావోయిస్టుల పేల్చివేత కుట్ర భగ్నం

50 కిలోల మందుపాతరను నిర్వీర్యం చేసిన బలగాలు

బీజాపూర్(జనంసాక్షి):ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్ జిల్లా బాసగూడలో మావోయిస్టుల కుట్రను భద్రతా దళాలు భగ్నం చేశాయి. బాసగూడ-ఆవపల్లి మార్గంలో పోలీసుల వాహనాలను పేల్చేందుకు మావోయిస్టులు అమర్చిన 50 కిలోల మందుపాతరను సీఆర్‌పీఎఫ్ దళాలు నిర్వీర్యం చేశాయి. హైవేపై

మిగతా 2లో..

## రేషన్ కార్డులు ఇస్తామంటే అడ్డుకుంటారా?

మీ ప్రభుత్వంలో పదేళ్లపాటు నిద్రపోయారా?

బిఆర్ఎస్ నేతల తీరుపై మండిపడ్డ మంత్రి తుమ్మల




యాదగిరిగుట్ట(జనంసాక్షి): తెలంగాణ రాష్ట్రంలో అర్హులకు రేషన్ కార్డులు ఇవ్వాలని చూస్తుంటే బీఆర్ఎస్ శ్రేణులు అడ్డుకుంటున్నారని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆరోపించారు. గతంలో ఒక్క కార్డు కూడా ఇవ్వలేని వారు ఇవ్వాళ ప్రజల పేరుతో మొసలి కన్నీరు కారుస్తున్నారని, పదేళ్లపాటు రేషన్ కార్డులు ఇవ్వలేని సిగ్గులేని నేతలు గ్రామసభలకు అడ్డుతగులుతున్నారని మంత్రి ఘాటుగా స్పందించారు. దీక్షలు, నిరసనల పేరుతో అడుగడుగునా అడ్డం పడుతున్నారని తుమ్మల ధ్వజమెత్తారు. బీఆర్ఎస్ పదేళ్ల విధ్వంస పాలనకు గురైన రాష్ట్రాన్ని ఆదుకునేందుకు ప్రయత్నిస్తున్నామని ఆయన చెప్పారు. అందుకే తెలంగాణ రైతాంగాన్ని ఆదుకునేందుకు రుణమాఫీ చేసినట్లు చెప్పుకొచ్చారు.అన్నదాతలకు మేలు చేస్తుంటే నల్లగొండలో రైతు దీక్ష చేస్తున్నారంటూ మంత్రి తుమ్మల నిప్పులు చెరిగారు. నల్లగొండ రైతు దీక్ష చేయాలని భావిస్తున్న బీఆర్ఎస్ నేతలు పదేళ్లపాటు అధికారంలో ఉండి రైతులకు రుణమాఫీ ఎందుకు చేయలేదని మంత్రి నిలదీశారు. జనవరి 26 నుంచి అన్నదాతలకు రైతు భరోసా ఇవ్వనున్నట్లు మంత్రి తుమ్మల మరోసారి గుర్తు చేశారు. గత ప్రభుత్వం ఔటర్ రింగ్ రోడ్డును తాకట్టుపెట్టి కొంతమంది రైతులకు రైతు బంధు వేశారని ఆయన ఆరోపించారు. రాష్ట్రంలో దొడ్డు బి య్యం మాఫియా ఉందని, అందుకే ప్రజలకు సన్నబి య్యం అందిస్తున్నట్లు చెప్పారు. దావోస్ పర్యటనలో ఉన్న సీఎం రేవంత్ రెడ్డి.. తెలంగాణ రాష్ట్రానికి రూ.లక్ష కోట్ల పెట్టుబడులు తీసుకువస్తారని ధీమా వ్యక్తం చేశారు.

## జమ్మూ కాశ్మీర్‌లో అంటువ్యాధులు కాదట!

మిస్టరీ మరణాలపై కేంద్రమంత్రి జితేంద్ర సింగ్ కీలక వ్యాఖ్యలు

న్యూఢిల్లీ(జనంసాక్షి):జమ్ము కశ్మీర్‌లోని రాజౌరీ జిల్లాలోని బుధాల్ గ్రామంలో అంతుచిక్కని మరణాలు సంభవిస్తున్న విషయం అందరికీ తెలిసిందే. అయితే నెలన్నర రోజుల వ్యవధిలోనే మొత్తంగా 17 మంది ప్రాణాలు కోల్పోయారు. అయితే ఈ మరణాలకు కారణం ఏంటో తెలుసుకునేందుకు అటు రాష్ట్ర ఆరోగ్యశాఖతో పాటు కేంద్ర ప్రభుత్వం కూడా చర్యలు చేపట్టింది. కానీ ఇప్పటి వరకు ఎలాంటి కారణాలను కనుక్కోలేకపోయింది. అయితే తాజాగా దీనిపై కేంద్రమంత్రి జితేంద్ర సింగ్ స్పందించారు. రాజౌరీ మిస్టరీ మరణాల వెనుక ఉన్న అసలు కారణాన్ని వెల్లడించారు. రాజౌరీ జిల్లాలోని బుధాల్ గ్రామంలో గతేడాది డిసెంబర్ నెల 7వ తేదీన ఓ కుటుంబం సహపంక్తి భోజనాలు చేసింది. అయితే తిన్న వెంటనే ఏడుగురు అస్వస్థతకు గురయ్యారు.

మిగతా 2లో..



## మళ్లీ మొదలైన కార్చిచ్చు

లాస్ ఏంజెలెస్‌లో గంటల్లో వేల ఎకరాలకు వ్యాపించిన మంటలు

కాలిఫోర్నియా(జనంసాక్షి): అమెరికాలోని లాస్ ఏంజెలెస్‌లో ఇటీవల చెలరేగిన కార్చిచ్చు ఇంకా శాంతించడం లేదు. దీనికి తోడు తాజాగా మరో ప్రాంతంలో కొత్తగా మంటలు చెలరేగాయి దీంతో మళ్లీ ఆందోళనకర పరిస్థితులు నెలకొన్నాయి. కాస్టాయిక్ లేక్ సమీపంలోని కొండల ప్రాంతం నుంచి అగ్నికీలలు విస్తరిస్తున్నాయని అధికారులు వెల్లడించారు. ఇవి కేవలం కొన్ని గంటల వ్యవధిలోనే 8వేలకు పైగా ఎకరాలకు వ్యాపించినట్లు తెలిపారు. దీంతో ప్రభావిత ప్రాంతాల్లోని ప్రజలు వెంటనే నివాసాలను ఖాళీ చేయాలని హెచ్చరించారు.కాస్టాయిక్

మిగతా 2లో..

## న్యాయపరమైన వలసలకే పూర్తి మద్దతు

సరైన పత్రాలు లేకుండా వెళ్లిన భారతీయులను వెనక్కి రప్పిస్తాం

విదేశాంగశాఖ మంత్రి జైశంకర్ కీలక వ్యాఖ్యలు



వాషింగ్టన్(జనంసాక్షి): న్యాయపరమైన వలసలకే తాము పూర్తి మద్దతు ఇస్తామని భారత విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్ వెల్లడించారు. సరైన పత్రాలు లేకుండా వలస వెళ్లే భారతీయులను చట్టబద్ధంగా తిరిగి స్వదేశానికి రప్పించేందుకు భారత్ ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటుందన్నారు. నూతన అధ్యక్షుడిగా డొనాల్డ్ ట్రంప్ ప్రమాణస్వీకారానికి అమెరికా వెళ్లిన జైశంకర్.. తాజాగా కొంతమంది భారతీయ విలేకరులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఇరు దేశాల మధ్య బంధం, భారత విదేశాంగ విధానం వంటి అంశాలపై అడిగిన ప్రశ్నలకు ఆయన సమాధానమిచ్చారు."భారతీయుల ప్రతిభ, నైపుణ్యాలకు ప్రపంచ స్థాయిలో గరిష్ఠ అవకాశాలు దక్కాలని మేం కోరుకుంటున్నాం. అందుకే చట్టబద్ధమైన, న్యాయపరంగా వెళ్లే వలసలకు మేం పూర్తి మద్దతు ఇస్తాం. అదే సమయంలో అక్రమ రవాణా, అక్రమ వలసలను తీవ్రంగా వ్యతిరేకిస్తాం. ఎందుకంటే ఏదైనా చట్టవిరుద్ధంగా జరిగినప్పుడు.. ఇతర నేర

మిగతా 2లో..

# తెలంగాణకు పెట్టుబడుల వరద





పంప్డ్ స్టోరేజీ హైడ్రో విద్యుత్తు ఏర్పాటు చేయనుంది. . 5440 మెగావాట్ల సోలార్ విద్యుత్తు ప్లాంట్ల ఏర్పాటు. రూ. 45,500 కోట్ల పెట్టుబడులు.. 7వేల ఉద్యోగాల కల్పనకు అవకాశం ఏర్పడింది. అమెజాన్ వెబ్ సర్వీసెస్ ద్వారా ఏఐ, క్లౌడ్ సర్వీసెస్ డేటా సెంటర్లలో భారీ పెట్టుబడులు రానున్నాయి. రూ.60,000 కోట్ల భారీ పెట్టుబడికి అమెజాన్ ముందుకు రావడం విశేషం. ఇకపోతే కంట్రోల్ ఎస్ తెలం గాణలో అత్యాధునిక ఏఐ డేటాసెంటర్ క్లస్టర్ ఏర్పాటుచేయనుంది. 400 మెగా వాట్ల సామర్థ్యంతో డేటా సెంటర్ ఏర్పాటు చేయనుంది. రూ. 10,000 కోట్ల పెట్టుబడితో 3,600 మందికి ఉపాధి దక్కనుంది. జేఎస్ డబ్ల్యూ సంస్థ రాష్ట్రంలో మానవ రహిత ఏరియల్ సిస్టమ్స్ తయారీ యూనిట్ ఏర్పాటు చేయనుంది. రక్షణ రంగంలో అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో పాటు తెలంగాణ అభివృద్ధిలో ఈ ప్రాజెక్టు క్రియాశీలంగా మారనుంది. రూ.800 కోట్ల పెట్టుబడులు, 200 ఉద్యోగాలు దక్కనున్నాయి. స్కైరూట్ ఏరో స్పేస్ సంస్థ కూడా తెలంగాణలో ఇంటిగ్రేటెడ్ ప్రైవేట్ రాకెట్ తయారీ, ఇంటిగ్రేషన్ టెస్టింగ్ యూనిట్ ఏర్పాటు కోసం రూ.500 కోట్ల పెట్టుబడులు పెట్టనుంది. ఇకపోతే మేఘా ఇంజినీరింగ్ మూడు కీలక ఒప్పందాలు చేసుకుంది: రాష్ట్రంలో 2160 మెగావాట్ల పంప్డ్ స్టోరేజ్ ఇంధన ఉత్పత్తి ప్రాజెక్ట్. బ్యాటరీ ఎనర్జీ స్టోరేజీ సిస్టమ్ ప్రాజెక్టు. అనంతగిరిలో వరల్డ్ క్లాస్ లగ్జరీ వెల్‌నెస్ రిసార్ట్ ఏర్పాటు చేయనుంది. రూ.15000 కోట్ల పెట్టుబడులతో , 5,250 మందికి ఉపాధి రానుంది. హెచ్‌సీఎల్ టెక్ సెంటర్ హైటెక్ సిటీలో 3.20 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో హెచ్‌సీఎల్ కొత్త క్యాంపస్ ఏర్పాటు చేయనుంది. దీంతో. 5వేల మందికి ఉపాధి కలుగనుంది. హైదరాబాద్‌లో విప్రో కంపెనీ విస్తరణ చేపట్టనుంది.. గోపన్‌పల్లి క్యాంపస్‌లో కొత్త ఐటీ సెంటర్ ద్వారా 5వేల మందికి ఉద్యోగాలు రానున్నాయి. హైదరాబాద్‌లో ఇన్ఫోసిస్ క్యాంపస్ విస్తరణకు అంగీకరించింది. పోచారంలో ఐటీ క్యాంపస్‌లో కొత్త సెంటర్ ద్వారా రూ.750 కోట్ల పెట్టుబడులు.. 17,000 ఉద్యోగాలు దక్కనున్నాయి. ఇకపోతే యూనిలివర్ కంపెనీ కామారెడ్డి జిల్లాలో పామాయిల్ ఫ్యాక్టరీ, రిఫైనింగ్ యూనిట్ ఏర్పాటు చేయనుంది. రాష్ట్రంలో బాటిల్ క్యాప్‌లను ఉత్పత్తి చేసే కొత్త తయారీ యూనిట్ ఏర్పాటుతో దాదాపు వెయ్యి మందికి ఉద్యోగాలు దక్కనున్నాయి. టిల్మాన్ గ్లోబల్ హోల్డింగ్స్ హైదరాబాద్‌లో అత్యాధునిక డేటా సెంటర్ ఎర్పాటుకు అంగీకరించింది. . 300 మెగావాట్ల సామర్థ్యంతో ఈ డేటా సెంటర్ ఏర్పాటుకు. రూ.15,000 కోట్ల పెట్టుబడులు పెటటనుంది. అమెరికాకు చెందిన కంపెనీ ఉర్సా క్లస్టర్స్ అత్యాధునిక అర్టిఫిషియల్ డేటా సెంటర్ హబ్‌ను స్థాపించనుంది. రూ. 5000 కోట్ల పెట్టుబడులు పెట్టనుంది. ప్రపంచ అగ్రగామి సంస్థ బ్లాక్‌స్టోన్ హైదరాబాద్‌లో 150 మెగావాట్ల డేటా సెంటర్ ఏర్పాటు చేయనుంది. ఇందుకోసం 4,500 కోట్ల పెట్టుబడి పెట్టనుంది. అక్షత్ గ్రీన్ టెక్ (మైత్రా ఎనర్జీ (గ్రూప్ కంపెనీ) అత్యాధునిక సోలార్ సెల్స్, మాడ్యూల్స్ తయారీ యూనిట్ ఏర్పాటు చేయనుంది. ఇందుకోసం రూ.7,000 కోట్ల పెట్టుబడులు పెట్టనుంది. ఆరోగ్య సంరక్షణలో ప్రపంచంలో పేరొందిన ఎక్లాట్ హెల్త్ సొల్యూషన్స్ కంపెనీ దాదాపు 800 మంది ఉద్యోగులు పనిచేసేందుకు వీలుగా హైదరాబాద్‌లో నూతన కార్యాలయం ఏర్పాటుకు ముందుకు వచ్చింది. సంగారెడ్డిలో ప్రస్తుతమున్న సుహానా ప్లాంట్ పక్కనే కొత్తగా ఎక్సెలెన్స్ సెంటర్ ఏర్పాటు చేయనుంది. మొత్తంగా అనేక ఒప్పందాలు, పెట్టుబడులతో తెలంగాణ దావో వేదికగా మంచి స్పందనను సంపాదించింది. రేవంత్ రెడ్డి ప్రయత్నాలు ఫలించాయనే చెప్పాలి.

**అమెజాన్ రూ.60వేల కోట్ల పెట్టుబడి**

పెట్టుబడుల వేటలో దావోస్‌లో సిఎం రేవంత్ బృందం బిజీగా ఉంది. వరుస భేటీలతో పలు కంపెనీలతో చర్చలు, ఒప్పందాలు సాగుతున్నాయి. తాజాగా తెలంగాణలో భారీ పెట్టుబడికి దిగ్గజ సంస్థ అమెజాన్ ముందు కొచ్చింది. దావోస్‌లో అమెజాన్ వెబ్‌సర్వీసెస్ గ్లోబల్ పబ్లిక్ పాలసీ వైస్ ప్రెసిడెంట్ మైకేల్‌తో సీఎం రేవంత్‌రెడ్డి భేటీ అయ్యారు. రూ.60వేల కోట్ల పెట్టుబడి పెట్టేందుకు అమెజాన్ అంగీకారం తెలిపింది. ఈ మేరకు తెలంగాణ ప్రభుత్వంతో ఒప్పందం జరిగింది. ఈ పెట్టుబడితో రాష్ట్రంలో డేటా సెంటర్లను అమెజాన్ విస్తరించనుంది. వీటికి అవసరమైన భూమిని కేటాయించేందుకు రాష్ట్ర ప్రభుత్వం అంగీకారం తెలిపింది. మరోవైపు ఇన్ఫోసిస్ సీఎఫ్‌వో సంగ్రాజ్‌తో తెలంగాణ ఐటీ మంత్రి శ్రీధర్‌బాబు భేటీ అయ్యారు. పోచారంలో ఐటీ క్యాంపస్ విస్తరణకు ఇన్ఫోసిస్ అంగీకారం తెలిపింది. రూ.750కోట్లతో మొదటి దశ విస్తరణ చేపడతామని ఆ సంస్థ తెలిపింది. దీంతో కొత్తగా 17వేల ఉద్యోగాలు రానున్నట్లు అధికార వర్గాలు వెల్లడించాయి. దావోస్ వేదికగా తెలంగాణలో రూ.15 వేల కోట్ల పెట్టుబడులు పెట్టేందుకు టిల్మాన్ గ్లోబల్ హోల్డింగ్స్ సంస్థ ఎంవోయూ చేసుకుంది. ఈ సంస్థ హైదరాబాద్‌లో 300 మెగావాట్ల డేటా సెంటర్‌ను ఏర్పాటు చేయనుంది. ఈ మేరకు టిల్మాన్ గ్లోబల్ హోల్డింగ్ ప్రెసిడెంట్ అహుజాతో జరిగిన భేటీలో సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి శ్రీధర్ ఎంవోయూ చేసుకున్నారు. హైదరాబాద్‌లో రూ.4,500 కోట్ల పెట్టుబడులకు బ్లాక్‌స్టోన్ ఒప్పందం చేసుకుంది. మైత్రా ఎనర్జీ ప్రాజెక్టులతో సుమారు 2,500 మందికి ఉద్యోగాలు వచ్చే అవకాశం ఉంది.

**రూ.15,000 కోట్లతో టిల్మాన్ గ్లోబల్ హోల్డింగ్స్ ఎంవోయూ**

తెలంగాణకు పెట్టుబడుల వెల్లువ కొనసాగుతోంది. హైదరాబాద్‌లో అత్యాధునిక డేటా సెంటర్‌ను అమెరికాకు చెందిన టిల్మాన్ గ్లోబల్ హోల్డింగ్స్ సంస్థ ఏర్పాటు చేయనుంది. రూ.15,000 కోట్లతో టిల్మాన్ గ్లోబల్ హోల్డింగ్స్ ఎంవోయూ కుదుర్చుకుంది. 300 మెగావాట్ల సామర్థ్యంతో డేటా సెంటర్ ఏర్పాటు కానుంది. దావోస్ ప్రపంచ ఆర్థిక వేదిక సదస్సులో రాష్ట్ర ప్రభుత్వంతో టిల్మాన్ గ్లోబల్ హోల్డింగ్స్ సంస్థ అవగాహన ఒప్పందంపై సంతకం చేసింది. టిల్మాన్ గ్లోబల్ హోల్డింగ్స్ ప్రెసిడెంట్ సచిత్ అహుజాతో సీఎం రేవంత్ రెడ్డి , ఐటీశాఖ మంత్రి శ్రీధర్ బాబు, పరిశ్రమల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్, ఉన్నతాధికారులు ఈ ఒప్పందం చేసుకున్నారు. టిల్‌మాన్ గ్లోబల్ హోల్డింగ్స్‌తో రాష్ట్ర ప్రభుత్వ భాగస్వామ్యం హైదరాబాద్ స్థాయిని మరింత పెంచుతుందని ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు అన్నారు. తెలంగాణ ప్రభుత్వంతో భాగస్వామ్యం కావటం పట్ల టిల్‌మాన్ గ్లోబల్ హోల్డింగ్స్ అధ్యక్షుడు సచిత్ అహుజా సంతోషం వ్యక్తం చేశారు. తెలంగాణలో ఉన్న మౌలిక సదుపాయాలు, దార్శనిక నాయకత్వం తమను ఆకట్టుకుందని సచిత్ అన్నారు. అలాగే.. హైదరాబాద్‌లో 5000 కోట్ల పెట్టుబడులకు అమెరికా సంస్థ ఉర్సా క్లస్టర్స్ ముందుకొచ్చింది. ఉర్సా క్లస్టర్స్ రాష్ట్రంలో అత్యాధునిక అర్టిఫిషియల్ డేటా సెంటర్ హబ్‌ను ఉర్సా క్లస్టర్ స్థాపించనుంది. ఒప్పందంపై ఉర్సా క్లస్టర్ సీవోవో సతీష్ అబ్బూరి, సీఆర్వో ఎరిక్ వార్నర్ సంతకం చేశారు. అలాగే హైదరాబాద్‌లో మరో డేటా సెంటర్ కూడా ఏర్పాటు కానుంది. బ్లాక్ స్టోన్ సంస్థ రూ.4,500 కోట్ల పెట్టుబడులు పెట్టేందుకు ప్రభుత్వంతో అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. హైదరాబాద్‌లో 150 మెగావాట్ల డేటా సెంటర్‌ను బ్లాక్ స్టోన్ ఏర్పాటు చేయనుంది. ఏఐ ఆధారిత సేవలను డాటా సెంటర్ అందించనుంది. కాగా.. ముఖ్యమంత్రి దావోస్ పర్యటన విజయవంతంగా కొనసాగింది. అనేక ప్రముఖ కంపెనీలు తెలంగాణలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకువచ్చాయి. దాదాపు 10 ప్రముఖ కంపెనీలతో తెలంగాణ ప్రభుత్వం ఎంవోయూ కుదుర్చుకుంది.

## తెలంగాణలో డ్రైపోర్టు నిర్మిస్తాం

పనిలో పడింది. ఈ క్రమంలోనే దావోస్‌లో వరల్డ్ ఎకనామిక్ ఫోరం, సీఐఐ, హీరో మోటార్ కార్ప్ నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో సీఎం రేవంత్ రెడ్డి పాల్గొన్నారు. ఈ క్రమంలోనే రవాణా రంగంలో పెట్టుబడులు పెట్టేందుకు బిజినెస్‌మెన్‌లు ముందుకు రావాలని కోరారు. హైదరాబాద్ నగరాన్ని ప్రపంచ స్థాయి అత్యున్నత ప్రమాణాలతో అభివృద్ధి చేయాలనే తమ రాష్ట్ర ప్రభుత్వ సంకల్పానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. ఇప్పటికే శరవేగంగా అభివృద్ధి చెందుతున్న హైదరాబాద్‌ను.. ప్రపంచంలోనే అత్యంత వేగవంతమైన, పర్యావరణ అనుకూల నగరంగా మార్చేందుకు అందరు కలిసి కృషి చేయాలని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. ఈ సందర్భంగా తెలంగాణలో డ్రైపోర్టును నిర్మిస్తామని దావోస్ వేదికగా సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ఈ డ్రైపోర్టు నిర్మాణంతో తెలంగాణను వేర్‌హౌజ్ హబ్‌గా తీర్చిదిద్దుతామని వెల్లడించారు. తెలంగాణకు తీరప్రాంతం లేని లోటును పూడ్చేందుకు.. కొత్తగా డ్రై పోర్టును నిర్మించి.. సమీపంలో ఉన్న ఆంధ్రప్రదేశ్‌లోని మచిలీపట్నం పోర్టుకు ప్రత్యేకంగా రోడ్డు, రైలు మార్గాలతో దాన్ని అనుసంధానం చేయనున్నట్లు తెలిపారు.

## కొత్తరేషన్‌కార్డులతో 40 లక్షల మందికి లబ్ధి

నారాయణపూర్, మానకొండూరులో నిర్వహించిన గ్రామసభలకు హాజరైన ఉత్తమ్ కుమార్ రెడ్డి.. రేషన్ దుకాణాల్లో ఇక నుంచి సన్న బియ్యం పంపిణీ చేస్తామని తేల్చి చెప్పారు. అయితే రేషన్ కార్డు రాని వారు అధైర్యపడొద్దని.. అర్హులందరికీ రేషన్ కార్డులు జారీ చేస్తామని స్పష్టం చేశారు. రేషన్ కార్డులు రాలేదని ఎవరూ ఆందోళన పడాల్సిన అవసరం లేదని భరోసా ఇచ్చారు. పేదలందరికీ రేషన్ కార్డులు ఇస్తామని.. ప్రతిపక్షాలు ఆరోపణలను ఎవరూ పట్టించుకోవద్దని చెప్పారు.ప్రజాపాలన సందర్భంగా వచ్చిన అన్ని దరఖాస్తులను పరిశీలిస్తున్నామని తెలిపారు. ఈనెల 21వ తేదీన రాష్ట్రవ్యాప్తంగా ప్రారంభమైన గ్రామసభలు.. ఈనెల 24వ తేదీ వరకు కొనసాగనున్నాయి. అయితే ఇప్పటికే రేషన్ కార్డుల కోసం దరఖాస్తు చేసుకున్నా.. అందులో పేరు లేకపోతే ఈ గ్రామ సభల్లో మళ్లీ అప్లై చేసుకోవాలని ప్రభుత్వం చెప్పడంతో.. ప్రజలు భారీగా దరఖాస్తులు చేసుకుంటున్నారు.

## చిత్ర నిర్మాణ సంస్థల్లో కొనసాగుతున్న ఐటీ దాడులు

**హైదరాబాద్(జనంసాక్షి):**ప్రముఖ నిర్మాత దిల్ రాజు నివాసంలో ఆదాయపు పన్ను శాఖ ఉన్నతాధికారులు సోదాలు మూడో రోజు.. గురువారం కొనసాగాయి. డాక్యుమెంట్లు తనిఖీ చేస్తున్న మహిళా ఉన్నతాధికారితో దిల్ రాజు వాదనకు దిగారు. దీంతో సదరు మహిళా అధికారి ప్రతిస్పందించగా.. దిల్ రాజు సీరియస్‌గా అక్కడ నుంచి వేగంగా వెళ్లిపోయారు. సంక్రాంతి పండగ వేళ.. రామ్ చరణ్ హీరోగా దిల్ రాజ్ నిర్మాతగా గేమ్ చేంజర్ చిత్రం విడుదలైంది. అలాగే విక్టరీ వెంకటేష్, ఐశ్వర్య రాజేష్ హీరో హీరోయిన్లుగా తెరకెక్కినన సంక్రాంతి వస్తున్నాం చిత్రం సైతం రిలీజ్ అయింది. ఇక డిసెంబర్ తొలి వారంలో అల్లు అర్జున్ హీరోగా తెరకెక్కిన పుష్ప 2 చిత్రం విడుదలైంది. చిత్రాలు బాక్సాఫీస్ వద్ద ఘన విజయాన్ని అందుకొన్నాయి. దీంతో ఆయా చిత్రాల నిర్మాతల నివాసాలు, కార్యాలయాలపై ఆదాయపు పన్ను శాఖ అధికారులు ఏక కాలంలో దాడులు నిర్వహించారు. అయితే దిల్ రాజ్ నివాసంలో తనిఖీలు ఇంకా కొనసాగుతోన్నాయి. మరోవైపు ఈ దాడుల్లో పలు కీలక పత్రాలు స్వాధీనం చేసుకున్నట్లు ప్రచారం అయితే నడుస్తోంది. అదీకాక పుష్ప 2 చిత్రం సైతం భారీ విజయాన్ని సొంతం చేసుకొంది. దీంతో మైత్రీ మూవీ మేకర్స్ చిత్ర నిర్మాతలు నివాసాల్లో సైతం ఐటీ శాఖ అధికారులు సోదాలు నిర్వహించారు. ఆ క్రమంలో ఇటీవల విడుదలైన చిత్రాలను ఎన్ని కోట్ల రూపాయిలతో నిర్మించారు. అంత నగదు ఎక్కడి నుంచి తీసుకు వచ్చారు. ఆయా సినిమాలకు ఏ మేర లాభాలు వచ్చాయి. పన్నుల రూపంలో ఎంత చెల్లించాల్సి ఉంది.. తదితర అంశాలకు సంబంధించి ఆ యా చిత్రాల నిర్మాతలపై ఆదాయపు పన్ను శాఖ అధికారులు ప్రశ్నల వర్షం కురిపించారు.

## మళ్లీ మొదలైన కార్చిచ్చు

లేక్ సమీపంలో బుధవారం ఉదయం (అమెరికా కాలమానం ప్రకారం) పెద్ద ఎత్తున మంటలు చెలరేగాయి. కొన్ని గంటల వ్యవధిలోనే ఈ అగ్నికీలలు 39 చదరపు కిలోమీటర్ల మేర ఉన్న చెట్లను, పొదలను బూడిద చేశాయని అధికారులు వెల్లడించారు. తాజాగా కార్చిచ్చు మొదలైన ప్రాంతం.. ఇటీవల అగ్నికి ఆహుతైన ఈటన్, పాలిసేడ్స్‌కు కేవలం 64 కిలోమీటర్ల దూరంలోనే ఉంది. ఈ ప్రాంతాల్లో మంటలు ఇంకా ఆరలేదు. దీనికి తోడు, దక్షిణ కాలిఫోర్నియా నుంచి వీస్తున్న బలమైన గాలులు మరింత ప్రమాదకరంగా మారాయి. గాలి బలంగా వీస్తుండటంతో మంటలు ఒక చోటు నుంచి మరో చోటుకు వేగంగా వ్యాపిస్తున్నాయి. అగ్నికీలల తీవ్రత దృష్ట్యా మంటలను అదుపు చేయడం అతి కష్టంగా మారిందని అధికారులు వెల్లడించారు. అయితే, అగ్నిమాపక సిబ్బంది నిరంతరం శ్రమిస్తున్నారని తెలిపారు. తాజా కార్చిచ్చుతో దాదాపు 50వేల మందికి పైగా ప్రజలు నివాసాలు ఖాళీ చేయాలని ఆదేశాలు జారీ చేశారు. ప్రస్తుతం ఇక్కడ గంటకు 67 కిలోమీటర్ల వేగంతో గాలులు వీస్తున్నాయి. గురువారం (అమెరికా కాలమానం ప్రకారం) నాటికి ఇది గంటకు 96 కిలోమీటర్లకు పెరగొచ్చని అంచనా వేస్తున్నారు. ఇప్పటికే విమానాలతో వాటర్ బాంబులను జారవిడుస్తూ మంటలను అదుపు చేసేందుకు యత్నిస్తున్నారు.ఇటీవల లాస్ ఏంజెలెస్‌లోని హాలీవుడ్ సహా పలు ప్రాంతాల్లో భీకర కార్చిచ్చు చెలరేగిన సంగతి తెలిసిందే. ఆ మంటల ధాటికి 14వేల నిర్మాణాలు బూడిదయ్యాయి. 28 మంది ప్రాణాలు కోల్పోయారు. పాలిసేడ్స్‌లో మంటలను 68శాతం అదుపు చేయగా.. ఈటన్‌లో ఫైర్‌ను 91 శాతం అదుపులోకి తీసుకొచ్చినట్లు అధికారులు చెబుతున్నారు. కానీ, గాలుల కారణంగా ఇవి మళ్లీ తీవ్రమవుతున్నాయి.

## న్యాయపరమైన వలసలకే పూర్తి మద్దతు

కార్యకలాపాలకు ఆస్కారం ఎక్కువగా ఉంటుంది. అలాంటి పరిస్థితి సరికాదు. అది దేశానికి మంచి పేరు తీసుకురాదు. అందుకే అమెరికా సహా ఏ దేశానికైనా సరే భారత పౌరులు అక్రమంగా వెళ్లినట్లు నిర్ధరిస్తే.. వారిని చట్టబద్ధంగా తిరిగి స్వదేశానికి రప్పించేందుకు మేం ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటాం" అని జైశంకర్ వివరించారు.సరైన పత్రాలు లేకుండా అమెరికా వచ్చిన భారతీయులను వెనక్కి పంపించేందుకు ట్రంప్ సర్కారు చర్యలు మొదలుపెట్టిందంటూ వస్తోన్న వార్తలపై అడిగిన ప్రశ్నకు భారత కేంద్ర మంత్రి ఈ విధంగా బదులిచ్చారు. అగ్రరాజ్యం పంపించాలనుకుంటున్న భారతీయుల వివరాలను దిల్లీ పరిశీలిస్తోందని జైశంకర్ తెలిపారు. ప్రస్తుతానికి ఎంతమంది అనే విషయాన్ని స్పష్టంగా చెప్పలేమన్నారు. మరో పక్క అక్రమంగా వలసవచ్చిన 18,000 మందిని భారత్ వెనక్కి తీసుకొనుందని అంతర్జాతీయ మీడియా సంస్థల్లో కథనాలు వెలువడ్డాయి. పాక్‌తో వాణిజ్యాన్ని మేం ఆపలేదు..

ఈ సందర్భంగా భారత్-పాక్ సంబంధాలపైనా జైశంకర్ స్పందించారు. "పాకిస్థాన్‌తో వాణిజ్యాన్ని మేం ఎన్నడూ ఆపలేదు. దీనిపై 2019లో పాక్ ప్రభుత్వమే నిర్ణయం తీసుకుంది. ఆ దేశానికి మేం మోస్ట్ ఫేవర్డ్ నేషన్ హోదా ఇచ్చాం. కానీ, ఆ దేశం మాత్రం భారత్‌కు అలాంటి హోదాకు ఇవ్వలేదు" అని వెల్లడించారు. ఇక, బంగ్లాదేశ్‌లో పరిస్థితుల గురించి అమెరికా విదేశాంగ మంత్రితో చర్చించినట్లు తెలిపారు.ఇక భారతీయులకు అమెరికా వీసాల జారీ ఆలస్యమవుతుండటంపై నూతన విదేశాంగ మంత్రి మార్కో రూబియోతో చర్చించినట్లు జైశంకర్ తెలిపారు. "వీసా తీసుకునేందుకు 400 రోజులు ఎదురుచూడటం అనేది తీవ్రమైన విషయమే. ఇది ఇరు దేశాల సంబంధాలపై ప్రభావం చూపిస్తుంది.

హైదరాబాద్ పెట్టుబడులు పెట్టిన కంపెనీలతో

## దావోస్‌లో మళ్లీ ఒప్పందాలా.?

వేదికగా స్పందించారు. రేవంత్ సర్కార్‌పై సెటైర్లు వేశారు. హైదరాబాద్ ఆధారిత కంపెనీలను దావోస్ తీసుకెళ్లి ఒప్పందాలు చేసుకోవటమేంటని అన్నారు. రేవంత్ సర్కార్ ఇన్నోవేటివ్ ఆలోచన, పాలన అంటే ఇదేనా? అని ప్రశ్నించారు. 'వినూత్న ఆలోచన అంటే ఏమిటి ? హైదరాబాద్ ఆధారిత కంపెనీలను స్విట్జర్లాండ్‌లోని దావోస్‌కి వేల మైళ్ల దూరం ప్రయాణించి పెట్టుబడులు ప్రకటించేలా చేయడం! నిజంగా సర్కస్‌లా ఉంది. హైదరాబాద్‌లో చాయ్ తాగుతూ పూర్తి చేయాల్సిన ఒప్పందాలను.. స్విట్జర్లాండ్‌లో హాట్ చాక్లెట్‌తో పూర్తి చేయాల్సి వచ్చింది.' అని కేటీఆర్ ట్వీట్ చేశారు.

## ఉబర్, ఓలా సంస్థలకు కేంద్రం నోటీసులు

చర్యలకు ఉపక్రమించింది. ఒకే సర్వీసుకు రెండు వేర్వేరు ధరలు ఎలా నిర్ణయిస్తున్నారో వివరణ ఇవ్వాలని ఆదేశించింది. ధరల్లో వ్యత్యాసం ఉన్నట్లు స్పష్టంగా అర్థమవుతోందని సీసీపీఏ పేర్కొంది. ఛార్జీల విషయంలో నిజాయితీ, పారదర్శకత తీసుకొచ్చేందుకు సరైన వివరణతో రావాలని పేర్కొంది.ఇటీవల దిల్లీకి చెందిన రిషభ్ సింగ్ అనే వ్యక్తి ఎక్స్‌లో పెట్టిన పోస్టు బాగా వైరల్ అయిన సంగతి తెలిసిందే. క్యాబ్ సర్వీసులు అందించే ఉబర్ సంస్థ ఫోన్‌లను బట్టే కాదు.. అందులో ఉన్న బ్యాటరీ పర్సంటేజీ బట్టి కూడా ఛార్జీల్లో వ్యత్యాసం చూపిస్తోందని ఆయన ఆరోపించారు. రెండు ఆండ్రాయిడ్, రెండు ఐఓఎస్ డివైజులు వినియోగించి పరిశీలించినప్పుడు దీన్ని గుర్తించినట్లు తెలిపారు. అన్ని డివైజుల్లోనూ ఒకే అకౌంట్‌తో లాగిన్ అయి.. ఒకే ప్రదేశానికి రైడ్ బుక్ చేసినప్పుడు ఫేర్‌లో ఈ తేడా గుర్తించినట్లు సింగ్ తెలిపారు. ఈ తరహా ఫిర్యాదులపై సోషల్ మీడియాలో బాగా చర్చ జరిగింది. ఈ నేపథ్యంలోనే కేంద్రం చర్యలకు సిద్ధమైంది.

### ఏపి పిటిషన్‌పై ఫిబ్రవరిలో విచారిస్తాం

మేరకు జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ కోటేశ్వర్ సింగ్ నేతృత్వంలోని ధర్మాసనం నిర్ణయం తీసుకుంది. కృష్ణా ట్రిబ్యునల్‌కు సంబంధించి మూడు రాష్ట్రాల మధ్య పంపకాలు 2014కు ముందే పూర్తయిన నేపథ్యంలో రాష్ట్ర విభజన తర్వాత ఏపీ, తెలంగాణ మధ్య నీటి పంపకాల వ్యవహారాన్ని తేల్చాలని 2023 అక్టోబరులో కేంద్రం నోటిఫికేషన్ జారీ చేసింది. అంతకుముందే తెలంగాణ ప్రభుత్వం కృష్ణా ట్రిబ్యునల్‌ను ఆశ్రయించింది. తెలంగాణ భూ భాగంలోనే కృష్ణా నది ఎక్కువగా ప్రవహిస్తోందని.. అందుకని తెలంగాణకు కృష్ణా జలాల్లో 70 శాతం వాటా ఇవ్వాలని ట్రిబ్యునల్‌ను కోరింది. లేదంటే వ్యవహారం తేలే వరకు రెండు రాష్ట్రాలకు 50శాతం చొప్పున నీటి కేటాయింపులు చేయాలని ట్రిబ్యునల్‌లో తెలంగాణ ప్రభుత్వం పిటిషన్ దాఖలు చేసింది. మరోవైపు కేంద్ర ప్రభుత్వం జారీ చేసిన నోటిఫికేషన్‌పై ఇప్పటికే ఏపీ ప్రభుత్వం సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. ఆ పిటిషన్‌పై విచారణ కొనసాగుతుండగానే మరోసారి కృష్ణా ట్రిబ్యునల్ తీసుకున్న నిర్ణయాన్ని సుప్రీంకోర్టులో ప్రత్యేకంగా ఏపీ ప్రభుత్వం మెన్షన్ చేసింది.



## ఛత్తీస్‌గఢ్ ఎన్‌కౌంటర్‌లో మరో అగ్రనేత చంద్రహాస్ మృతి

ఇన్‌ఛార్జ్‌గా ఉన్న అతడి తలపై రూ.20లక్షల రివార్డ్ ఉన్నట్లు పోలీసులు తెలిపారు.ఈ ఎన్‌కౌంటర్‌లోభారీ సంఖ్యలో మావోయిస్టులు మరణించినట్లు పోలీసులు వెల్లడించారు. వీరిలో 17 మృతదేహాలను స్వాధీనం చేసుకుని పోస్ట్‌మార్టం నిమిత్తం ఛత్తీస్‌గఢ్ రాజధాని రాయ్‌పుర్‌కు తరలించారు. మిగతా మృత దేహాల కోసం సెర్చ్ ఆపరేషన్ కొనసాగుతోంది.

**భారీగా పేలుడు సామగ్రి స్వాధీనం**

ఛత్తీస్‌గఢ్‌లోని సుక్మా జిల్లాలో గురువారం 203 కోబ్రా బెటాలియన్, సీఆర్పీఎఫ్ 131 బెటాలియన్ ఆధ్వర్యంలో మావోయిస్టు వ్యతిరేక ఆపరేషన్ చేపట్టారు.ఇందులో మెటగూడెం, డ్యూలర్ గ్రామాల మధ్య అటవీ ప్రాంతంలో భారీగా పేలుడు పదార్థాలు, ఆయుధాల తయారీ పరికరాలను స్వాధీనం చేసుకున్నారు. నిఘా వర్గాల సమాచారం మేరకు 203 కోబ్రాకు చెందిన 5 బృందాలు, సీఆర్పీఎఫ్ 131 బెటాలియన్‌కు చెందిన ఏ, డీ కంపెనీలు కలిసి ఈ ఆపరేషన్ నిర్వహించాయి. మెటగూడెం గ్రామం నుంచి 1.5 కిలోమీటర్ల దూరంలో ఒక గుహను తొలుత భద్రతా బలగాలు కనిపెట్టాయి. అందులోని ఆయుధశాలలో ప్యాక్ చేసిన 21 ఐఈడీలు, బహుళ బారెల్ గ్రెనేడ్ లాంచర్ బాంబులు, ఒక జనరేటర్ సెట్, లాత్ మెషిన్ ఉపకరణాలు, భారీ పరిమాణంలో పేలుడు తయారీ పదార్థాలు, తుపాకీ తయారీ పరికరాలు, వైద్య సామగ్రి ఉన్నాయి. ఇంత పెద్దమొత్తంలో ఆయుధాలను స్వాధీనం చేసుకోవడం ఈ ప్రాంతంలో మావోయిస్టు కార్యకలాపాలకు పెద్ద ఎదురుదెబ్బ అని పేరు వెల్లడించడానికి ఇష్టపడని ఒక సీనియర్ భద్రతా అధికారి అన్నారు. 203 కోబ్రా నుంచి ప్రత్యేక డాగ్ స్క్వాడ్‌లు, బాంబు గుర్తింపు బృందాలు వీటిని గుర్తించడంలో కీలక పాత్ర పోషించాయని ఆయన తెలిపారు.

**మావోయిస్టుల పేల్చివేత కుట్ర భగ్నం**

సొరంగం తవ్వి కల్వర్టు కింద మావోయిస్టులు మందుపాతర అమర్చినట్టు అధికారులు తెలిపారు. ముందుగానే గుర్తించి నిర్వీర్యం చేయడంతో ప్రమాదం తప్పిందని చెప్పారు. ఛత్తీస్‌గఢ్-ఒడిశా సరిహద్దులో ఇటీవల భారీ ఎన్‌కౌంటర్ జరిగింది. గరియాబంద్, నౌపాడ జిల్లాల్లో భద్రతాబలగాలతో జరిగిన ఎదురుకాల్పుల్లో 20 మందికిపైగా మావోయిస్టులు మరణించారు. ఈ క్రమంలో మావోయిస్టుల కోసం పోలీసుల వేట కొనసాగుతోంది.

## జమ్మూ కాశ్మీర్‌లో అంటువ్యాధుల కాదట!

విషయం గుర్తించిన కుటుంబ సభ్యులు వారిని ఆస్పత్రికి తీసుకెళ్లేలోపే ఐదుగురు ప్రాణాలు కోల్పోయారు. మరో ఇద్దరు ప్రస్తుతం చికిత్స పొందుతున్నారు. ఇది జరిగిన మరో 5 రోజులకే రెండో సంఘటన చోటు చేసుకుంది. డిసెంబర్ 12వ తేదీ రోజు మరో కుటుంబం సహపంక్తి భోజనాలు చేయగా.. తొమ్మిది మంది అస్వస్థతకు గురయ్యారు. అందులో ముగ్గురు చనిపోగా.. ఆరుగురు చికిత్స పొందుతున్నారు. ఈ ఘటన జరిగిన మరో నెల రోజులకు అంటే జనవరి 12వ తేదీన మరో కుటుంబంలోనూ ఇలాంటిదే జరిగింది. సహపంక్తి భోజనం చేయగా.. మొత్తం పది మంత్రి తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. ఇందులో ఆరుగురు చిన్నారులు ప్రాణాలు కోల్పోయారు. ఇలా 45 రోజుల వ్యవధిలోనే మొత్తంగా 17 మంది ప్రాణాలు కోల్పోయారు. 38 మంది ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. వీటన్నిటినీ గుర్తించిన రాష్ట్ర సర్కారు రంగంలోకి దిగి.. బాధితుల నుంచి నమూనాలను సేకరించి దేశంలోని అనేక ల్యాబ్‌లకు పంపించింది. కేంద్ర ప్రభుత్వం కూడా మిస్టరీ మరణాల వెనుక ఉన్న కారణం తెలుసుకునేందుకు అనేక చర్యలు చేపట్టింది. కానీ ఇప్పటి వరకు ఇందుకు సంబంధించి ఎలాంటి వివరాలను వెల్లడించలేదు. అంటే మరణాలకు అసలు కారణం ఏంటనేదాన్ని తెలుపలేదు. కానీ తాజాగా కేంద్రమంత్రి జితేంద్ర సింగ్ ఈ మిస్టరీ మరణాల వెనుక ఉన్న కారణాలు గురించి తెలిపారు. చనిపోయిన 17 మంది మరణాలకు బ్యాక్టీరియా, వైరస్‌లు కారణం కాదని ప్రాథమిక దర్యాప్తులో తేలిందని వివరించారు.అలాగే బాధితుల్లో కొన్ని విషపూరిత పదార్థాలను గుర్తించామన్నారు. అవేంటో తెలుసుకునేందుకు చర్యలు చేపట్టామని.. కుట్ర కోణంలో కూడా కేసును దర్యాప్తు చేస్తున్నామన్నారు. అయితే ఎవరైనా కావాలనే ఈ మూడు కుటుంబాలు తిన్న ఆహార పదార్థాల్లో విషం కలిపి ఉంటే తామస్సలే ఊరుకోమని.. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. అలాగే మరో 10 రోజుల్లో ఈ మిస్టరీ మరణాల వెనుక ఉన్న పూర్తి కోణం ఏంటనేది తెలుస్తుందని కేంద్రమంత్రి జితేంద్ర సింగ్ ఆశాభావం వ్యక్తం చేశారు.

## వృద్ధాప్య పెన్షన్లు ఆపడం సరికాదు: హరీశ్‌రావు

**హైదరాబాద్(జనంసాక్షి):**వృద్ధులకు వృద్ధాప్య పెన్షన్లు ఆపడం సరికాదని మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు పేర్కొన్నారు. పెన్షన్లలో కోతలు విధించడమంటే.. వారి నోటికాడి బుక్కను లాగేసుకోవడమే అని ఆగ్రహం వ్యక్తం చేశారు. మంచిర్యాల జిల్లా హాజీపూర్ మండలం నంనూరు గ్రామ పంచాయతీలో కొడుకు ఇంటి పన్ను కట్టలేదని తల్లి వృద్ధాప్య పెన్షన్‌లో కోత విధించిన ఘటనపై హరీశ్‌రావు స్పందించారు. కొడుకు ఇంటి పన్ను కట్టకుంటే, తల్లికి వచ్చే వృద్ధాప్య పింఛన్ ఆపడం అన్యాయం, అమానుషం అని హరీశ్‌రావు పేర్కొన్నారు. ప్రభుత్వ నిర్ణయాలు, అధికారుల తీరు కుటుంబ సభ్యుల మధ్య చిచ్చు పెట్టే విధంగా ఉన్నాయి. పింఛన్ డబ్బులను కూడా ఇంటి పన్ను కింద జమ చేసుకుంటే, ఆ వృద్ధుల బతుకు బండి నడిచేది ఎట్ల? అని హరీశ రావు ప్రశ్నించారు.అధికారంలోకి వస్తే ప్రతి నెలా రూ. 4 వేలు పింఛన్ ఇస్తామని చెప్పి, ఇప్పుడు వచ్చే రూ. 2 వేల పింఛన్‌ను గుంజుకోవడం సరికాదన్నారు

## హైదరాబాద్‌లో ఇన్ఫోసిస్ విస్తరణ

హైదరాబాద్(జనంసాక్షి):ప్రపంచ దిగ్గజ ఐటీ సంస్థ ఇన్ఫోసిస్ హైదరాబాద్‌లో తమ క్యాంపస్‌ను విస్తరించనుంది. పోచారంలో ఉన్న ఇన్ఫోసిస్ క్యాంపస్‌లో అదనంగా 17 వేల ఉద్యోగాలు కల్పించనున్నట్లు ప్రణాళిక సిద్ధం చేసింది. ఇందుకు అనుగుణంగా అక్కడున్న సదుపాయాలు విస్తరించేందుకు రాష్ట్ర ప్రభుత్వంతో ఒప్పందం చేసుకుంది. దావోస్ ప్రపంచ ఆర్థిక వేదిక వార్షిక సదస్సులో ఇన్ఫోసిస్ సీఎఫ్ఓ జయేష్ సంగ్రాజ్‌తో తెలంగాణ ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి డి.శ్రీధర్‌బాబు సమావేశమయ్యారు. అనంతరం ప్రకటన విడుదల చేశారు. ఈ ఒప్పందంలో భాగంగా ఫస్ట్ ఫేజ్‌లో ఇన్ఫోసిస్ సంస్థ రూ.750 కోట్ల పెట్టుబడితో కొత్త ఐటీ భవనాల నిర్మాణం చేపడుతుంది. వచ్చే రెండు, మూడేళ్లలో ఈ నిర్మాణం పూర్తవుతుంది. ఈ కొత్త సెంటర్ రాష్ట్రంలో అభివృద్ధి చెందుతున్న ఐటీ పర్యావరణ వ్యవస్థకు గణనీయంగా దోహదపడుతుంది. దేశంలో ప్రముఖ ఐటీ గమ్యస్థానంగా తెలంగాణ ప్రతిష్టను మరింత పెంచుతుంది. ఇప్పటికే ఇన్ఫోసిస్ హైదరాబాద్‌లో దాదాపు 35,000 మంది ఉద్యోగులున్నారు. తెలంగాణ ప్రభుత్వంతో భాగస్వామ్యం పంచుకోవటం కొత్త ఆవిష్కరణలకు నాంది పలుకుతుందని, ఇప్పుడున్న ఐటీ సమూహాన్ని మరింత బలోపేతం చేయాలనే ఉమ్మడి దృక్పథాన్ని ప్రతిబింబిస్తుందని జయేష్ సంగ్రాజ్ అన్నారు. రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను వృద్ధి చేసే లక్ష్యంతో అన్ని రంగాల్లో ప్రముఖ సంస్థలు, పారిశ్రామిక దిగ్గజాలకు ప్రభుత్వం తగినంత మద్దతు ఇస్తుందని మంత్రి శ్రీధర్‌బాబు స్పష్టం చేశారు. అటు, తెలంగాణలో భారీ పెట్టుబడికి దిగ్గజ సంస్థ అమెజాన్ ముందుకొచ్చింది. దావోస్‌లో అమెజాన్ వెబ్ సర్వీసెస్ గ్లోబల్ పబ్లిక్ పాలసీ వైస్ ప్రెసిడెంట్ మైకేల్‌తో సీఎం రేవంత్ రెడ్డి భేటీ అయ్యారు. రూ.60 వేల కోట్ల పెట్టుబడి పెట్టేందుకు అమెజాన్ అంగీకారం తెలిపింది. ఈ మేరకు ఒప్పందం రాష్ట్ర ప్రభుత్వంతో జరగ్గా.. రాష్ట్రంలో డేటా సెంటర్లను సంస్థ విస్తరించనుంది. వీటికి అవసరమైన భూమిని కేటాయించేందుకు ప్రభుత్వం అంగీకారం తెలిపింది. దావోస్‌లో పెట్టుబడుల సమీకరణలో తెలంగాణ సరికొత్త రికార్డులు నెలకొల్పింది. గతంలో ఎన్నడూ లేని విధంగా రాష్ట్ర చరిత్రలో భారీ పెట్టుబడుల రికార్డు నమోదు చేసింది. వరల్డ్ ఎకనమిక్ ఫోరమ్ సదస్సులో ఇప్పటికే రూ.1.32 లక్షల కోట్ల పెట్టుబడులను సాధించింది. గతేడాది దావోస్ పర్యటనలో రాష్ట్రానికి రూ.40,232 కోట్ల పెట్టుబడులు వచ్చాయి. అప్పటితో పోలిస్తే ఈసారి మూడింతలకు మించిన పెట్టుబడులు రావటం విశేషం. సీఎం రేవంత్ రెడ్డి, ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు సారథ్యంలో తెలంగాణ రైజింగ్ బృందం దావోస్‌లో వివిధ పారిశ్రామికవేత్తలతో నిర్వహించిన సమావేశాలన్నీ విజయవంతమయ్యాయి. హైదరాబాద్‌లో ఫ్యూచర్ సిటీ అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ప్రాధాన్యమివ్వటం ప్రపంచ దిగ్గజ పారిశ్రామికవేత్తలను అమితంగా ఆకట్టుకుంది.

# ఇందిరమ్మ... ఇదేందమ్మా!


- అర్హుల జాబితా అంటూ అనర్హుల పేర్లే ఎక్కువ
- నిరుపేదలకే పథకాలు అంటూ ఊదరగొట్టిన ప్రభుత్వం
- తీరా గ్రామసభల్లో పేదలందరికీ మొండి చేయి
- తలలు పట్టుకుంటున్న కాంగ్రెస్ ద్వితీయ శ్రేణి నాయకులు
- అధఃపాతాళానికి పడిపోయిన కాంగ్రెస్ గ్రాఫ్

ఖమ్మం జిల్లా ప్రతినిధి, (జనంసాక్షి) : రాష్ట్రాన్ని 10 ఏళ్లపాటు ఏకచత్రాధిపత్యంగా పాలించిన బీఆర్ఎస్ గ్రామీణ ప్రాంతాల్లోని పేదల మనసు గెలుచుకోవడంలో పూర్తిగా వైఫల్యం చెందింది. వారి హయాంలో కొత్త పింఛన్లు, రేషన్ కార్డులు, పేదలకు అవసరమైన ఇండ్లు ఇవ్వకపోవడంతో కెసిఆర్ పై తీవ్ర వ్యతిరేకత వచ్చింది. ఫలితంగా గత సార్వత్రిక ఎన్నికల్లో హైదరాబాద్ మినహా రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో గ్రామీణ నేపథ్యం ఉన్న నియోజకవర్గాలు కాంగ్రెస్ కైవసం అయ్యాయి. కెసిఆర్ ప్రభుత్వం పై వ్యతిరేకత రావడానికి దశాబ్ద కాలం పట్టింది. మార్పు కావాలి.. కాంగ్రెస్ రావాలి.. పేద ప్రజల జీవితాల్లో వెలుగులు నింపాలి.. అంటూ గ్రామీణ ప్రాంత ప్రజలు కాంగ్రెస్ పార్టీకి పట్టం కట్టారు. ప్రభుత్వం కొలువుదిరిన సంవత్సర కాలంలోనే తీవ్ర వ్యతిరేకతను మూట కట్టుకునే వైపుకు అడుగులు పడటం అందరిని ఆశ్చర్యానికి గురిచేస్తుంది. ఇది ఇలాగే కొనసాగితే రానున్న స్థానిక సంస్థల ఎన్నికలు బీఆర్ఎస్ కు ప్రాణం పోస్తాయి.

### అర్హులంటూ అనర్హుల పేర్లు

కాంగ్రెస్ ప్రభుత్వం కొలువుతీరి సంవత్సరకాలం గడిచింది. ఎన్నికల హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తూ రేవంత్ సర్కార్ అడుగులు వేస్తోంది. ఇప్పటివరకు ఎన్నికల హామీల విషయంలో ప్రజల నుంచి కొంత వ్యతిరేకత ఉన్న మాట వాస్తవమే. అయితే బీఆర్ఎస్ హయాంలో కొత్త పింఛన్లు, రేషన్ కార్డులు, నిరుపేదలకు ఇండ్లు ఇవ్వకపోవడంతో తీవ్రత వ్యతిరేకత వచ్చింది. కాంగ్రెస్ ప్రభుత్వంలో ఇవి కచ్చితంగా అందుతాయని గ్రామీణ ప్రాంతాల ప్రజలు విశ్వసించారు. అందుకోసమే కాంగ్రెస్ విజయంలో కీలక పాత్ర పోషించారు. రేవంత్ సర్కారు సైతం వీటిని అందించేందుకు ప్రణాళికలు సిద్ధం చేసి అర్హుల జాబితా పేరుతో గ్రామ సభలు నిర్వహించేందుకు శ్రీకారం చుట్టింది. ఈ గ్రామసభలు కాంగ్రెస్ పార్టీకి ఉన్న గ్రాఫ్ ను అమాంతం అధఃపాతాళానికి చేర్చాయి. అర్హుల జాబితా అంటూ గ్రామ సభల్లో అధికారులు చదివిన పేర్లలో అనర్హులే ఉండటం ప్రజల ఆగ్రహానికి కారణమైంది. ఖమ్మం జిల్లా లోని కొన్ని గ్రామాల్లో పోలీసుల పర్యవేక్షణలో గ్రామసభలు నిర్వహించాల్సిన దుస్థితి నెలకొంది. నిన్న మొన్నటి వరకు ప్రజా ప్రభుత్వంగా చెప్పుకున్న కాంగ్రెస్ నాయకులు ఈ పరిస్థితికి కారణం ఏమిటో సమీక్షించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.





### నిరుపేద అంటూ దాని అర్థమే మార్చేశారు

రేవంత్ సర్కార్ కొలువుదీరిన నాటి నుంచి సంక్షేమ పథకాలు అమలులో నిరుపేదలకే తొలి ప్రాధాన్యత అంటూ పదేపదే ప్రకటనలు గుప్పించారు. ఈ ప్రకటనలతో పేద ప్రజలు ఎంతో సంతోషపడ్డారు. మొదటగా కాంగ్రెస్ ప్రభుత్వం అంటే ఇందిరమ్మ ఇల్లు అనే నానుడి ఉంది. గతంలో వైయస్సార్ హయాంలో అడిగిన ప్రతి ఒక్కరికి కుల మతాలకు అతీతంగా, పార్టీలకు అతీతంగా ఇందిరమ్మ ఇల్లు ఇచ్చారు. పింఛన్లను సైతం మంజూరు చేశారు. దీంతో ఆయన రాష్ట్ర ప్రజలకు దేవుడిలా కనిపించారు. ఫలితంగా 2009లో ప్రతిపక్షాలన్నీ ఏకమైనా రాష్ట్ర ప్రజలు కాంగ్రెస్ ప్రభుత్వానికే పట్టం కట్టారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తొలి ప్రాధాన్యత నిరుపేదలే అని ప్రకటించడంతో వారంతా ఎంతో ఆశగా ఎదురుచూస్తున్నారు. తీరా గ్రామసభల్లో ప్రకటించిన అర్హుల జాబితా చూసి అందరూ కంగుతిన్నారు. నిరుపేదల పేర్లు ఆ జాబితాలో లేవు కానీ భూమి ఉన్న వారి పేర్లు ఎక్కువగా కనిపిస్తున్నాయి. దీంతో కాంగ్రెస్ ద్వితీయ శ్రేణి నాయకత్వం, అధికారులు గ్రామ సభలో ప్రజలు అడిగే ప్రశ్నలకు సమాధానాలు చెప్పలేక ఇబ్బంది పడుతున్నారు.

### అసలు ఎక్కడిది ఈ జాబితా..?

గ్రామ సభల్లో అధికారులు ఇందిరమ్మ, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాలకు సంబంధించి చదివిన అర్హుల జాబితా ఎవరు తయారు చేశారు అన్నది మిలియన్ డాలర్ల ప్రశ్న. ఇందిరమ్మ ఇళ్ల కోసం ఏర్పాటుచేసిన ఇందిరమ్మ కమిటీలు సైతం మాకు తెలియకుండానే ఈ జాబితా వచ్చింది అని చెప్పటం ఆశ్చర్యానికి గురిచేస్తోంది. అసలు ఈ జాబితాను ఎక్కడినుండి తీసుకున్నారో అధికారులకే తెలియాలి. దీనిపై రాష్ట్ర ప్రభుత్వ పెద్దలు దృష్టి సారించాలి. అసలు ఈ జాబితా ఎక్కడి నుంచి వచ్చింది? ఎవరు తయారు చేశారు? కాంగ్రెస్ ప్రభుత్వాన్ని అప్రతిష్ట పాలు చేసేందుకు ఏదైనా కుట్ర కోణం దాగి ఉందా? అనే విషయాలపై లోతుగా పరిశీలన చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది. అదేవిధంగా ఈ జాబితాను ఫైనల్ చేయకుండా నిజమైన అర్హుల పేర్లను చేర్చి వారికి పథకాలు వర్తింప చేయాలి.

### తలలు పట్టుకుంటున్న కాంగ్రెస్ ద్వితీయ శ్రేణి నాయకత్వం

ఏ పార్టీకైనా గ్రామస్థాయిలో కార్యకర్తలు చాలా ముఖ్యం. వారిని నడిపించేందుకు ద్వితీయ శ్రేణి నాయకత్వం ఎంతో పటిష్టంగా ఉండాలి. ప్రభుత్వం తీసుకున్న ప్రతి నిర్ణయం ఈ నాయకత్వంపై ప్రత్యక్ష ప్రభావాన్ని చూపుతుంది. పక్క రాష్ట్రంలో ద్వితీయ శ్రేణి నాయకత్వాన్ని పక్కన పెట్టడంతో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎంతటి ఘోర పరాభవాన్ని మూటకట్టుకుందో మనకు సుపరిచితమే. అది తెలిసి కూడా కాంగ్రెస్ సర్కార్ ఇలాంటి తప్పులు చేస్తే రాష్ట్రంలో బీఆర్ఎస్ పార్టీకి తిరిగి ఊపిరి పోయడం కాంగ్రెస్ పాలకులు ఎజెండాగా పెట్టుకున్నారని చెప్పవచ్చు. వీటిపై రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రత్యేక దృష్టి సారించి ఆయన మొదటి నుంచి పదేపదే చెబుతున్న నిరుపేదలకు సంక్షేమ పథకాలకే తొలి ప్రాధాన్యత అనే నినాదాన్ని ఆచరణలో చూపించాలి. అప్పుడే ప్రజల మనసును గెల్చుకుంటారు. లేనిపక్షంలో రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో ఈ వ్యతిరేకత స్పష్టంగా కనిపించే అవకాశం ఉంది.

# పల్లెల్లో ఎన్నికల ఫీవర్

- ఏ నలుగురు ఉన్న చోట్ల ఎన్నికలపై చర్చ
- స్థానిక సంస్థల ఎన్నికలపై ఊహాగానాలు
- త్వరలో రాష్ట్రంలోని 540 మండలాల్లోని 12,966 గ్రామాల్లోని సర్పంచ్, ఎంపీటీసీ ఎన్నికలు

హైదరాబాద్, జనవరి23 (జనంసాక్షి) : తెలంగాణలోని పల్లెల్లో సర్పంచ్, ఎంపీటీసీ ఎన్నికల ఫీవర్ మొదలైంది. గ్రామాల్లో ఏ నలుగురు ఓ చోట గూమి కూడినా స్థానిక సంస్థల ఎన్నికల గురించే మాట్లాడుకుంటున్నారు. ఈసారి ఎవరు పోటీ చేస్తారు..? పోటీ చేసే ఫలానా మల్లయ్య లేదా ఎల్లయ్య గెలుస్తాడా..? ఓట్లు పడతాయా..? అని సీరియస్ డిస్కషన్ పెట్టుంటున్నారు. ఇక నోటిఫికేషన్ ఎప్పుడెప్పుడు వస్తుందా..? అని ఎన్నికల్లో పోటీ చేసే ఆశావాహులు సైతం ఎదురు చూస్తున్నారు. సర్పంచ్‌గా పోటీ చేయాలనుకుంటున్న వారు గ్రామాల్లోనే మకాం వేసి ప్రజల్ని మచ్చిక చేసుకునేందుకు విశ్వ ప్రయత్నాలు చేస్తున్నారు. మంచి, చెడులతో ఏమాత్రం సంబంధం లేకుండా గ్రామాల్లో ప్రతి కార్యక్రమంలో పాల్గొని ప్రజలతో మమేకమవుతున్నారు. మరికొందరు ఒకడుగు ముందుకేసి ప్రత్యేకంగా మేనిఫెస్టో సైతం రిలీజ్ చేస్తున్నారు. తమను గెలిపిస్తే.. గ్రామాన్ని అభివృద్ధి పథకంలో తీసుకెళ్తామంటూ హామీలు ఇస్తున్నారు. ఈ నేపథ్యంలో సర్పంచ్ ఎన్నికలపై పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క కీలక అప్డేట్ ఇచ్చారు. గ్రామ పంచాయతీలకు వీలైనంత త్వరలో ఎన్నికలను నిర్వహించేందుకు తమ ప్రభుత్వం ప్రయత్నిస్తోందని వెల్లడించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇచ్చేందుకు తాము సిద్ధంగా ఉన్నట్లు చెప్పారు. బీసీ రిజర్వేషన్ల ఖరారుకు ప్రత్యేక కమిషన్ ఏర్పాటు చేయగా.. ఇప్పటికే నివేదిక సిద్ధమైందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దావోస్ పర్యటన ముగించుకొని వచ్చాక ఆమోదం పొందుతుందని తెలిపారు. బుధవారం సెక్రటేరియట్‌లో మీడియాతో చిట్‌చాట్‌గా మాట్లాడిన మంత్రి.. సీఎం రేవంత్ వచ్చాక పంచాయతీ ఎన్నికల ప్రక్రియ వేగం పుంజుకుంటుందని అన్నారు. కాగా, మంత్రి ప్రకటనతో ఆశావహుల్లో ఆశలు చిగురిస్తున్నాయి. ఫిబ్రవరి చివరి వారంలో ఎన్నికలు ఉండే ఛాన్స్ ఉందని గత కొంత కాలంగా ప్రచారం జరుగుతోంది. దీంతో గ్రామాల్లో సర్పంచ్, ఎంపీటీసీలుగా పోటీ చేసే వారు ఎన్నికలకు సిద్ధమవుతున్నారు. తెలంగాణలో మొత్తం 540 మండలాల్లోని 12,966 గ్రామాల్లో సర్పంచ్, ఎంపీటీసీ ఎన్నికలు జరగనున్నాయి. 1,14,620 వార్డులకు రాష్ట్ర ఎన్నికల సంఘం పంచాయతీ ఎన్నికలను నిర్వహించనుంది. అందుకు సంబంధించిన జాబితాను పంచాయతీరాజ్ శాఖ ఇప్పటికే రాష్ట్ర ఎన్నికల సంఘానికి సమర్పించింది. క్రితంసారి 535 మండలాల్లోని 12,732 గ్రామాల్లో మొత్తం 1,13,152 వార్డులకు ఎన్నికలు జరిగాయి. ఈసారి అదనంగా మరో 5 మండలాలు, 234 గ్రామాలు, 1,468 వార్డుల్లో ఎన్నికలు జరగనున్నట్లు తెలిసింది. గతేడాది ఫిబ్రవరితో సర్పంచ్‌ల పదవీ కాలం ముగియగా.. ప్రస్తుతం గ్రామాల్లో ప్రత్యేకాధికారులు పాలనను సాగిస్తున్నారు.

# విస్తరిస్తున్న హైదరాబాద్ మహానగరం

**త్వరలో గ్రేటర్‌లో కలవనున్న 20 మున్సిపాలిటీలు, 7 కార్పొరేషన్లు**



హైదరాబాద్, జనవరి 23 (జనంసాక్షి) : హైదరాబాద్ మహా నగరం విశ్వ నగరంగా వేగంగా అభివృద్ధి చెందుతోంది. ప్రపంచంలోని టాప్ సిటీల్లో హైదరాబాద్ కూడా ఒకటిగా నిలుస్తోంది. లండన్, న్యూయార్క్ వంటి ప్రపంచస్థాయి నగరాలతో పోటీపడేలా హైదరాబాద్‌ను తీర్చిదిద్దాలని రేవంత్ సర్కార్ భావిస్తోంది. ఇప్పటికే హైదరాబాద్, సికింద్రాబాద్, సైబరాబాద్ ట్రైసిటీలు ఉండగా.. నగర విస్తరణలో భాగంగా ఫ్యూచర్ సిటీ పేరుతో ఫోర్త్ సిటీని కూడా నిర్మిస్తున్నారు. దాదాపు 20 వేల ఎకరాల్లో ఈ ఫ్యూచర్ సిటీ రూపుదిద్దుకోనుంది. ఇక నగర విస్తరణలో భాగంగా సర్కార్ మరో కీలక నిర్ణయం తీసుకునేందుకు రెడీ అయింది. గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిని పెంచాలని భావిస్తోంది. ఔటర్ రింగు రోడ్డు వరకూ జీహెచ్ఎంసీని విస్తరణపై దృష్టిపెట్టింది. 20 మున్సిపాలిటీలు, 7 కార్పొరేషన్లనను గ్రేటర్‌లో కలపాలని భావిస్తోంది. ఈ క్రమంలో సాధ్యాసాధ్యాలపై ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేయాలని ప్రభుత్వం యోచిస్తోంది. ఇప్పటికే మున్సిపల్ శాఖ ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపగా.. త్వరలోనే నిర్ణయం తీసుకోనున్నట్లు సమచారం. జీహెచ్ఎంసీ కాకుండా ఓఆర్ఆర్ లోపల 20 మున్సిపాలిటీలు, 7 కార్పొరేషన్లు ఉన్నాయి. గ్రేటర్ హైదరాబాద్ నగరంతో పోలిస్తే అభివృద్ధిలో ఇవి వెనుకబడ్డాయి. నగరం వేగంగా విస్తరిస్తున్న క్రమంలో ఓఆర్ఆర్ వరకూ ఒకేవిధంగా అభివృద్ధి చేసేందుకు వాటిని జీహెచ్ఎంసీలో విలీనం చేయాలని రేవంత్ ప్రభుత్వం భావిస్తోంది.

# నేను తీసుకునే రెమ్యూనరేషన్ చాలా తక్కువ

- అది కూడా అంతా వైట్‌లోనే తీసుకుంటా
- నటుడు వెంకటేశ్ స్పష్టీకరణ



హైదరాబాద్, జనవరి 23 (జనంసాక్షి) : టాలీవుడ్‌లో అగ్ర నిర్మాతల ఇళ్లలో రెండు మూడు రోజులుగా కొనసాగుతున్న ఐటీ దాడులు కలకలంగా మారాయి. అయితే ఈ రెండు రోజుల్లో వారు ఏం పట్టుకున్నారనేది బయటికి రాలేదు కానీ.. ఇంతకు ముందు ఎప్పుడు లేనంతగా ఈ ఐటీ రైడ్స్ జరుగుతుండటం విశేషం. ఈ ఐటీ రైడ్స్‌కి సంబంధించి గురువారం హైదరాబాద్‌లో జరిగిన 'సంక్రాంతికి వస్తున్నాం' సినిమా సక్సెస్ సెలబ్రేషన్స్‌లో వెంకటేష్ మాట్లాడారు. మీడియా అడిగిన ప్రశ్నకు సమాధానమిస్తూ.. ఆయన తన రెమ్యునరేషన్ ఎలా తీసుకుంటారో చెప్పుకొచ్చారు. టాలీవుడ్ ఇండస్ట్రీలో హీరోలు తమ రెమ్యూనరేషన్‌ను మొత్తం వైట్ తీసుకుంటే.. ఏ నిర్మాత కూడా బ్లాక్ చేయాల్సిన అవసరం లేదు. హీరోలు బ్లాక్ తీసుకోకుండా ఉంటే.. ఇంకెవరికీ మేము బ్లాక్ ఇచ్చే అవసరం లేదు. కేవలం హీరోల కోసమే మేము బ్లాక్ ఇవ్వాల్సి వస్తుంది. అలా బ్లాక్ ఇచ్చినదానికి.. మేము బ్లాక్‌లో ఇంట్రస్ట్ కట్టాల్సి వస్తుందని పెద్ద నిర్మాతలు ఈ మధ్య ఎక్కువగా చెబుతున్నారు. దీనిపై మీ అభిప్రాయం ఏమిటని మీడియా అడిగిన ప్రశ్నకు వెంకీమామ సమాధానమిస్తూ..సినిమా టికెట్‌లు మిగతావారి సంగతి నాకు తెలియదు కానీ.. నేను ఫుల్ వైట్. వైట్ లో వైట్ అంతే. నేను తీసుకునేదే కొంచెం. నేను ఎక్కువ తీసుకోను.. తీసుకునేది మొత్తం వైటే తీసుకుంటాను..' అని చెప్పుకొచ్చారు. ఇంతకు ముందు కూడా వెంకటేష్ తన రెమ్యునరేషన్ గురించి మాట్లాడారు. నేను తీసుకునేదే చాలా తక్కువ. అందులోనూ మళ్లీ కొందరు నిర్మాతలు పూర్తిగా ఇవ్వరు. అదని, ఇదని చెబుతుంటారు.. పోనీలే అని నేను కూడా పెద్దగా పట్టించుకోను అని గతంలో తన రెమ్యూనరేషన్‌పై వెంకీ వివరణ ఇచ్చారు. బ్లాక్‌బస్టర్ హిట్ మెషిన్ అనిల్ రావిపూడి దర్శకత్వంలో విక్టరీ వెంకటేష్ హీరోగా వచ్చిన 'సంక్రాంతికి వస్తున్నాం' సినిమా జనవరి 14న విడుదలై కలెక్షన్ల సునామీ సృష్టిస్తోంది. ఇప్పటికే ఈ సినిమా రూ. 200 కోట్ల క్లబ్‌లో చేరి, రికార్డ్ బ్రేకింగ్ హౌస్ ఫుల్ కలెక్షన్స్‌తో పొంగల్ బ్లాక్ బస్టర్‌గా నిలిచింది. ఈ సక్సెస్‌ను పురస్కరించుకుని చిత్రయూనిట్ బాక్సాఫీస్ సంభవం పేరుతో మీడియా సమావేశాన్ని నిర్వహించింది.



# ఇంటర్ విద్యా కమిషనర్ ఆధ్వర్యంలో మైనార్టీ అధ్యాపక సంఘ క్యాలెండర్ ఆవిష్కరణ

హైదరాబాద్, జనవరి 23 (జనంసాక్షి) : ప్రభుత్వ జూనియర్ కళాశాలల పటిష్టం కోసం, విద్యార్థుల మంచి ఫలితాల కోసం అనేక చర్యలు చేపడుతున్న ఇంటర్మీడియెట్ కమీషనర్ క్రిష్ణ ఆదిత్యను ప్రభుత్వ మైనారిటీ విభాగ అధ్యాపక సంఘ రాష్ట్ర కమిటి అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు సయ్యద్ జబీ, మొహమ్మద్ అబ్దుల్లా తదితర సభ్యులు కలిసి రాబోవు పబ్లిక్ పరీక్షల, ప్రభుత్వ కళాశాలల బలోపేతం గురించి, వివిధ సమస్యలపై మెమోరాండమ్ ఇచ్చారు. కమీషనర్ సానుకూలంగా స్పందించి పరిష్కరిస్తామని తెలిపారు. వారు చేపడుతున్న చర్యలు, వెనుకబడిన విద్యార్థులను గుర్తించి అదనపు తరగతులు తీసుకొని ప్రభుత్వ కళాశాలల ఫలితాల శాతం పెంచాలని సలహా ఇచ్చారు. తదనంతరం అధ్యాపక సంఘ క్యాలెండర్ ఆవిష్కరించారు. అలాగే నాంపల్లి ప్రభుత్వ కళాశాలలో ప్రిన్సిపాల్ మునవ్వర ఆధ్వర్యంలో కూడా క్యాలెండర్ ఆవిష్కరించారు, వరంగల్ జిల్లా ఇంటర్ విద్యా అధికారి శ్రీధర్ సుమన్ పాల్గొన్నారు.

# రాఘవాపురం వాసికి డాక్టరేట్



పాలకుర్తి, జనవరి 23 (జనంసాక్షి) : మండలంలోని రాఘవాపురం గ్రామానికి చెందిన నాసం రాజేష్ ఉత్తరప్రదేశ్లోని ఆకాడమీ అఫ్ సైంటిఫిక్ అండ్ ఇన్నోవేటివ్ రీసెర్చ్ (ఏసీఎస్ఐఆర్) ఇన్సిట్యూట్ నుంచి డాక్టరేట్ సాదించాడు. రాజేష్ హైదరాబాద్లోని సీఎస్ఐఆర్ కెమికల్ సైన్సో పిహెచ్ విద్యను అభ్యసించాడు, రాఘవాపురంలో వ్యవసాయ కుటుంబానికి చెందిన నాసం మదుసూదన్. విజయ దంపతుల సంతానమైన రాజేష్ కష్టపడి ఉన్నత విద్యను పూర్తి చేశాడు. కెమికల్ సైన్స్ విభాగంలో డాక్టర్ పి. శ్రీహరి పర్యవేక్షణలో రాజేష్ విజయవంతంగా పీహెచ్డీ పూర్తి చేశాడు, ఉత్తరప్రదేశ్లోని జాన్సిట్యూట్ నిర్వాహకుల నుంచి తాజాగా పట్టా అందుకున్నాడు. పాఠశాల విద్య మొత్తం గూడూరులో ఇంటర్, డిగ్రీ హనుమకొండలో పేజీ ఓయూలో పూర్తి చేశాను. పీహెచ్ పట్టా అందుకోవడం తనకెంతో ఆనందాన్నిచ్చిందని తన పరిశోధనకు తగ్గ గుర్తింపు లభిస్తుందని తెలిపారు.

### గణతంత్ర దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించాలి

కొమరం భీం ఆసిఫాబాద్ జిల్లా బ్యూరో జనవరి 23 (జనం సాక్షి): కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలో ఈనెల 26న నిర్వహించే 76వ గణతంత్ర దినోత్సవ వేడుకల సందర్భంగా ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ వెంకటేష్, ఎస్పీ శ్రీనివాసరావులు పరిశీలించారు. గురువారం జిల్లా కేంద్రంలోని పోలీస్ పరేడ్ గ్రౌండ్ (ఏ ఆర్ హెడ్ క్వార్టర్) లో నిర్వహించే గణతంత్ర దినోత్సవం సందర్భంగా వచ్చే రాజకీయ నాయకులకు, అధికారులకు, ప్రజలకు ఇబ్బంది లేకుండా అన్ని రకాల సౌకర్యాలు కల్పించాలని కిందిస్థాయి అధికారులను వారు ఆదేశించారు.

# ఆత్మీయ భరోసాపై నిలదీతలు

- పసరలో రసాభాసగా గ్రామసభ



గోవిందరావుపేట (జనంసాక్షి) : ఇందిరమ్మ ఇండ్లు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా రైతు భరోసా పేరుతో ప్రభుత్వం ఏర్పాటుచేసిన పసర ప్రజా పాలన గ్రామసభ రసా బసగా మారింది . గురువారం పసర గ్రామపంచాయతీ ఆవరణలో గ్రామపంచాయతీ కార్యదర్శి శ్వేత అధ్యక్షతన ప్రజాపాలన గ్రామసభ నిర్వహించారు . ఈ సభకు ప్రత్యేక అధికారిగా ఎంపీడీవో జోహార్ రెడ్డి హాజరైనారు ఈ సభకు వేలాది మంది ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చారు. ఈ సందర్భంగా స్థానిక ఎంపీడీవో జవహర్ రెడ్డి వివిధ పథకాల కు సంబంధించిన లిస్టులు చదువుతుండగా ప్రజలు అడ్డుకున్నారు. ప్రజా పాలనలో గ్రామసభ తుది నిర్ణయం అని అన్నారు. ఆత్మీయ భరోసా పేరుతో 2000 మంది ఉపాధి హామీ పని చేస్తే కేవలం 115 మందికి మాత్రమే ఎలా ఇస్తారని నిలదీశారు. ఇందులో ఇద్దరు చనిపోయిన వారికి రావడం పట్ల ఆశ్చర్యం వ్యక్తం చేశారు. వంద రోజులు పని చేసిన వారికి కూడా ఆత్మీయ భరోసా రాలేదని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఒక దశలో సభ వేదికపైకి దూసుకు వెళ్లి మహిళలు ప్రభుత్వ పాలనపై శాపనార్థాలు పెట్టారు. కష్టపడ్డ వారికి ఆత్మీయ భరోసా అందడం లేదని కొంతమంది దళారుల చేతుల్లోకి ఆత్మీయ భరోసా వెళుతుందని ధ్వజమెత్తారు. ఎవరికోసం ఈ ప్రజా పాలన అని నిలదీశారు. ఇందిరమ్మ ఇళ్ల పేరుతో భూమి ఉన్నవారు లేనివారు అని విభజన చేసి ఏ ఒక్కరికి ఇంద్రమ్మ ఇల్లు మంజూరు చేయకపోవడం పట్ల ఆగ్రహం వెలిబుచ్చారు. ప్రభుత్వం రైతు భరోసా పేరుతో పెట్టిన పథకాన్ని ఎకరాకు 12 వేల రూపాయలు ఇస్తామని ప్రకటించారు. కానీ సాగులో ఉన్న పట్టాలు రాని వారి పరిస్థితి ఏంటని పలువురు రైతులు ప్రశ్నించారు. పసర నాగరం శివారులో 109 సర్వే నెంబర్ లో ఉన్న 10 ఎకరాల భూమి సాగులో లేదని నిరుపేదలు అందులో ఇల్లు నిర్మించుకొని జీవిస్తున్నారని అందుకోసం రైతు భరోసా రద్దు చేస్తున్నట్లు అధికారులు ప్రకటించారు . పక్కనే సాగులో ఉన్న 30 ఎకరాల భూమి సన్న చిన్న కారు రైతులు సాగులో ఉన్న పుల్యాల వసంత పేరుతో అక్రమ పట్టా పొందారని వారి రైతు భరోసా వెంటనే రద్దుచేసి రైతులకు భూమిపై హక్కు కల్పించాలని రైతులు గ్రామసభలో ఆందోళన చేశారు. వెంటనే అధికారులు జోక్యం చేసుకొని రైతు భరోసా రద్దు చేస్తామని తీర్మానం గ్రామ సభ లో చేశారు. ప్రభుత్వ ప్రజా పాలన గ్రామసభ నిర్వహణకు పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటుచేసిన ప్రజలు తమకు రావాల్సిన వాటికోసం నిలదీయడం ఆగ్రహం వ్యక్తం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎమ్మార్వో సృజన్ కుమార్. సిఐ రవీందర్ ఎస్సై కమలాకర్ వ్యవసాయ శాఖ అధికారి దాదా సింగ్, పిఎసిఎస్ చైర్మన్ పన్నాల ఎల్లారెడ్డి, ఎంపీ ఓ పూనం శరత్ ఆర్ ఐ రాజేందర్ వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

### ప్రభుత్వ పథకాలు గ్రామ సభల ద్వారా పారదర్శకంగా నిర్వహించాలి : సిపిఎం డిమాండ్

అధికారులు ప్రభుత్వ పథకాలను గ్రామసభల ద్వారా పారదర్శకంగా అమలు చేయాలని సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పొదిల చిట్టిబాబు మండల కార్యదర్శి సోమ మల్లారెడ్డి జిల్లా కమిటీ సభ్యులు తీగల ఆదిరెడ్డి గొంది రాజేష్ లు డిమాండ్ చేశారు .లేనట్లయితే తమ సంఘం ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని ప్రభుత్వ పథకాలు ప్రజలందరికీ చేరేవరకు ఉద్యమిస్తామని హెచ్చరించారు.

# మీర్‌పేట హత్య కేసులో విస్తుపోయే విషయాలు

- అక్రమ సంబంధంతోనే భార్యను అడ్డు తొలగించుకునే చర్య
- గురుమూర్తి నుంచి కూపీ లాగుతున్న పోలీసులు

హైదరాబాద్, జనవరి 23 (జనంసాక్షి) : మీర్‌పేట సంచలన హత్య కేసులో విస్తుపోయే విషయాలు బయటికొస్తున్నాయి. మరో మహిళతో అక్రమ సంబంధంతోనే భార్యను హత్య చేసి ఉంటాడని పోలీసులు అనుమానిస్తున్నారు. సెల్‌ఫోన్ ద్వారా గుట్టును బయటకు తీసే ప్రయత్నంలో పోలీసులు ఉన్నారు. గురుమూర్తి తన భార్యను చంపి.. మృతదేహాన్ని ముక్కలు చేసి ఉడికించి.. ఎముకలను రోట్లో వేసి దంచి పొడిగా చేసిన ఘటన సంచలనం సృష్టించిన విషయం తెలిసిందే. రంగారెడ్డి జిల్లా మీర్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్న ఈ ఘటనకు సంబంధించి పోలీసులు దర్యాప్తు వేగవంతం చేశారు. నిందితుడిని అదుపులోకి తీసుకుని విచారిస్తుండగా విస్మయకర విషయాలు వెలుగులోకి వచ్చినట్లు తెలుస్తోంది. దర్యాప్తులో భాగంగా నిందితుడు గురుమూర్తి సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకుని పోలీసులు పరిశీలించారు. అందులో ఓ మహిళకు సంబంధించిన ఫొటోలను గుర్తించారు. ఆ మహిళతో సంబంధం కారణంగానే భార్యను అడ్డు తొలగించుకునేందుకు.. కడతేర్చి ఉంటాడని పోలీసులు అనుమానిస్తున్నారు. నిందితుడు చెప్పిన వివరాలను బట్టి సాంకేతిక ఆధారాలను సేకరిస్తున్నారు. ఈనెల 15న గురుమూర్తి, అతని భార్య వెంకటమాధవి మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. ఓ మహిళకు సంబంధించిన విషయంపైనే వారిద్దరి మధ్య గొడవ జరిగినట్టు తెలుస్తోంది. వెంకటమాధవి తలపై మోది హత్య చేసిన తర్వాత మటన్ నరికే కత్తితో ముక్కలుగా నరికాడు. ఆ తర్వాత శరీర భాగాలను బకెట్‌లో వేసి వాటర్ హీటర్‌తో ఉడికించాడు. అనంతరం వాటిని రోకలితో దంచి మూటకట్టి చెరువులో పడేసినట్టు పోలీసులకు చెప్పాడు. అయితే, జిల్లెలగూడ చెరువులో పోలీసులకు ఎలాంటి ఆధారాలు లభించలేదు. కానీ, నిందితుడు చెప్పిన వివరాల ప్రకారం.. 15వ తేదీ హత్య చేసిన తర్వాత గురుమూర్తి రెండ్రోజుల పాటు మద్యం సేవిస్తూ ఇంట్లోనే ఉన్నట్టు పోలీసులు ఆధారాలు సేకరించారు. వెంకటమాధవి కనిపించడం లేదని ఆమె తల్లిదండ్రులకు 17వ తేదీ రాత్రి చెప్పాడు. దీంతో ఆందోళనకు గురైన ఆమె తల్లిదండ్రులు వెంటనే న్యూ వెంకటేశ్వర కాలనీకి వచ్చి సమీపంలో గాలించారు. చుట్టుపక్కల వారిని ఆరా తీశారు. ఆమె ఆచూకీ లభించకపోవడంతో గురుమూర్తిని తీసుకెళ్లి.. 18వ తేదీ మీర్‌పేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. విచారణలో భాగంగా పోలీసులు గురుమూర్తి నివాసానికి వచ్చిన తర్వాత సీసీ టీవీ ఫుటేజీని పరిశీలించగా.. 14వ తేదీన వెంకటమాధవి బయటి నుంచి ఇంట్లోకి వెళ్లిన ఫుటేజీ ఉంది కానీ, ఆ తర్వాత బయటకు వెళ్లినట్టు ఆధారాలు దొరకలేదు. సాంకేతిక ఆధారాలను పరిశీలించిన తర్వాత పోలీసులు గురుమూర్తిపై అనుమానంతో అదుపులోకి తీసుకొని తమదైన శైలిలో విచారించగా... అసలు విషయం వెలుగు చూసింది. వెంకటమాధవి శరీర భాగాలు లభ్యమైతే వారి పిల్లల డీఎన్ఏతో సరిపోల్చి సాంకేతిక ఆధారాలు సేకరించాలని చూస్తున్నారు. కానీ, గురుమూర్తి చెప్పిన ప్రాంతంలో ఇప్పటి వరకు మృతదేహం ఆనవాళ్లు లభ్యం కాకపోవడంతో ఈ కేసుకు సంబంధించి పోలీసులు ఇప్పటి వరకు ఎలాంటి అధికారిక ప్రకటన విడుదల చేయలేదు. ఏపీలోని ప్రకాశం జిల్లా రాచర్ల మండలం జేపీ చెరువుకు చెందిన వెంకట మాధవి(35)కి అదే గ్రామానికి చెందిన పుట్ట గురుమూర్తి(39)తో 13 ఏళ్ల కిందట వివాహమైంది. వీరికి కుమార్తె, కుమారుడు ఉన్నారు. గురుమూర్తి ఆర్మీలో పనిచేసి పదవీ విరమణ చేసి ప్రస్తుతం డీఆర్‌డీవోలో కాంట్రాక్టు భద్రతా సిబ్బందిగా పనిచేస్తున్నాడు. రంగారెడ్డి జిల్లా బాలాపూర్ మండలం జిల్లెలగూడ న్యూ వెంకటేశ్వరనగర్ కాలనీలో అద్దె ఇంట్లో నివాసముంటున్నాడు.




# ఆప్మెల్ ముమ్మాటికీ తెలంగాణాదే..

ఏపీలో ఉన్న ఆప్మెల్ ముమ్మాటికీ తెలంగాణాదే. మరి రాష్ట్ర ప్రభుత్వం ఎందుకు విషయం మీద మాట్లాడదు. హైదరాబాద్‌లో తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి, ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు తో గతంలో ఒకసారి జరిగిన చర్చల్లో మన అస్తి, హక్కు అయిన ఆప్మెల్ ముచ్చటే ఎవరూ ఎత్తలేదు. విజయవాడలో ఉన్న 'ఆప్మెల్ ' మనది సీఎం రేవంత్ జీ! జరా దృష్టి పెట్టండి. గత బిఆర్ఎస్ ప్రభుత్వం దాని కోసం గట్టి ప్రయత్నం చేయలేదు. షీలాబీడే కమిటీ అన్యాయపు రిపోర్ట్ మీద చడీ చప్పుడు లేదు. సింగరేణి చూస్తున్న డిప్యూటీ సీఎం బట్టి విక్రమార్క జీ ఒకసారి 'ఆప్మెల్ ' మీద సమావేశం ఏర్పాటు చేయాలి. తెలంగాణాకు గుండెకాయ, కొంగు బంగారం అయిన,దేశంలోనే మొట్టమొదటి ప్రభుత్వ రంగ సంస్థ అయిన సింగరేణి ప్రగతి బాటలో పయనిస్తోంది.ఐఆర్ఎస్ అధికారి ఎన్. బలరాం లాంటి నిజాయితీ, పట్టుదల గల అధికారిని సంస్థ కు సీఎండీ గా నియమించడం ద్వారా నల్ల నేల భవిష్యత్తు మీద ఆశలు పెరిగాయి.ఒకవైపు బొగ్గు బ్లాక్ కోసం పోరాటం, ఆరాటం జరుగుతుంది. సింగరేణి భవిష్యత్తు బొగ్గు బ్లాక్ల మీదే ఆధార పడి ఉన్నది. కేంద్రం జాప్యం చేయకుండా సింగరేణికి బొగ్గు బ్లాక్‌లు కేటాయించాలి.



**ఎండి.మునీర్**
సీనియర్ జర్నలిస్ట్, విశ్లేషకులు
9951865223

### తెలంగాణ హక్కు మీద ఉక్కుపాదం వద్దు

తెలంగాణ హక్కు అయిన బ్లాకులు తెలంగాణ లోని సింగరేణి కే ఇవ్వాలి. అందుకోసం వేలం చట్టం లోని 17(ఎ ) ను అనుసరించి వేలంలో పాల్గొనకుండానే బ్లాక్ లను కేటాయించాలి. ఈ ప్రాంత యువత భవిష్యత్తు దీని మీదే ఆధార పడి ఉన్నది, అనే విషయాన్ని విస్మరించరాదు.135 సంవత్సరాల చరిత్ర కలిగిన సింగరేణి లో తెలంగాణ ఏర్పడిన తర్వాత అద్భుతమైన విజయాలను తన సొంతం చేసుకుంటుంది. తెలంగాణను సింగరేణిని మినహాయించి చూడలేం..తెలంగాణ ఏర్పాటు ఉద్యమం లో సింగరేణియుల పాత్ర కీలకం,వారి కంట్రిబ్యూషన్ మరువలేం.మలి, తొలి అన్ని ఉద్యమాల్లో నల్ల సూర్యులు ముందున్నారు. సింగరేణి లేని తెలంగాణను ఊహించుకోలేం. ఆంధ్రప్రదేశ్ నుంచి విడిపోయి పది సంవత్సరాలు అవుతుంది. విజయవాడ, వైజాగ్ లలో వంద ల కోట్ల విలువగల సింగరేణి భూములు ఉన్నాయి.ఈ పది సంవత్సరాల నుంచి ఆంధ్రప్రదేశ్ లో ఉన్న సింగరేణికి చెందిన దాదాపు రూ.1000 కోట్ల ఆస్థి అయిన ఆంధ్రప్రదేశ్ హెవీ మిషినరీ మ్యానుఫాక్చరింగ్ అండ్ ఇంజనీరింగ్ లిమిటెడ్ (ఏపీహెచ్ఎంఈఎల్) సింగరేణికి చెందినదే. విభజన చట్టం ప్రకారం ఇది సింగరేణికి చెందాలి. ఇప్పటి వరకు ఈ పది సంవత్సరాలోనూ సింగరేణి డైరెక్టర్ ఆపరేషన్స్ ఉన్న వారే దీనికి చైర్మన్ గా ఇతర సింగరేణి వారు సభ్యులుగా పాలక మండలి కొనసాగుతుంది. ఇప్పటి వరకు పది ఏండ్లలో షెడ్యూల్ 9లో ఉన్న సంస్థల విభజనకు సంబందించి షీలాబీడే కమిటి పది సార్లు సమావేశమైంది. అటు ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ సమావేశాలు జరిగినప్పుడు రావాలని పలుమార్లు సింగరేణి యాజమాన్యానికి ఆదేశాలు ఇచ్చినప్పటికి ఎప్పుడు కూడ వెళ్లలేదు. ఎందుకు వెళ్ళాలి? అక్కడి అసెంబ్లీకి మన వాళ్ళను పిలిచే హక్కు ఎలా ఉంటుంది?ఆప్మెల్ ఏపీ 2018 మార్చిలో జరిగిన సమావేశం అనంతరం షీలాబీడే కమిటీ ఆప్మెల్ ఆంధ్రప్రదేశ్ చెందుతుందని, తేదీ 18-03-2018న ఒక నివేదికను ఇవ్వడం జరిగింది. 2019లో ఇందుకు సంబందించి ఒక సమావేశం జరిగింది. 81.54 శాతం సింగరేణి వాటా!అప్పుడు కూడా సింగరేణి యాజమాన్యం ఆప్మెల్ తమదేనని వాదించింది. దీనిపై కేంద్రహెూం శాఖ నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. అప్పటి నుంచి ఇప్పటి వరకు దీనిపై నిర్ణయం తీసుకోవాల్సిన కేంద్ర హెూం శాఖ ఎలాంటి నిర్ణయాన్ని ప్రకటించలేదు. ఎందుకంటే ఇందులో సింగరేణికి 81.54 శాతం వాటా ఉంది. ఏపీఐడీసీకి 5.79 శాతం వాట ఉంది. పబ్లిక్ షేర్ హెూల్డర్లు 11.81 శాతం ఉన్నారు. దీని ప్రకారం ఆప్మెల్ తెలంగాణలోని సింగరేణికి చెందుతుంది. షీలాబీడే కమిటీ తీసుకున్న నిర్ణయం షెడ్యూల్ 9 ప్రకారం పూర్తి విరుద్దమైనది. తెలంగాణ రాష్ట్రం ఈ విషయంలో కేంద్రానికి లేఖ రాసింది. గతంలో మాజీ సీఎం కేసీఆర్ కూడా దీనిపై కేంద్ర ప్రభుత్వంతో కూడా చర్చించడం జరిగింది. వాస్తవానికి విజయవాడ లోని కొండాపూర్ సమీపంలో 1976లో ఏర్పడిన ఆప్మెల్ ఆంధ్రప్రదేశ్ ఇండస్ట్రీయల్ డెవలప్మెంట్ కార్పోరేషన్ కిందికి వస్తుంది. కాబట్టి ఆస్థి పంపకాల పరిధిలోకి అసలు రానే రాదు. 1994లో టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సింగరేణికి ఆప్మెల్ అప్పజెప్పింది. భారీ నష్టాలలో కూరుకపోయి దాదాపు మూతపడే పరిస్థితుల్లో సింగరేణి దీనిని టేకోవర్ చేసి, పెట్టుబడులు పెట్టి,వరుసగా ప్రతి సంవత్సరం గతంలో రూ.50 కోట్లకు పైగా లాభాల్లోకి తీసుకొచ్చింది. అటు కేంద్రానికి అంధ్రప్రదేశ్ కు విభజన అనంతరం టాక్స్ లు కూడా చెల్లించడం జరుగుతుంది. పైగా సిబ్బందికి అక్కడ వేతనాలు కూడా సింగరేణి ఇస్తుంది. రూ. 35 కోట్ల టర్నోవర్ కొనసాగుతుంది. గతంలో రూ.75 కోట్ల టర్న్ ఓవర్ ఉండేది.రూ.50 కోట్లకుపైగా సింగరేణి ప్రతి సంవత్సరం ఆప్మెల్ కు అర్డర్లు కూడా ఇవ్వడం జరుగుతున్నది. క్యాష్ రిజర్వ్ లు కూడా దీనికి ఉన్నాయి. దీనంతటికి సింగరేణి కారణం.

### గతంలో లగడపాటి కన్ను

అమరావతికి 8 కిలోమీటర్ల దూరంలో దాదాపు 250 ఎకరాల భూమి, అటోనగర్లో 30 ఎకరాలు ఇలా మొత్తం రూ.1000 కోట్ల విలువ చేసే భూములు అప్మెల్ ఆస్థిగా ఉన్నాయి. గతంలో మాజీ ఎంపీ లగడపాటి రాజగోపాల్ ఈ భూములను కొనుగోలు చేసే ప్రయత్నం చేయగా తెలంగాణ ఉద్యమ నేపథ్యంలో సింగరేణీయులు ఆందోళన చేయగా ఆగిపోయింది. అలాంటి అప్మెల్ ఇప్పుడు షీలాబీడే కమిటీ సిఫార్సుతో ఎకాఎకిన ఆంధ్రప్రదేశ్ కు ఎలా ఇస్తారు..? ఎలా వరిస్తుంది.. ? మొత్తానికి ఖాయిలా పడే,మూతబడిపోయే స్థాయిలోఉన్న సంస్థను సింగరేణి అప్పట్లో ఉమ్మడి రాష్ట్రం లోని తెలుగుదేశం ప్రభుత్వం రివైవల్ పేరిట ఒక జీవో జారీ చేసి అంటగడితే దానిని లాభాల బాటలోకి తీసుకురావడం తప్పయి పోయిందా? మా ఆప్మెల్ ఏపీ ది ఎలా అవుతుంది?ఇప్పటికి సౌత్ ఈస్టర్న్ సంస్థ నుంచి రూ. 10 నుంచి రూ. 18 కోట్ల వరకు ఆప్మెల్ కు ఆర్డర్లు వస్తూనే ఉన్నాయి. గతంలో ఒక ఏడాది సింగరేణి ఆర్డర్ తగ్గితేనే రూ.2 కోట్ల వరకు నష్టాలు వచ్చిన దాఖలాలున్నాయి. అలాంటిది సింగరేణి లేకుండా ఈ రోజు ఆ రూ.35 కోట్ల టర్నోవర్ కాకుండా దాదాపు రూ -1000 కోట్ల ఆస్తిగా ఉన్న ఆప్మెల్ దాని భూములు ఆంధ్రప్రదేశ్‌కు ఎలా వర్తిస్థాయి ? సింగరేణి యాజమాన్యం, సింగరేణి డైరెక్టర్స్, తెలంగాణ ప్రభుత్వం అప్మెల్ తెలంగాణాదే అని అంటున్నారు. వీరికంటే ఎక్కువగా తెలంగాణ ప్రజలు కూడా ఆప్మెల్ తెలంగాణాదే అంటున్నారు. దానిని టేకోవర్ చేసినప్పుడు ఒక కార్పోరేషన్ గా తీసుకున్నప్పుడు అది తెలంగాణది కాకుండే అంధ్రప్రదేశ్ ది ఎలా అవుతుంది. కేంద్ర ప్రభుత్వం న్యాయంగా ఆలోచించాలి. లేని పక్షంలో ఆప్మెల్ కోసం తెలంగాణలో మరో ఉద్యమం తప్పదు. అక్కడ ఉద్యోగులను తెలంగాణ ఉద్యోగులుగా, సింగరేణి ఉద్యోగులుగా ఇంకా సింగరేణి భావిస్తునే ఉంది. వారికి ఇంకా సింగరేణి జీతాలు ఇస్తూనే ఉంది. ఒడిస్సాలోని నైనీలో 50 మిలియన్ టన్నుల బొగ్గు బ్లాకు ను సింగరేణికి కేంద్రం కేటాయించింది. దానిని తవ్వడానికి సంస్థ సిద్దపడి రూ. 500 కోట్ల వరకు పెట్టుబడులు పెట్టడం జరిగింది.వచ్చే మార్చ్ నుంచి నైని లో ఉత్పత్తి ని ప్రారంభించడానికి రెడీ అవుతున్నది, సింగరేణి!ఇటీవలి మన డిప్యూటీ సీఎం బట్టి విక్రమార్క,సింగరేణి సీఎండీ ఎన్. బలరాం లు,నైని ని సందర్శించి వచ్చారు.ఒడిశా ప్రభుత్వం తో మాట్లాడి వచ్చారు. ఒక కార్యక్రమం లో మన తెలంగాణ బిడ్డ, బొగ్గు శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి కూడ పాల్గొన్నారు.అది తెలంగాణ ఆస్థి. తెలంగాణ బొగ్గు బ్లాక్ కాకుండా ఒరిస్సాది అవుతుందా. ? రేపు దాని నుంచి రాయల్టీలు, ఇతర పన్నులు,వగైరా ఒరిస్సా ప్రభుత్వం, కేంద్రం తీసుకుంటాయి కదా!.. అనవసరమైన వాదనకు వెల్లకుండా తెలంగాణకు ఆప్మెల్ బేషరతుగా అప్పజెప్పాల్సిందే. ప్రస్తుతం ఐదు సంవత్సరాలు వరుసగా రూపాయలు మూడు నుంచి పది కోట్ల నష్టాల్లో ఆప్మెల్ కొనసాగింది.గత ఆర్థిక సంవత్సరం అయిన 2022- 2023 లోనే 35 కోట్ల టర్నోవర్ తో 2.5 కోట్లు స్వల్ప లాభాల్లోకి సంస్థ వచ్చింది.సింగరేణి గతంలో రూ. 60 కోట్లు, అటు కోల్ ఇండియా రూ. 20 కోట్ల పనులను ఆప్మెల్ కు అందజేయడంతో దీని టర్నోవర్ రూ. 80 నుంచి వంద కోట్లు ఉండేది. ప్రస్తుతం,ఒకప్పుడు 600 వరకు ఉన్న ఉద్యోగుల సంఖ్య 180 కి పడి పోయింది.106 మంది పర్మనెంట్,74 మంది దాకా అవుట్ సోర్సింగ్ కార్మికులతో నడిపిస్తున్నారు.ఆప్మెల్ లో బొగ్గు బావుల్లో వాడే మ్యాన్ రైడింగ్, షావల్ బకెట్స్ రిపేర్ చేస్తారు. కన్వేయర్ బెల్ట్ తయారీ మిషనరీ ని ఉత్పత్తి చేస్తారు. చాలా కాలంగా ఆర్డర్స్ తగ్గాయి. రిక్రూట్మెంట్ లేదు. ఖాళీగా స్థలం ఉంది.




**అన్యాక్రాంతం కాకుండా చూడాలి :** దానిని వాడుకోవచ్చు, రైల్వే లైన్ పక్కనే స్థలం ఉంటుంది. వైజాగ్ లోనూ తొమ్మిది నుంచి ఎనిమిది ఎకరాల స్థలం ఉంది. ఇది కూడా సింగరేణి దే, సింగరేణి ఆస్తి మాత్రమే! కోవిడ్-19 నేపథ్యంలో భారీ నష్టాలు అప్మెలుకు వచ్చినట్లు చెబుతారు.సింగరేణి సీ,ఎండీ ఎన్.బలరాం నేతృత్వంలో అప్మెల్ చైర్మెన్ గా ఉన్న సింగరేణి డైరెక్టర్ అపరేషన్స్,గా ఉన్న వెంకటేశ్వరరెడ్డి అప్మెల్ వ్యవహారాలను చూస్తున్నారు. ముమ్మాటికి 'ఆప్మెల్' సింగరేణి ది,ఈ ఆస్థిపై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి ఎలా హక్కు ఉంటుందని తెలంగాణ ప్రభుత్వం కూడా గతంలో కేంద్రానికి లేఖ రాసింది.సింగరేణి ఆస్తి అయిన ఆప్మెల్ అనేది ఒకటి, ఆంధ్రప్రదేశ్ లో ఉన్నదని, ఇప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం తెలుసు కోవాలి. అక్కడి అధికారులు, సింగరేణి సీఎండీ తో ఈ విషయం లో సమావేశం అయి, ఆంధ్రప్రదేశ్ విభజన కోసం ఏర్పాటు అయిన షీలా బిడే నేతృత్వం లో ఏర్పాటు చేసిన రీ ఆర్గనైజెషన్ కమిటీ ఇచ్చిన రిపోర్ట్ ను స్టడీ చేయాలి.ఈ కోల్ బెల్ట్ ప్రాంత ఎమ్మెల్యే లు, ఎంపీలు,ప్రజాప్రతినిధులు కూడా ఈ విషయంలో ప్రత్యేక శ్రద్ధను తీసుకోవాల్సిన అవసరం ఉంది.అక్కడి భూములు అన్యాక్రాంతం కాకుండా కాపాడుకుందాం!సీఎం రేవంత్ రెడ్డి జీ విషయం మీద దృష్టి పెట్టండి! డిప్యూటీ సీఎం బట్టి విక్రమార్క జీ జరా దేఖో!

# రిజర్వేషన్లతో రాజ్యాధికారం సాధ్యమేనా?

విద్యలో రిజర్వేషన్.. ఉద్యోగాల్లో రిజర్వేషన్.. సర్పంచ్‌గా నిలబడాలన్నా రిజర్వేషన్.. కౌన్సిలర్ గా పోటీ చేయాలన్నా రిజర్వేషన్.. మున్సిపల్ చైర్ పర్సన్.. జడ్పీ చైర్ పర్సన్ కావాలన్నా రిజర్వేషన్.. ఇలా అన్నింటా రిజర్వేషన్లు అమలు చేస్తున్న పాలకులు.. రాజ్యాధికారం విషయానికి వచ్చే సరికి మాత్రం మౌనం వహిస్తున్నారు. వివిధ వర్గాలు రాజ్యాధికారం సాధించే అవకాశాలున్న పదవులైన మంత్రి, సీఎం, ప్రధాన మంత్రి పదవుల విషయంలో మిన్నకుండిపోతున్నారు.

### స్థానిక, మున్సిపల్ రిజర్వేషన్లపై చర్చ

ప్రస్తుతం తెలంగాణలో త్వరలో జరగబోయే మున్సిపల్, స్థానిక సంస్థల ఎన్నికలపై జోరుగా చర్చ నడుస్తున్నది. బీసీ రిజర్వేషన్లను ఫైనల్ చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన బీసీ డెడికేటెడ్ కమిషన్ త్వరలో నివేదిక అందజేయనుంది. ఈ నేపథ్యంలో నగరాలు, పట్టణాలు, మండల కేంద్రాలు, గ్రామాల్లో ఇప్పుడు చర్చ అంతా రిజర్వేషన్ల గురించే. ఏ వార్డు ఎవరికి కేటాయిస్తారు? ఏ వర్గానికి అది రిజర్వు అవుతుంది? అనే అంశాలు రాజకీయ వర్గాల్లో చర్చకు వస్తున్నాయి. రిజర్వేషన్ అనుకూలంగా వస్తే సంబరాలు.. లేకుంటే నిరాశ అనే పరిస్థితి ఉన్నది. రిజర్వేషన్ అనుకూలంగా లేకపోతే అప్పటి వరకు ఆ కాలనీలో ప్రజలకు సేవలందించిన కౌన్సిలర్ ఎన్నికల బరిలో నిలబడలేని పరిస్థితి వస్తుంది. మరికొందరికి అదృష్టం కలిసి వస్తుంది. స్థానిక సంస్థల ఎన్నికల్లో సైతం ఇదే పరిస్థితి. పోటీ చేయాలనుకున్న వారు పోటీకి దూరమైపోతారు. అనుకోని అదృష్టం కలిసి వస్తే మరికొందరు సర్పంచులుగా గెలుపొందుతారు. మరికొందరు జడ్పీ చైర్ పర్సన్, మున్సిపల్ చైర్ పర్సన్ పీఠాలను అధిరోహిస్తారు.

### ర్యాండమైజేషన్ పద్ధతి..

స్థానిక సంస్థలు, మున్సిపాలిటీల్లో ర్యాండమైజేషన్ పద్ధతిలో ఆయా వార్డులకు రిజర్వేషన్ కేటాయిస్తారు. సర్పంచ్ అయినా, కౌన్సిలర్ అయినా.. మున్సిపల్, జడ్పీ చైర్ పర్సన్లయినా.. రిజర్వేషన్ మారుతూ ఉంటుంది. గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఈ రిజర్వేషన్ ర్యాండమైజేషన్ కాలపరిమితిని పదేండ్లుగా నిర్ణయించగా, ఏడాది క్రితం అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం దీన్ని ఐదేండ్లకు కుదించింది. ర్యాండమైజేషన్ పద్ధతిలో రిజర్వేషన్లు అమలు చేస్తుండడం బడుగు, బలహీన, అణగారిన వర్గాలకు లాభమే. ఒకటి, రెండు సార్లయినా పదవులను అధిరోహించే అవకాశం దక్కుతుంది. అయితే రిజర్వేషన్ జనరల్ అయితే పార్టీలు ఎస్సీ, ఎస్టీ, బీసీలకు అవకాశమిచ్చిన దాఖలాలు చాలా తక్కువ. అగ్రవర్ణాల వారికే అవకాశమిస్తూ ఉంటాయి. ఇంకా తాము ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల సంక్షేమానికి పని చేస్తున్నామంటూ ఊదరగొడుతూ ఉంటాయి.

### చిత్తశుద్ధిని శంకించాల్సిందే..


అవసరమున్నప్పుడు రాజ్యాంగాన్నే సవరిస్తున్న పాలకులు.. ముఖ్యమంత్రి, ప్రధానమంత్రి లాంటి పదవులకు రిజర్వేషన్ అమలు విషయంలో మౌనంగా ఉండడంతో వారి చిత్తశుద్ధిని శంకించాల్సి వస్తున్నది. భారతదేశంలో ప్రతి ఎన్నిక పరోక్ష పద్ధతిలోనే ఉంటుంది. అయితే స్థానిక సంస్థల ఎన్నికలనేవి కొన్ని రాష్ట్రాల్లో ప్రత్యక్ష పద్ధతిలో జరుగుతుండగా.. మరికొన్ని రాష్ట్రాల్లో పరోక్ష పద్ధతిలో నిర్వహిస్తారు. ఉమ్మడి రాష్ట్రంలో ముఖ్యమంత్రిగా వైఎస్ ప్రమాణ స్వీకారం చేసే వరకు స్థానిక సంస్థల ఎన్నికలను ప్రత్యక్ష పద్ధతిలోనే నిర్వహించారు. ఆ తర్వాత నిబంధనలను మార్చి వైఎస్ఆర్ పరోక్ష పద్ధతిలో స్థానిక సంస్థల ఎన్నికలను నిర్వహించారు. మున్సిపాలిటీ విషయానికి వస్తే




కౌన్సిలర్లంతా కలిసి మున్సిపల్ చైర్ పర్సన్ ను ఎన్నుకోవాల్సి ఉంటుంది. అదే అసెంబ్లీలో ఎమ్మెల్యేలంతా కలిసి ముఖ్యమంత్రిని, పార్లమెంట్ లో ఎంపీలంతా కలిసి ప్రధానమంత్రిని ఎన్నుకుంటారు. మున్సిపల్ చైర్ పర్సన్ ఎన్నిక విషయంలో రిజర్వేషన్ అమలు చేస్తున్న పాలకులు.. మరీ ముఖ్యమంత్రి, ప్రధానమంత్రి ఎన్నిక విషయంలో రిజర్వేషన్ గురించి మాట మాత్రం కూడా మాట్లాడరు.

### మరో ఉద్యమానికి సిద్ధం కావాలి..

ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశమైన భారతదేశంలో ఇప్పటి వరకు బడుగు, బలహీన, అణగారిన వర్గాల నుంచి ముఖ్యమంత్రులు, ప్రధానమంత్రులుగా ఎన్నికైన వారు అంతంత మాత్రమే. ఒకటి, రెండు సార్లు అవకాశమొచ్చినా.. ఆ తర్వాత అగ్రవర్ణాల కుట్రలకు వారు బలవుతూనే ఉన్నారు. జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లను అమలు చేస్తున్నామని గొప్పలు చెప్పుకునే రాష్ట్ర, దేశ పాలకులు.. తమ మంత్రివర్గంలో ఎందరికి అవకాశమిచ్చారో చెప్పుకోలేకపోతారు. దశాబ్దాలపాటు దేశాన్ని పాలించిన అగ్రవర్ణాలు బడుగు, బలహీన, అణగారిన వర్గాల అభివృద్ధి కోసం చేసింది అంతంత మాత్రమే. అయితే వారికి అన్ని రంగాల్లో అవకాశమిస్తామని గొప్పలు చెప్పుకుంటూనే.. రాజ్యాధికారం విషయానికి వచ్చే సరికి మౌనం వహిస్తారు. ప్రస్తుత పరిస్థితుల్లో ప్రజాస్వామ్యంలో ఎన్నికల్లో గెలవాలంటే కోట్ల రూపాయల డబ్బు అవసరం. అది ఎలాగూ బడుగు, బలహీన, అణగారిన వర్గాల వద్ద లేదు. అయితే ప్రధానమంత్రి, ముఖ్యమంత్రి పదవులకు సైతం రిజర్వేషన్లు అమలు చేస్తే రాజ్యాధికారం సాధించే అవకాశం వస్తుంది. ఈ దిశగా బడుగు, బలహీన, అణగారిన వర్గాలు పోరాటాలు చేయాల్సి ఉంది. కొత్త తరహా ఉద్యమాన్ని లేవదీస్తేనే ఇది సాధ్యమవుతుంది.




**ఫిరోజ్ ఖాన్**
సీనియర్ ఫ్రీలాన్స్ జర్నలిస్ట్
9640466464


# పరిశోధనే ఎన్నో ప్రయోగాలకు వేదిక

అవసరం అన్వేషణకు పురికొల్పుతుంది.అన్వేషణ పరిశోధనకు దారితీస్తుంది. ఆ పరిశోధనే ఎన్నో ప్రయోగాలను చేస్తుంది. ప్రయోజనాలను సాధిస్తుంది. అలాంటి ఉన్నత పరిశోధనలు చేసి ఫలితాలు సాధించి సమాజానికి పంచిన శాస్త్రవేత్త స్టీఫెన్ హాకింగ్. చదువులకు నిలయమైన ఆక్సఫర్డ్ లో తేదీ 8-1-1942 న జన్మించిన స్టీఫెన్ హాకింగ్ ప్రపంచవ్యాప్తంగా పేరొందిన అరుదైన శాస్త్రవేత్త. ఆయన జీవిత విశేషాలను గురించి, పరిశోధన రంగంలో ఆయన సల్పిన కృషిని గురించి తెలుగులో కె.బి.గోపాలం గారు వెలువరించిన స్టీఫెన్ హాకింగ్ అనే పుస్తకం పాఠకులకు ఎన్నో విషయాలను తెలియజేస్తుంది. 120 పుటలు గల ఈ గ్రంథంలో రచయిత శాస్త్ర విషయాలను ఎంతో సరళంగా వివరించారు. విద్యార్థులకు ఇది ఎంతో ఉపయుక్తమైన గ్రంథం. నూతన ఆలోచనలకు స్ఫూర్తినిస్తుంది.

వ్యవసాయ రంగానికి చెందిన కుటుంబమే అయినా చదువు పట్ల ఆసక్తి అభిమానం గల కుటుంబం. తండ్రి ఫ్రాంక్ వైద్య వృత్తిలో ఉండేవాడు. చిన్నప్పటినుండి స్టీఫెన్ కు రైలు, విమానాలు,ఓడలు, బొమ్మలు, అవి నడిచే విధానం వాటి అంతర్ నిర్మాణం పట్ల ఆసక్తిని కనబరిచేవాడు. తండ్రి అతడిని పెద్ద కుటుంబాల వాళ్ల చదివే పాఠశాలలో చేర్పించాలి అనుకున్నాడు కానీ కుదరలేదు. సైన్స్ పట్ల అతనుకున్న ఆసక్తిని గమనించి తోటి విద్యార్థులంతా హాకింగ్ ను ఐన్స్టీన్ అని పిలుస్తుండేవారు. తనకు రాని విషయాలను ఇతరులకు బోధించడం ద్వారా నేర్చుకోవచ్చు అనే విషయాన్ని ఇతర పిల్లలకు లెక్కల ట్యూషన్ చెప్పడం ద్వారా నేర్చుకున్నాడు. అలాగే భౌతిక శాస్త్రానికి విద్యార్థులు ఏ స్థాయికి చెందినవారు అన్న విషయం పట్టదు. వాళ్లు చేయగల పని గురించి మాత్రమే అక్కడ పట్టించుకుంటారన్న మాటలు గమనీయమైనవి. అంతేకాకుండా రిచర్డ్ ఫైన్ మాన్ వ్యాఖ్యల ప్రభావం వల్ల స్టీఫెన్ కాస్మాలజీ రంగంలో పని చేయాలనుకున్నాడు. ఈ నేపథ్యంలోనే అతడు చికిత్స అంటూ లేని ఏమాయో ట్రాఫిక్ లేటరల్ స్క్లెరోసిస్ అనే వ్యాధి బారిన పడ్డాడు. దీనివల్ల నాడీ కణాలు దెబ్బతినడం, కదలికలు లేకపోవడం, కండరాలు బలహీనం కావడం జరుగుతుంది. కానీ




ఈ వ్యాధి అనియంత్రితంగా నడిచే గుండె, పేగులు,లైంగిక అవయవాలు, మెదడు మీద ప్రభావం చూపదు అన్నారు. దీనినే పొడి అక్షరాలలో ఏ ఎల్ ఎస్ అని కూడా అంటారు. సాధారణంగా ఈ వ్యాధి సోకిన రోగులు రెండు మూడు సంవత్సరాలలో చనిపోతారట.కానీ ఈ వ్యాధి సోకిన తర్వాత స్టీఫెన్ హాకింగ్ 50 ఏళ్లు బతికాడు. విశ్వం పుట్టుకకు సంబంధించి మైక్రోవేవ్ రేడియేషన్ వల్ల అది ఒకప్పుడు కుదించుకుపోయి మళ్లీ విస్తరించటం అది సింగులారిటీ కావడం వలన స్థలం కాలం అనే ప్రశ్న ఉండదు అన్నారు. విశ్వంలో నల్లగా ఉండే ఖాళీ ప్రదేశాలే బ్లాక్ హెూల్స్. బ్లాక్ హెూల్స్ గురించి చెబుతూ స్టీఫెన్ అవి ఒకదానికొకటి గుద్దుకొని కలిసిపోవడం వల్ల దాని పరిణామం మొదటి రెండు బ్లాక్ హెూల్స్ కలిసిన దాని కన్నా ఎక్కువగా ఉంటుందన్నారు. హాంకాంగ్ యూనివర్సిటీలో విద్యార్థి సంఘం అధ్యక్షుడు చుంగ్వ ఆయన గురించి మాట్లాడుతూ ఐజాక్ న్యూటన్ ప్రపంచాన్ని మారిస్తే స్టీఫెన్ విశ్వాన్ని మార్చి వేశాడు అన్నారు. ఈ మాటలు వాస్తవాలు. స్టీఫెన్ హాకింగ్ రాసిన ఏ బ్రీఫ్ హిస్టరీ ఆఫ్ టైం అన్న పుస్తకం ప్రపంచంలోనే 40 భాషల్లోకి అనువదింపబడి కోటి ప్రతులకు పైగా అమ్ముడుపోయింది. విశ్వాన్ని గురించి కాలాన్ని గురించి అతను చేసిన ప్రస్తావనలు, ప్రతిపాదనలు, ప్రపంచవ్యాప్తంగా, విద్యావంతులను ఆకర్షించాయి. దీని తర్వాత అతను నాలుగైదు పుస్తకాలు రాశాడు కానీ ఈ పుస్తకమే ఆయనకు పర్యాయపదంగా నిలిచింది. ఇక వ్యక్తిగత జీవితానికి వస్తే నా ఉనికికి ఏదో ప్రయోజనం ఉండాలి. అతనికి సహాయం చేయడమే ప్రయోజనం అన్న జేన్, సహాయం లేకుండా నాకు ఒక రోజు కూడా గడిచేది లేదు, గడపాలన్న కోరిక కూడా లేదు అని పరస్పరం ప్రేమించుకుని 1965లో పెళ్లి చేసుకున్న ఆ దంపతులు 25 ఏళ్ల తర్వాత విడాకులు తీసుకున్నారు. అలాగే తనకు నర్స్ గా చాలా కాలం నుండి సేవలు అందిస్తున్న ఎలెన్ ను 1995లో రెండవ పెళ్లి చేసుకున్నాడు 2007లో ఆమె కూడా విడాకులు తీసుకున్నది. చక్రాల కుర్చీతోనే కంప్యూటర్ సహాయంతో దేశ దేశాలు తిరిగాడు ప్రసంగాలు చేశాడు. 13 విశ్వవిద్యాలయాలు ఆయన ప్రతిభను గుర్తించి డాక్టరేట్ డిగ్రీలు ఇచ్చాయి. ఆయనపై సినిమా కూడా తీశారు. నిత్య విద్యార్థిగా ఉంటూనే నిరంతర అధ్యయనం, అధ్యాపనం, పరిశోధన, పర్యటనలు,రచన వ్యాసంగంతో స్టీఫెన్ హాకింగ్ గడిపిన జీవితం శాస్త్ర రంగాల పరిశోధకులకు పథ నిర్దేశం చేస్తుంది. ఏది తనంతట తానై నీ దరికి చేరదు శోధించి సాధించాలి అన్న శ్రీ శ్రీ మాటల్ని నిజం చేస్తూ విశ్వం పుట్టుపూర్వోత్తరాలను గురించి పరిశోధించి ప్రపంచానికి ఫలితాలను అందించిన మహా మేధావి, శాస్త్రవేత్త స్టీఫెన్ హాకింగ్. అనారోగ్య కారణంతో ఆయన 14-3-2018న అస్తమించారు. ఇలా ఈ గ్రంథంలో రచయిత కె.బి.గోపాలం గారు స్టీఫెన్ హాకింగ్ జీవిత విశేషాలను సమగ్రంగా సరళ సుబోధకశైలిలో వివరించారు. ఇది విద్యార్థులకు, యువకులకు ఉపయుక్త గ్రంథం.



**డాక్టర్ శంకరమంచి శ్యాంప్రసాద్**
9989148305

## ఆంగనంలో మసిగిన కొడివెండి మజిలి




ముట్టుకు మూడు దినాలు,
నట్టింట్లో నడిరాతిరి నర్తనలు,
వంటింట్లో గర్జించు గాజులు,
చెదిరిపోయిన పూజాదీపాల వెలుగు,
ఆంగనంలో మసిగిన కొడివెండి మజిలి.

నోచుకోని నవ్వుల వెన్నెల,
నిండుగా కదులుతున్న నెత్తుటి గంగ,
చప్పర్లో పెరిగిన చీకటి పూలను,
అంగట్లో అమ్ముకున్న కాలం కాంతుల్ని.

అల్లిన బంగారు కలలకు బదులు,
గాజు ముక్కలతో నెత్తురు గుచ్చిన నీడలు,
జీవితపు పాదముద్రలను తొక్కి,
రాలిపోతున్న మట్టికట్టలా భావాలు.

మాటల మజిలీకి సమాధి రాళ్లులా,
గుండెల చప్పుళ్లకి సమరపు గజ్జెల్లా,
మరువలేని మజిలీల స్వరాల్లా,
ఇప్పటికీ విలపిస్తున్న నా ఆత్మ.



**మౌనిక నీరుడి**
9059945330
సంజీవన్‌రావుపేట్,
నారాయణఖేడ్,
సంగారెడ్డి

# సంక్షేమ పథకాల అమలు పట్ల ఆందోళన వద్దు

- గ్రామసభలలో చదివిన జాబితా ఫైనల్ కాదు
- గ్రామసభల్లో అందించిన దరఖాస్తులను విచారించాకే తుది జాబితా తయారు
- విద్యుత్ వైర్ల సమస్య పరిష్కారానికి 9 కోట్లు మంజూరు
- తిరుమలాయపాలెం మండలంలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేసిన మంత్రి పొంగులేటి



**కూసుమంచి, జనవరి 23 (జనం సాక్షి) :** సంక్షేమ పథకాల అమలు పట్ల ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, అర్హులందరికీ పథకాలు చేరేలా పటిష్ట చర్యలు చేపట్టినట్లు రాష్ట్ర రెవెన్యూ, హౌజింగ్, సమాచార పౌరసంబంధాల శాఖామాత్యులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. గురువారం మంత్రి, తిరుమలాయపాలెం మండలంలో పర్యటించి పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేసారు. తిరుమలాయపాలెం మండలం కేశవపురం గ్రామంలో 10 లక్షలతో, తిప్పారెడ్డిగూడెంలో 15 లక్షలతో, జల్లేపల్లి గ్రామంలో 30 లక్షలతో, హైదర్ సాయిపేట గ్రామంలో 25 లక్షలతో, పడమటితండ గ్రామంలో 20 లక్షలతో చేపట్టిన సీసీ రోడ్ల నిర్మాణాలకు, జోగులపాడు గ్రామంలో 35 లక్షలతో చేపట్టిన గ్రామ పంచాయతీ భవనం నిర్మాణ పనులకు, సీసీ రోడ్ల నిర్మాణ పనులకు, చంద్రుతండ గ్రామంలో 13.30 లక్షలతో, మహమ్మదాపురం గ్రామంలో 20 లక్షలతో చేపట్టిన సీసీ రోడ్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డిమాట్లాడుతూ,కేశవపురం గ్రామంలో రాబోయే 5 రోజులలో హైటెన్షన్ విద్యుత్ వైర్లకు సంబంధించి పనులు ప్రారంభమవుతాయని అన్నారు. 4 పథకాల అమలుకు సంబంధించి నిర్వహించిన గ్రామ సభలలో చదివిన జాబితా ఫైనల్ కాదని, ప్రజల నుంచి వచ్చిన దరఖాస్తులను పరిశీలించి అర్హులైన వారికి రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్లను ఇచ్చే బాధ్యత తనదని అన్నారు. గ్రామ సభ జాబితాలో పేరు లేకపోతే ఆందోళన అవసరం లేదని అన్నారు. జనవరి 26 నుంచి ఇందిరమ్మ ఇళ్లు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రైతు భరోసా, రేషన్ కార్డుల జారీ ప్రారంభమవుతాయని, ఈ పథకాలకు అర్హుల ఎంపిక నిరంతరాయంగా కొనసాగుతుందని అన్నారు. గ్రామ సభలలో చదివే జాబితాలో అనర్హులు ఉంటే లిఖిత పూర్వకంగా సమాచారం అందిస్తే విచారించి తొలగించడం జరుగుతుందని అన్నారు. తిప్పారెడ్డిగూడెంలో పూర్తి స్థాయిలో సిమెంట్ రోడ్డులు నిర్మాణం చేయనున్నట్లు, ఇంటి మీద నుంచి వెళ్ళే విద్యుత్ లైన్ల తొలగింపు, విద్యుత్ లైన్ ఎక్స్ టెన్షన్ పనులు మంజూరయ్యాయని, వరదల కారణంగా దెబ్బతిన్న రోడ్లు మళ్ళీ వేసుకునేందుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపామని అన్నారు. జోగులపాడు గ్రామంలో 20 లక్షలతో జీపి భవనం, 15 లక్షలతో సీసీ రోడ్లు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసుకున్నామని అన్నారు. గ్రామంలో సాగుకోసం ఏర్పాటు చేసిన మోటర్ కు విద్యుత్ సరఫరా చేసే విధంగా 4 పోల్స్ ను వెంటనే ఏర్పాటు చేయాలని మంత్రి ఆదేశించారు. ఈ కార్యక్రమంలో నీటిపారుదల అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ ఎం. విజయ బాబు, పాలేరు నియోజకవర్గ ప్రత్యేక అధికారి రమేష్, ఆర్డీఓ నరసింహా రావు, తిరుమలాయపాలెం తహసీల్దార్ రామకృష్ణ, ఎంపీడీఓ. సిలార్ సాహెబ్, ప్రజా ప్రతినిధులు, అధికారులు, స్థానిక ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## అర్హులందరికీ సంక్షేమ పథకాలు అమలు చేస్తాం



**రాజేంద్రనగర్, జనవరి 23 (జనంసాక్షి) :** అర్హులందరికీ సంక్షేమ పథకాలు అమలు అయ్యేలా కృషి చేస్తానని మేయర్ ఎం.లతా ప్రేమ్ గౌడ్ పేర్కొన్నారు. జడ్పీహెచ్ఎస్ హైదర్షాకోట్ నందు ఆమె అధ్యక్షతన వార్డు సభ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా రాష్ట ముదిరాజ్ సంఘం కార్పొరేషన్ చైర్మన్ బి. జ్ఞానేశ్వర్ ముదిరాజ్, డిప్యూటీ మేయర్ పి. రాజేందర్ రెడ్డి పాల్గొన్నారు. కమీషనర్ బి. శరత్ చంద్ర ప్రభుత్వ మార్గదర్శకాలు వార్డు ప్రజలకు చదివి వినిపించారు. జాబితాలో లేని వారి నుండి నూతన రేషన్ కార్డు కొరకు, రేషన్ కార్డులో కుటుంబ సభ్యుల పేర్లు చేర్చుటకు, ఇందిరమ్మ ఇండ్లు కొరకు నూతన పెన్షన్ కొరకు దరఖాస్తులు స్వీకరించారు. జ్ఞానేశ్వర్ ముదిరాజ్, మేయర్, డిప్యూటీ మేయర్ లు మాట్లాడుతూ సంక్షేమ పథకాలలో నూతన రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్లు, దరఖాస్తు చేసుకున్న వారికి ఆయా అధికారులు ఎంపిక చేసిన అనంతరం నిజమైన లబ్ధిదారులకు అందజేస్తామని తెలిపారు.

ఈ నెల 26 నుంచి కొత్త రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్లు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రైతు భరోసా నాలుగు పథకాలను అందించడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని, రేషన్ కార్డులు నిరంతర ప్రక్రియగా కొనసాగుతుందని ఇండ్లు లేని వారికి ఇందిరమ్మ ఇండ్లు కేటాయించడం జరుగుతుందని వారు వివరించారు. ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్లు సంతోషి రాజి రెడ్డి, పుష్పమ్మ, రవీందర్ రెడ్డి, శ్రీనాథ్ రెడ్డి వివిధ పార్టీ నాయకులు, మునిసిపల్ అధికారులు పాల్గొన్నారు.

# కరీంనగర్‌లో వెజ్, నాన్‌వెజ్ మార్కెట్ ప్రారంభం





- ప్రారంభించిన కేంద్ర మంత్రి బండి సంజయ్

**కరీంనగర్ బ్యూరో, జనవరి 23 (జనంసాక్షి) :** కరీంనగర్ లోని పద్మానగర్‌లో దాదాపు రూ.14 కోట్ల వ్యయంతో నూతనంగా నిర్మించిన ఇంటిగ్రేటెడ్ వెజ్, నాన్ వెజ్ మార్కెట్ ను కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాజీమంత్రి గంగుల కమలాకర్, నగర మేయర్ సునీల్ రావు తదితరులతో కలిసి బండి సంజయ్ మీడియాతో మాట్లాడారు. కరీంనగర్ లో రూ.14 కోట్లతో నిర్మించిన ఈ వెజ్, నాన్ వెజ్ మార్కెట్ ను ప్రారంభించడం సంతోషంగా ఉందని నాకు తెలిసి రాష్ట్రంలో ప్రభుత్వ నిధులతో నిర్మించిన ఇంత మంచి మార్కెట్ ఎక్కడా లేదనుకుంటాను అని అన్నారు. ఈ మార్కెట్ కరీంనగర్ ప్రజలకు ఎంతో సౌకర్యంగా ఉంటుందని దీంతోపాటు కరీంనగర్‌లోని ఇతర వార్డుల్లోనూ ప్రజల సౌకర్యార్థం ఈ మార్కెట్లను నిర్మించి అందుబాటులోకి తీసుకురావాల్సిన అవసరం ఉందన్నారు. దానివల్ల ప్రజలకు దూరాభారం తగ్గుతుందని ట్రాఫిక్ సమస్య తగ్గుతుందన్నారు. ఈ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం ఇంకా సహకరించాలని కోరుతున్నానని అట్లాగే వివిధ అభివృద్ధి పనులకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం పెండింగ్ నిధులను చెల్లించాల్సి ఉందని వాటిని వెంటనే మంజూరు చేయాలని కోరుతున్నానని తెలిపారు. నేడు కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రి మనోహర్ లాల్ ఖట్టర్ కరీంనగర్ లో 24 గంటలపాటు మంచి నీటి సరఫరా కార్యక్రమాన్ని ప్రారంభించేందుకు సిద్ధంగా ఉన్నారని ఈ కార్యక్రమానికి రాష్ట్ర మంత్రులు శ్రీధర్ బాబు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, పొన్నం ప్రభాకర్ హాజరు కాబోతున్నారన్నారు. ఈ కార్యక్రమం సందర్భంగా కరీంనగర్ లోని హౌజింగ్ బోర్డులో నిర్వహించే సభకు ప్రజలంతా తరలివచ్చి సభను విజయవంతం చేయాలని కోరుతున్నానని కేంద్ర మంత్రి బండి సంజయ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆరెస్ నగర అధ్యక్షులు చల్ల హరిశంకర్, స్థానిక 16 డివిజన్ కార్పొరేటర్ బోనాల శ్రీకాంత్, కార్పొరేటర్లు, బీఆరెస్ నాయకులు, బిజెపి నాయకులు, కార్యకర్తలు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజల చూపు కమ్యూనిస్టుల వైపు..

- రాబోయే కాలమంతా ఎర్ర జెండాదే..
- ప్రజా ఉద్యమాలతో పాలకుల విధానాలను ఎండగట్టుతాం
- 25 నుంచి 28 వరకు సంగారెడ్డిలో సీపీఎం రాష్ట్ర మహాసభలు
- గాదె శ్రీనివాస్ రెడ్డి విగ్రహ ఆవిష్కరణలో తమ్మినేని





మిర్యాలగూడ, జనవరి 23 (జనం సాక్షి) : పాలకుల విధానాలు చూసి ప్రజలు విసిగిపోయారని, ప్రజల చూపంత కమ్యూనిస్టుల వైపేనని, రాబోయే కాలమంతా ఎర్రజెండాదేనని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం అన్నారు. నల్గొండ జిల్లా మిర్యాలగూడలో గురువారం గాదె శ్రీనివాస్ రెడ్డి విగ్రహావిష్కరణకు హాజరయ్యారు. ముందుగా ఈదులగూడెంలోని సుందరయ్య విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అక్కడే సిపిఎం జెండాను సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు చెరుపల్లి సీతారాములు ఆవిష్కరించారు. అక్కడినుండి రాజీవ్ చౌక్ మీదుగా రామచంద్ర గూడంలోని గాదె శ్రీనివాసరెడ్డి స్తూపం వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. గాదే శ్రీనివాస్ రెడ్డి స్తూపాన్ని ఆవిష్కరించిన అనంతరం జరిగిన సభలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మల్లు లక్ష్మితో కలిసి ఆయన మాట్లాడారు. పేదల కోసం నిరంతరం పోరాడేది ఎర్రజెండా మాత్రమేనన్నారు. ప్రజా సమస్యలపై ప్రజలను సమీకరించి ప్రజా ఉద్యమాలు చేస్తామని తెలిపారు అమెరికాలో ట్రంప్ గెలిస్తే దేశానికి లాభం జరుగుతుందని కొందరు భావించారని కానీ భవిష్యత్తులో 200% పనులు సరిగా అవకాశం ఉందని ఇది దేశ ఆర్థిక వ్యవస్థపై భారం పడుతుందని చెప్పారు. ట్రంపు ఆంక్షలు వల్ల భవిష్యత్తులో దేశ యువతకు నష్టం జరుగుతుందన్నారు. ప్రజా సమస్యలను చర్చించి భవిష్యత్తు కార్యచరణ రూపొందించేందుకు ఈనెల 25 నుంచి 28వ తేదీ వరకు సంగారెడ్డిలో సిపిఎం రాష్ట్ర మహాసభలు జరుగుతున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి తుమ్మల వీరారెడ్డి, రాష్ట్ర కమిటీ సభ్యులు ముదిరెడ్డి సుధాకర్ రెడ్డి, డబ్బికార్ మల్లేష్, నారీ ఐలయ్య, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కందాల ప్రమీల, పాలడుగు ప్రభావతి, పాలడుగు నాగార్జున, వీరేపల్లి వెంకటేశ్వర్లు, వన్ టౌన్, టూ టౌన్ కార్యదర్శులు డాక్టర్ మల్లు గౌతంరెడ్డి, భవాండ్ల పాండు, రవి నాయక్, శశిధర్ రెడ్డి, వరలక్ష్మి, పరశు రాములు, రాగిరెడ్డి మంగారెడ్డి,,వినోద్ నాయక్, అయూబ్, గాదె శ్రీనివాస్ రెడ్డి కుటుంబ సభ్యులు గాదె పద్మ, ప్రభాకర్ రెడ్డి, మధుసూదన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## నూతన సాంకేతికతను అందిపుచ్చుకుని మంచి ఫలితాలు సాధించాలి

- జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్



**మఖ్తల్, జనవరి 23 (జనంసాక్షి) :** పదో తరగతి విద్యార్థులు మంచి మార్కులు సాధించేందుకు నూతన సాంకేతికతను అందిపుచ్చుకోవాలని జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ సూచించారు. గురువారం మక్తల్ నియోజకవర్గంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలో పదవ తరగతి చదివే విద్యార్థినీ విద్యార్థులకు పదవ తరగతి పాఠాలు సులభంగా అర్థమయ్యేలా టూడీ, త్రీడీ యానిమేషన్, క్యూఆర్ కోడ్ కలిగిన డిజిటల్ స్టడి మెటీరియల్ ను మక్తల్ ఎమ్మెల్యే డా. వాకిటి శ్రీహరి సహకారంతో రూపొందించగా ఆ స్టడీ మెటీరియల్ పంపిణీ కార్యక్రమానికి నారాయణపేట జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ ముఖ్య అతిథిగా హాజరైయ్యారు. అనంతరం ఎమ్మెల్యే డాక్టర్ వాకిటి శ్రీహరి, జిల్లా విద్యాశాఖ అధికారి గోవిందరాజులుతో కలిసి స్టడీ మెటీరియల్ బ్రోచర్ ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలలలో పదవ తరగతి చదివే విద్యార్థినీ విద్యార్థులకు సులభంగా అర్థమయ్యేలా రూపొందించిన స్టడీ మెటీరియల్స్ ను స్థానిక ఎమ్మెల్యే తన సొంత డబ్బులతో తయారు చేయడం ఏంతో గొప్ప విషయమని అన్నారు. నూతన సాంకేతికతో తయారుచేసిన స్టడీ మెటీరియల్ ను ప్రతీ విద్యార్థి ఉపయోగించుకుని పదో తరగతిలో మంచి మార్కులు సాధించి, మెటీరియల్ అందించిన స్థానిక ఎమ్మెల్యేకు, తల్లిదండ్రులకు, పుట్టిన ఊరికి, చదివిన పాఠశాలకు, మరీ ముఖ్యంగా నారాయణపేట జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని కలెక్టర్ ఆకాంక్షించారు. గతేడాది పదో తరగతి ఫలితాల్లో జిల్లా ర్యాంకు రాష్ట్రంలోనే పదో స్థానంలో నిలించిందని, ఈ సారి కూడా అన్ని ప్రభుత్వ పాఠశాలలలో వందకు వందశాతం ఉత్తీర్ణత సాధించి జిల్లా ర్యాంకును మరింత పై స్థాయికి పెంచాలని కలెక్టర్ సూచించారు. అయితే కార్యక్రమ అనంతరం స్థానిక ఎమ్మెల్యే పదో తరగతి విద్యార్థులకు భోజన వసతిని ఏర్పాటు చేశారు. అంతేకాకుండా స్వయంగా ఎమ్మెల్యేనే విద్యార్థులకు భోజనాన్ని వడ్డించి వారితో కలిసి భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎంఈఓ అనిల్ గౌడ్, బి కే ఆర్ ఫౌండేషన్ చైర్మన్ బాలకృష్ణారెడ్డి, మాజీ జెడ్పిటిసి లక్ష్మారెడ్డి, కాంగ్రెస్ పార్టీ నియోజకర్గంలోని అన్ని మండలాల అధ్యక్షులు, ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

# పేదల అభ్యున్నతికే సంక్షేమ పథకాలు

- టిజిఐఐసి చైర్మన్ నిర్మల జగ్గారెడ్డి



**సదాశివపేట, జనవరి 23 (జనంసాక్షి) :** పేద ప్రజల అభ్యున్నతికి రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ పథకాలు అమలు చేస్తుందని టీజీఐఐసీ చైర్మన్ నిర్మలా జగ్గారెడ్డి అన్నారు. గురువారం సదాశివపేటలోని మూడో వార్డులో ప్రజాపాలన వార్డ్ సభ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నిర్మలా జగ్గారెడ్డి పాల్గొని మాట్లాడుతూ సోనియా గాంధీ,రాహుల్ గాంధీ నేతృత్వంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారథ్యంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రజా పాలన గ్రామ సభలు నిర్వహిస్తుందని అన్నారు. ఈ గ్రామ, వార్డు సభలలో కొత్త రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్లకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అర్హులైన అందరికీ సంక్షేమ పథకాలు అందిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు మునిపల్లి సత్యనారాయణ, కౌన్సిలర్లు పిల్లోడి విశ్వనాథం, పరంజ్యోతి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కంది కృష్ణ,మార్కెట్ కమిటీ డైరెక్టర్ చిరు,నాయకులు కోడూరి శరత్,రాయిపాడ్ రమేష్,మండల అధ్యక్షుడు చాట్ల సిద్దన్న,అధికారులు, నాయకులు, కార్యకర్తలు, వార్డ్ ప్రజలు పాల్గొన్నారు.

# ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పనిచేస్తున్న తెలంగాణ పోలీస్

- సైబర్ క్రైమ్ తో రూ. 180 కోట్లు రికవరీ చేశాం
- రూ. 300 కోట్లు వేరే అకౌంట్‌లోకి వెళ్లకుండా అడ్డుకున్నాం
- పోలీసుల ఆరోగ్య భద్రతకు రూ. 75 కోట్లు విడుదల చేశాం
- డీజీపీ డాక్టర్ జితేందర్



**మెదక్, జనవరి 23 (జనంసాక్షి) :** తెలంగాణ ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా తెలంగాణ పోలీస్ పనిచేస్తుందని రాష్ట్ర డిజిపి డాక్టర్ జితేందర్ తెలిపారు. డిస్ట్రిక్ట్ పోలీస్ ఆఫీస్ లో కవాతు ప్రాంగణం, సెల్యూట్ బేస్ ను ఆవిష్కరించడానికి గురువారం మెదక్ జిల్లాకు విచ్చేసిన డిజిపి డాక్టర్ జితేందర్ కు మెదక్ శాసనసభ్యులు మైనంపల్లి రోహిత్ రావు, ఎంపీ రఘునందన్ రావు, జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్, ఎస్పీ ఉదయ్ కుమార్ పుష్పగుచ్చంతో స్వాగతం పలికారు. అనంతరం పండితులు వేదమంత్రాలతో డీజీపీకు స్వాగతం పలికారు. సెల్యూట్ బేస్ ప్రాంగణాన్ని శిలాఫలకంతో ప్రారంభించారు. తదుపరి పోలీస్ కవాతు లో పాల్గొన్న డిజిపి డాక్టర్ జితేందర్ గౌరవ వందన స్వీకరించారు. ఈ సందర్భంగా రాష్ట్ర డిజిపి డాక్టర్ జితేందర్ మాట్లాడుతూ మెదక్ జిల్లాకు మంచి పరేడ్ గ్రౌండ్ రావడం శుభ సూచికం అన్నారు. పోలీస్ సంక్షేమమే ప్రథమ కర్తవ్యంగా మీకోసం నేనున్నానని అన్నారు. అమీన్పూర్, రాయపోల్, చేగుంట, నార్సింగి,మండల కేంద్రాలలో కొత్త బిల్డింగు ల మంజూరుకు ఇతర కొత్త మండల కేంద్రాలలో పోలీస్ స్టేషన్ ఏర్పాటు చర్యలు తీసుకుంటాం అన్నారు. మెదక్ ఎస్పీ ఉదయ్ కుమార్ రెడ్డి నిబద్ధత క్రమశిక్షణ గల అధికారిగా ప్రథమ స్థానంలో నిలుస్తారన్నారు.నేను నిర్మల్ ఏసీపీగా ఉన్నప్పుడు ఆయన కడెం ఎస్పైగా పనిచేశారని చెప్పారు. అప్పటినుండి మెదక్ ఎస్పీ ఉదయ కుమార్ రెడ్డి పనితీరు తెలుసన్నారు. ఇతర రాష్ట్రాలతో పోల్చుకుంటే తెలంగాణ పోలీసులు క్రమశిక్షణ గల పోలీసులుగా పేరు సంపాదించుకున్నారు అని అన్నారు. ప్రజల శాంతిభద్రత పరిరక్షణ విషయంలో పోలీసులు ఎల్లవేళలా కృషి చేస్తున్నారు అని వివరించారు. నక్సల్స్ సమస్యల మీద నార్కోటిక్ డ్రగ్స్ మీద ప్రత్యేక దృష్టి సారిస్తున్నాం అని పేర్కొన్నారు. తెలంగాణ పోలీసు పటిష్టంగా ఉంది టెక్నాలజీని సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకొని కేసును త్వరితన ఛేదించేందుకు కృషి చేస్తున్నాం అన్నారు. పోలీస్ శాఖ ప్రభుత్వం పూర్తిస్థాయిలో సహకరిస్తుంది అని చెప్పారు. మెదక్ ఎంపీ రఘునందన్ రావు మాట్లాడుతూ పోలీసులంటే 24 గంటలు డ్యూటీలు ఉండే వ్యక్తులు..ప్రతిపక్ష నాయకులకు పోలీసులకు బందోబస్తు కల్పించే రక్షకులు. 24 గంటలు పని చేస్తారు అన్నారు. ఈ కార్యక్రమంలోజిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్, జిల్లా ఎస్పీ ఉదయ్ కుమార్, పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ గురునాథ్ రెడ్డి,, మల్టీ జోన్ ఐజీ చంద్రశేఖర్ రెడ్డి, డీఎస్పీ ప్రసన్నకుమార్, పోలీస్ శాఖ ఉన్నతాధికారులు జిల్లాలో అన్ని మండలాల ఎస్సైలు , కానిస్టేబుల్స్ సంబంధించిన సిబ్బంది పాల్గొన్నారు.

## ఎస్సీ వర్గీకరణ వాస్తవాలపై రౌండ్ టేబుల్ సమావేశం



**ఖమ్మం, జనవరి 23 (జనంసాక్షి) :** రేపు ఉదయం 11 గంటలకు ఖమ్మం అంబేద్కర్ భవన్లోలి ఎస్సీ వర్గీకరణ వాస్తవాలు మాలలపై అసత్య ప్రచారం తదితర అంశాలపై రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించడం జరుగుతుందని మాల మహానాడు ఉమ్మడి ఖమ్మం జిల్లా కన్వీనర్ గుంతేటి వీరభద్రం తెలిపారు ఖమ్మం జడ్పీ సెంటర్లోని సంఘ కార్యాలయంలో జరిగిన ముఖ్య నాయకుల సమావేశంలో గుంతెటి మాట్లాడుతూ ఈ కార్యక్రమానికి రాజకీయ పార్టీల ప్రతినిధులు కుల ప్రజా సంఘాల నేతలు మేధావులు న్యాయవాదులు డాక్టర్లు ఉద్యోగ సంఘాల నేతలను ఆహ్వానిస్తున్నామని ప్రతి ఒక్కరూ పాల్గొని తమ అమూల్యమైన అభిప్రాయాలను తెలియజేయాలని కోరారు ఈ సమావేశంలో గౌరవ సలహాదారులు లింగాల రవికుమార్ ఐ ఎం ఎల్ ఏ ప్రధాన కార్యదర్శి మద్రి ప్రకాష్ మాల మహానాడు జిల్లా నేతలు వరద నరసింహారావు కొట్టే సుధాకర్ దాసరి శ్రీనివాస్ బిందె రమేష్ అంబడిపూడి పేతురు కామా ప్రభాకర్ పంజా నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

## అర్హత కలిగిన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు

• ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి



**మక్తల్, జనవరి 23 (జనంసాక్షి) :** రాష్ట్రంలోని అర్హత కలిగిన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతాయని ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి అన్నారు. మండల కేంద్రంలో గ్రామసభకు ఎమ్మెల్యే హాజరయ్యారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ అర్హత కలిగిన లబ్ధిదారులకు రేషన్ కార్డులు, రైతు భరోసా, ఇందిరమ్మ ఇండ్లు, ఆత్మీయ భరోసా వంటి పథకాలు అందుతాయని తెలిపారు. ఎవరికైనా రాకపోయినా అర్హత కలిగి ఉన్నవారు దరఖాస్తులు ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల స్పెషల్ ఆఫీసర్ ఉమాపతి, ఎంపీడీవో ధనుంజయ గౌడ్, ఏఓ గణేష్ రెడ్డి, ఎస్సై కృష్ణంరాజు, నాయకులు సూర్య ప్రకాష్ రెడ్డి, భాస్కర్, అరవింద్, యగ్నేశ్వర్ రెడ్డి, నారాయణరెడ్డి, భరత్, రమేష్, ఆయా శాఖల అధికారులు, నాయకులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# పథకాలకు అమలుకు కౌంట్‌డౌన్..!

• జనవరి 26 కోసం ఎదురు చూపులు

• నేటితో ముగియనున్న గ్రామ సభలు

**రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా భావిస్తున్న ఇందిరమ్మ ఇండ్లు, రైతుభరోసా కింద పెట్టుబడి సాయం, కొత్త రేషన్ కార్డులు,వ్యవసాయ కూలీలకు ఆర్థిక సాయం అందించే ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాల అమలు గడువుకు కౌంట్ డౌన్ ప్రారంభమైంది .నేటితో (శుక్రవారం) ముగియనున్న గ్రామ సభలు నాలుగు రోజుల పాటు రాష్ట్ర వ్యాప్తంగా జరిగాయి. ఈ పథకాల లబ్ది ఎంత మందికి చేకూరుతుందనే విషయం అటుంచితే, ఆయా పథకాలకు అర్హుల జాబితాలను గ్రామ మున్సిపల్ వార్డుల సభల్లో ప్రకటించి వాటిపై అభ్యంతరాలు, మార్పులు, చేర్పులను స్వీకరించారు. తర్వాత వాటికి ఆమోదం తీసుకునే ప్రక్రియను మాత్రం విజయవంతంగా పూర్తి చేశారు. అయితే ఆ నాలుగు పథకాల లబ్దిదారుల ఎంపిక ఎలా ఉంటుందో గ్రామాల వారీగా ఎంత మందికి ఇస్తారో అన్న సందేహాలు ప్రజల నుంచి వినిపిస్తున్నాయి.**

**వనపర్తి, జనవరి 23 (జనంసాక్షి)**
గ్రామ సభల్లో ప్రకటించినదే తుది జాబితా కాదని, దరఖాస్తులు చేసుకోవడం నిరంతర ప్రక్రియ అంటూ సంబంధిత ఎమ్మెల్యేలు, అధికారులు ప్రకటించడం పట్ల పలు అనుమానాలు వ్యక్తం అవుతుండడం గమనార్హం.

### రైతు భరోసా ఎన్ని పంటలకో..!

రైతులకు పెట్టుబడి సాయం కింద ఎకరాకు ఏడాదికి 12 వేల రూపాయలను ఇస్తామని ప్రకటించింది కాంగ్రెస్ ప్రభుత్వం. కాని ఎన్ని పంటలకు ఇస్తారన్న ప్రశ్న రైతుల మదిలో మెదులుతోంది. వానా కాలం, యాసంగి రెండు సీజన్ ల రైతు భరోసా నిధులు ఎకరానికి రూ.12 వేల ప్రకారం విడుదల చేస్తుందన్న ఆశలను రైతాంగం ప్రభుత్వంపై పెట్టుకొంది. రాష్ట్రంలో దాదాపు కోటి 40 లక్షల ఎకరాల సాగు భూములు ఉన్నట్లు అధికారిక సమాచారం. అంటే రైతు భరోసా మొదటి విడత జనవరి 26 ప్రారంభిస్తే ఎకరానికి 6 వేల రూపాయల చొప్పున దాదాపు కోటీ 40 లక్షల ఎకరాలకు దాదాపు 8,400 కోట్ల రూపాయలు అవసరమవుతాయని వ్యవసాయ శాఖ అంచనాకు వచ్చినట్లు తెలుస్తోంది.

### 32 లక్షల మందికి మాత్రమే ఇందిరమ్మ ఆత్మీయ భరోసా..?

తెలంగాణలో మొత్తం 53 లక్షల మందికి ఉపాధి హామీ గుర్తింపు కార్డులున్నాయి. వారిలో 32 లక్షల మంది మాత్రమే రోజూ కూలీ పనులకు వెళ్తున్నట్లు రికార్డులు చెబుతున్నాయి. ఈ కార్డుదారుల్లో




దాదాపు 21 లక్షల మందికి భూమి లేదని అధికారిక లెక్కలు చెబుతున్నాయి.

### ఈ ఏడాదికి ఇందిరమ్మ ఇళ్ళు 5 లక్షలే..!

జనవరి నెలాఖరు నుంచి ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తామని కూడా ప్రభుత్వం ప్రకటించింది. ఇల్లులేని నిరుపేదలకు ఇంటి నిర్మాణానికి 5 లక్షల రూపాయల ఆర్థిక సాయం చేయాల్సివుంది. ఇందిరమ్మ ఇళ్ల కోసం దాదాపు 84 లక్షల మంది దరఖాస్తు చేసుకున్నారు. మొదటి విడతలో నియోజకవర్గానికి 3500 ఇళ్ల చొప్పున రాష్ట్రవ్యాప్తంగా 5 లక్షల ఇళ్లను మంజూరు చేస్తామని ప్రభుత్వం స్పష్టం చేసింది. 26 జనవరి రిపబ్లిక్ దినోత్సవ కానుకగా రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయనున్న నాలుగు సంక్షేమ పథకాలు ఎలాంటి ఆటంకాలు లేకుండా లబ్దిదారులకు అందాలని ఆశిద్దాం..

## ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకంలో సెంటుభూమి లేని పేదలందరూ అర్హులు

• రాష్ట్ర ఆబ్కారీ, పర్యాటక సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు



**వనపర్తి బ్యూరో, జనవరి 23 (జనంసాక్షి) :** గణతంత్ర దినోత్సవం సందర్భంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకంలో సెంటు భూమి లేని పేదలందరిని అర్హులుగా గుర్తించాలని రాష్ట్ర ఆబ్కారీ, పర్యాటక సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు సూచించారు.గురువారం మధ్యాహ్నం పాన్గల్ మండలం గ్రామ సభలో మంత్రి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేయనన్న నాలుగు సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి లాబ్ధిదారునికి అందాలని సూచించారు. అనంతరం 61 మంది కళ్యాణ లక్ష్మి, 2 శాది ముబారక్ చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి మాట్లాడుతూ అర్హులైన లబ్ధిదారులు అందరినీ గుర్తించడమే గ్రామ సభ ముఖ్య ఉద్దేశ్యమని, గ్రామ సభ అనేది చాలా బలమైన వేదిక అని దీనిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.పాన్ గల్ గ్రామంలో ఇటీవల చేసిన రైతు రుణమాఫీ లో 658 మంది రైతులకు 5.30 కోట్ల రుణమాఫీ జరిగినట్లు తెలిపారు. రైతు భరోసా కింద 25 ఎకరాల భూమిని వ్యవసాయ యోగ్యత లేని భూమి గా గుర్తించినట్లు తెలియజేశారు.ఆర్డీఓ సుబ్రమణ్యం, ప్రత్యేక అధికారి ఉమాదేవి, తహసిల్దార్, ఎంపీడిఓ, ప్రజా ప్రతినిధులు, అధికారులు, ప్రజలు పాల్గొన్నారు.

## గ్రామసభలను పరిశీలించిన ఎస్పీ శరత్ చంద్రపవర్



**కనగల్లు, జనవరి 23 (జనంసాక్షి) :** ప్రభుత్వం ఈనెల 26 నుంచి అమలు చేయబోతున్న రైతు భరోసా ఇందిరమ్మ ఆత్మీయ భరోసా ఇందిరమ్మ ఇండ్లు కొత్త రేషన్ కార్డుల అమలుకై అర్హుల గుర్తింపు కోసం నిర్వహిస్తున్న గ్రామసభలు గురువారం మండలంలో 8 గ్రామ పంచాయతీలలో కొనసాగాయి. కనగల్లు. బచ్చన్న గూడెం గ్రామపంచాయతీలలో జరుగుతున్న గ్రామసభల తీరును జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవర్ పరిశీలించారు. గ్రామసభలకు వచ్చిన ప్రజలతో వారి యొక్క సమస్యలను నేరుగా అడిగి తెలుసుకున్నారు ప్రజలు గొడవలు వెళ్లకుండా తమ సమస్యలను నేరుగా అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించుకోవాలని సూచించారు. అధికారులు రైతు భరోసా ఇందిరమ్మ ఆత్మీయ భరోసా ఇందిర ఇండ్లు రేషన్ కార్డుల లబ్ధిదారుల జాబితాను సభలో చదివి వినిపించారు. ఎస్పి వెంట డిఎస్పి శివరామిరెడ్డి సీఐ వెంకటయ్య ఎస్సై పి విష్ణుమూర్తి ల తో పాటు మార్తినేని గూడెంలో ఎమ్మార్వో పద్మ బచ్చన్న గూడెంలో ఎంపీడీవో సిటి జయరాం చర్లగౌరారంలో ఏవో అమరేందర్ గౌడ్ షాబ్దుల్లాపురంలో డీటీ పార్వతమ్మ చిన్న మాదారంలో ఎంఈఓ పద్మ ఏమి రెడ్డి గూడెంలో ఎంపీ ఓ కే సుమలత పగిడిమర్రిలో పిఆర్ఏఐ రామకృష్ణలు నోడల్ అధికారులుగా వ్యవహరించి సభలు సజావుగా జరిగేలా చూశారు. ఏఈఓలు నవీన్ విజయలక్ష్మి అభిలాష్ రెడ్డి మౌనిక పంచాయతీ కార్యదర్శులు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## రేషన్ కార్డుల జారీ నిరంతర ప్రక్రియ

• కలెక్టర్ రాహుల్ రాజ్

**రేగోడ్, జనవరి 23 (జనంసాక్షి) :** సాగుకు యోగ్యమైన భూములకి రైతు భరోసా పథకం వర్తిస్తుందని మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ తెలిపారు.ఈసందర్భంగా రేగోడు మండలపరిధిలోని సిందోల్ గ్రామంలో ప్రజాపాలన గ్రామసభలో గురువారం నాడు కలెక్టర్ రాహుల్ రాజ్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 26 నుండి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేయనున్న రైతు భరోసా, ఇందిరమ్మ ఇళ్లు, ఆహార భద్రత (రేషన్) కార్డులు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాలకు లబ్ధిదారుల ఎంపికకు 16వ తేది నుండి 20వ తేదీ వరకు క్షేత్రస్థాయిలో విచారణ నిర్వహించినట్లు తెలిపారు. క్షేత్రస్థాయి విచారణ తదుపరి లబ్ధిదారుల గ్రామసభలలో పథకాలకు గుర్తించిన లబ్దిదారుల జాభితా గ్రామస్థులు సమక్షంలో చదివిన తదుపరి ప్రజల నుండి అబ్యంత రాలను తీసుకోనున్నట్లు తెలిపారు. ముఖ్యంగా సాగుకు యోగ్యమైన భూములను పక్కాగా నిర్ధారించామని, ఇంకనూ



ఎవరైనా ఉంటే దరకాస్తు చేయాలని సూచించారు. రేషన్ కార్డుల జారీ, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా తదితర పథకాలు నిరంతర. ప్రక్రియ అని అర్హత కలిగిన వారు ఎప్పుడైనా దరఖాస్తు చేసుకోవచ్చని ఈ సందర్భంగా కలెక్టర్ సూచించారు. సందర్భంగా కలెక్టర్ ప్రజలను స్వయంగా జాభితాపై అభ్యంతరాలున్నాయా అని అడిగి తెలుసుకున్నారు.ఈ కార్యక్రమంలో తహసీల్దార్ సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## మహిళల అభివృద్ధే దేశ అభివృద్ధి

• జిల్లా కలెక్టర్ సంతోష్



**గద్వాల నడిగడ్డ, జనవరి 23 (జనంసాక్షి) :** మహిళలు అభివృద్ధి చెందినప్పుడే దేశం అభివృద్ధి చెందుతుందని జిల్లా కలెక్టర్ బి. ఎం. సంతోష్ అన్నారు. గురువారం దౌదర్ పల్లి మెడికల్ కళాశాల వద్ద ఐదు కోట్ల రూపాయల వ్యయంతో జిల్లా మహిళ సమాఖ్య భవన నిర్మాణ పనులకు స్థానిక శాసనసభ్యులు బండ్ల కృష్ణమోహన్ రెడ్డితో కలిసి భూమి పూజ చేసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెంది కోటీశ్వరులు కావాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం అనేక కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుందన్నారు. ఇందులో భాగంగా ప్రతి సంవత్సరం పాఠశాలల విద్యార్థులకు రెండు జతల స్కూల్ యూనిఫారాలు కొట్టేందుకు అవకాశం కల్పించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ నరసింహారావు, మార్కెట్ యార్డ్ చైర్మన్ హనుమంతు, పంచాయతీరాజ్ ఈ ఈ దామోదర్ రావు, జిల్లా మహిళా సమాఖ్య అధ్యక్షురాలు సంగీత, స్థానిక ప్రజాప్రతినిధులు, మహిళా సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## గ్రామసభలను సందర్శించిన ఎమ్మెల్యే

**చింతపల్లి, జనవరి 23 (జనంసాక్షి) :** అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందజేస్తామని దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ అన్నారు. చింతపల్లి మండలంలోని వింజమూర్ ,కుర్మేడు, గ్రామాల్లో నిర్వహించిన ప్రజా పాలన గ్రామసభలను దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అర్హత ఉన్న లబ్దిదారులు జాబితాలో పేర్లు లేని వారు తిరిగి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.మహిళల ఆర్థిక స్వావలంబన కోసం ఆత్మీయ భరోసా పథకం ద్వారా వారికి ఆర్థిక సహాయం అందజేస్తున్నట్లు తెలియజేశారు..అర్హులైన పేద కుటుంబాలకు కొత్త రేషన్ కార్డులు మంజూరు ప్రక్రియను వేగవంతం చేస్తామని చెప్పారు. రేషన్ కార్డుల ద్వారా వారికి నిత్యావసర వస్తువుల సరఫరా చేయడం ద్వారా వారి జీవన ప్రమాణాలు మెరుగుపర్చాలని ప్రభుత్వ లక్ష్యంగా పెట్టుకున్నట్లు వివరించారు.. ఈ కార్యక్రమంలో మాల్ మార్కెట్ కమిటీ చైర్మన్ దొంతం అలివేలు సంజీవ రెడ్డి,




నల్గొండ పార్లమెంట్ కోఆర్డినేటర్ సిరాజ్ ఖాన్,మాజి ఎంపీపీ భవాని పవన్ కుమార్,మండల పార్టీ అధ్యక్షులు అంగిరేకుల నాగభూషణం,మాజి జడ్పీటీసీ మంజుల భాస్కర్ ,హరి నాయక్,మాజి వైస్ ఎంపీపీ యాది గౌడ్,మాజి సర్పంచ్ యాదగిరి, రాటకొండ రుద్రమదేవి నరేంద్ర ప్రసాద్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ శ్రీనివాస్ యాదవ్, నర్షి రెడ్డి,రమేష్ ,ఎంపీడీవో సి సుజాత తాహాసిల్దార్ రమాకాంత్ శర్మ,అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## నిజమైన లబ్ధిదారులకు అన్యాయం జరగకూడదనే గ్రామసభలు



**చంద్రుగొండ, జనవరి 23 (జనంసాక్షి) :** పేద ప్రజల కళ్ళల్లో ఆనందం చూడడమే నా చిరకాల కోరిక ,రాజకీయ లబ్ధి కోసం గొడవలు సృష్టించే వారి మాటలు నమ్మవద్దు అని అశ్వరావుపేట శాసనసభ్యులు జారే ఆదినారాయణ అన్నపురెడ్డిపల్లిలో జరిగిన ప్రజాపాలన గ్రామసభల్లో ఆయన పాల్గొని స్పష్టం చేశారు. ప్రజా పాలన గ్రామసభలో ఆయన మాట్లాడుతూ నాలుగు పథకాలకు సంబంధించిన పూర్తి సమాచారం ప్రజలకు విపులంగా వివరించి వారి అపోహలు తొలగించాలని అధికారులకు సూచించారు. నాలుగు గోడల మధ్య నిర్ణయం తీసుకోకుండా ప్రజల మధ్యనే అర్హులైన వారిని గుర్తించడం కోసం ఏర్పాటు చేసిన గ్రామసభలని కొంతమంది పనిగట్టుకుని ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలను తప్పుదోవ పట్టించే విధంగా ప్రజలను రెచ్చగొడుతున్నారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో మహాలక్ష్మి తో పాటు ,అధికారులు ,కాంగ్రెస్ నాయకులు ,లబ్ధిదారులు పాల్గొన్నారు.

## అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ పథకాలు

• రాష్ట్ర పర్యటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణ రావు



**ఖిల్లా ఘనపురం, జనవరి 23 (జనంసాక్షి) :** ఖిల్లా ఘనపురం మండల పరిధిలోని సాల్కెలాపూర్ గ్రామంలో గురువారం ప్రజాపాలన గ్రామ సభ సమావేశం కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు సాయి చరణ్ రెడ్డి ఆధ్వర్యం లో ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ గ్రామ సభ సమావేశానికి తెలంగాణ రాష్ట్ర మంత్రి జూపల్లి కృష్ణ రావు, పార్లమెంట్ సభ్యులు మల్లు రవి, జిల్లా కలెక్టర్ ఆదర్శ సురబి,స్థానిక శాసన సభ్యులు తుడి మేఘా రెడ్డి ముఖ్య అతిధులుగా పాల్గొన్నారు. ప్రభుత్వం చేపడుతున్న ప్రజా పాలన గ్రామ సభను ఉద్దేశించి మంత్రి జూపల్లి కృష్ణ రావు మాట్లాడుతూ ప్రభుత్వ లక్ష్యాలు అన్యాక్రాంతం కాకుండా అర్హులైన ప్రతి పేద కుటుంబానికి సంక్షేమ ఫలాలు అందాలనే గ్రామ సభలు పెట్టీ ప్రజామోదం పొందటం జరుగుతుందని రాష్ట్ర ఆబ్కారీ, పర్యాటక సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ లోకల్ బాడీస్ సంచిత్ గంగ్వార్, ఆర్డీఓ సుబ్రమణ్యం, ప్రత్యేక అధికారి సుధీర్ రెడ్డి, తహసిల్దార్ సుగుణ, ఎంపీడీఓ వెంకట చారి, కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు పాల్గొన్నారు.

## గ్రామసభలు అడ్డుకుంటూ బీఆర్ఎస్ కుట్ర రాజకీయాలు

• బీఆర్ఎస్ నాయకుల వైఖరిని ఖండించిన కాంగ్రెస్ శ్రేణులు

**చేర్యాల, జనవరి 23 (జనంసాక్షి) :** పదేండ్ల బీఆర్ఎస్ పాలనలో దళిత బంధు, బీసీ బందు పేరా లక్షల్లో కమిషన్లు తీసుకొని అవినీతి అక్రమాలకు భూదందాలకు పాల్పడిన బీఆర్ఎస్ నాయకులు నేడు పారదర్శంగా జరుగుతున్న గ్రామసభలను అడ్డుకోవడం సిగ్గుచేటని కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి పుర్మ ఆగం రెడ్డి, మండల అధ్యక్షులు కొమ్ము రవి, పట్టణ అధ్యక్షుడు దాసరి శ్రీకాంత్, యూత్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బందీగ రాకేష్ కృష్ణ తీవ్రంగా ఖండించారు. గురువారం చేర్యాల మండల కేంద్రంలోని కొమ్మూరి నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ..



తెలంగాణ రాష్ట్రంలో పదిహేను పాలించిన బీఆర్ఎస్ ప్రభుత్వ పాలనలో దళిత బంధు, బీసీ బందు, డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల పేరున ఈ ప్రాంత బీఆర్ఎస్ నాయకులు డబ్బులు వసూలు చేసి పందికొక్కుల తిని, డబ్బులు అడిగిన వారిపై దౌర్జన్యంగా దాడులకు పాల్పడి డబ్బులు ఇవ్వకుండా అక్రమంగా ఆస్తులు సంపాదించి గుండాయిజం భూకబ్జాలు చేస్తూ అక్రమాలకు పాల్పడిన బీఆర్ఎస్ నాయకులకు కాంగ్రెస్ పార్టీని విమర్శించే నైతిక హక్కు లేదని విమర్శించారు. ఈ సమావేశంలో కౌన్సిలర్లు ముస్త్యాల తార యాదగిరి, చెవిటి లింగం, జిల్లా సంయుక్త కార్యదర్శి మంచాల చిరంజీవులు ,కొమురవెల్లి ఆలయ మాజీ చైర్మన్ ఆడెపు చంద్రయ్య, యూత్ కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి అందె నాని బాబు, చేర్యాల మండల యూత్ అధ్యక్షులు భూమని బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

## కవి సవ్యసాచికి గిడుగు రామ మూర్తి జాతీయ పురస్కారం

**ఖమ్మం, జనవరి 23 (జనంసాక్షి) :** ఖమ్మం జిల్లాకు చెందిన ప్రముఖ కవి సవ్యసాచి అనువాద సాహిత్యనికి గిడుగు రామ మూర్తి పంతులు జాతీయ పురస్కారానికి ఎంపికయ్యారు. గిడుగు రామ మూర్తి ఫౌండేషన్, శంకరం వేదిక హైదరాబాద్ లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో బుధవారం నిర్వహించిన జాతీయ పురస్కారాలలో అనువాద సాహిత్యానికి గాను అవార్డును సవ్యసాచికి శాలువాతో సత్కరించి అవార్డు ప్రధానం చేశారు. సవ్యసాచి తెలుగు కవిగానే కాకుండా తెలుగు నుండి ఆంగ్ల భాషలోనికి ప్రముఖ కవుల కవిత్వాన్ని అద్భుతంగా అనువాదం చేస్తూ మంచి అనువాదకుడిగా పేరూపొందారు. అన్నవరం దేవేందర్ రచించిన "వరిగొలుసులు " కవితాసంపుటిని "గ్రెన్ చెయిన్స్ " పేరిట ఇంగ్లీష్ లోనికి అనువదించారు. ప్రముఖ కవి కె. శివారెడ్డి యొక్క ప్రాముఖ్యం పొందిన ఆయన కవిత "కవులేం చేస్తారు "ను "వాట్ ది పోయెట్స్‌డు" అని అనువదించి ఆయనకే బహుకరించారు. ప్రముఖ దిగంబర కవి "నగ్నముని" కవిత "బాహ్యాన్తరంగం "కేంద్ర సాహిత్య అకాడమీ అనువాద పురస్కార గ్రహీత "నలిమెల భాస్కర్ "కవిత సంపుటి "సుద్దముక్క"లోని అక్షరాప్రాశన కవితను "డివోషన్ ఆఫ్ లెటర్స్ "పేరిట అనువదించి సాహితీకారుల ప్రశంసలు పొందారు. ప్రముఖ కవి దేవరకొండ



బాలగంగాధర్ తిలక్ యొక్క "అమృతం కురిసిన రాత్రి "కవితను "ది నెక్టర్ షవర్డ్ నైట్ " పేరిట అనువదించారు. బిక్కి కృష్ణ అధ్యక్షతన ప్రముఖ కవుల మధ్య బుధవారం జరిగిన సభలో ఈ అవార్డును ప్రధానం చేశారు. ఈ సందర్భంగా జిల్లాకు చెందిన సాహిత్యకారులు ఆయనను అభినందించారు.

# తెలంగాణ రాష్ట్రంలో అర్హులందారికి త్వరగా రేషన్ కార్డులు ఇవ్వాలి

**మొయినాబాద్,జనవరి 23(జనం సాక్షి):**

తెలంగాణ రాష్ట్రంలో ప్రభుత్వం ద్వారా రేషన్కార్డులు ఏళ్లు గడుస్తున్నా పంపిణీ జరగలేదని ఇళ్లల్లోని కుటుంబాలు వేరుపడిన అర్హులైన వారికి నేటికి రేషన్కార్డులు ఇవ్వకపోవడం సోచనీయమని బీజేపీ చేవెళ్ల ఓబీసీ మోర్చా కన్వినర్ ఎలిగని వెంకటేష్ గౌడ్ అన్నారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ గత పది సంవత్సరాలు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ ప్రభుత్వం ఒక్క రేషన్ కార్డు ఇవ్వలేదని పేర్కొన్నారు. ఇప్పుడు అధికారంలో కాంగ్రెస్ పార్టీ సంవత్సరం గడిచిన పేదలకు రేషన్కార్డుల పరిశీలన తప్ప పంపిణి లేదని ఆరోపించారు. అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ పేద వారు ఏ పార్టీకి చెందిన వారైనా నిజమైన



లబ్ధిదారులకు, నిరుపేద కుటుంబాలందరికి రేషన్కార్డులు ఇచ్చేందుకు కృషి చేయాలని పేర్కొన్నారు. గత పది సంవత్సరాలలో అర్హులైన అనేక మంది పేదలు ధరఖాస్తులు చేసుకున్నా వాటిని రద్దు చేయడం జరిగిందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం ద్వారా అధికారులు అప్పటి నుంచి ఇప్పటి వరకు ధరఖాస్తు చేసుకున్న వారందరికి ఇవ్వాలని పేర్కొన్నారు. నిజమైన పేద వారికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా అధికారులు కృషి చేయాలని,
పార్టీలకు అతీతంగా అందించినప్పుడే ప్రభుత్వానికి మంచి పేరు వస్తుందని పేర్కొన్నారు.
ఈ లబ్ధిదారులకు సహాయం అందించేది కేంద్ర ప్రభుత్వమేనని నిజమైన లబ్ధిదారులను గుర్తించి వెంటనే రేషన్కార్డులు ఇవ్వాలని ఆయన ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

# రుణమాఫీపై శ్వేత పత్రం విడుదల చేయాలి

**హుజరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి**

**వీణవంక జనవరి 23 (జనం సాక్షి)**



వీణవంక మండలంలోని చల్లూరు గ్రామంలో గురువారం ఏర్పాటు చేసిన గ్రామసభలో హుజరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి పాల్గొని ప్రభుత్వన్ని విమర్శించారు.పాడి కౌశిక్ రెడ్డి మాట్లాడుతూ..ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రుణమాఫీ పూర్తయిందని చెబుతున్న చల్లూరు గ్రామంలో 50 శాతం రైతులకు రుణమాఫీ కాలేదని రుణమాఫీ పై రాష్ట్రవ్యాప్తంగా జరిగిన రుణమాఫీ వివరాలను శ్వేత పత్రం ద్వారా విడుదల చేయాలని అన్నారు. ప్రజాపాలనలో వచ్చిన దరఖాస్తులను ఆన్లైన్ చేయకపోవడం వల్ల ప్రజలు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారని,ప్రజలు దరఖాస్తు పెట్టిన ప్రతిసారి లబ్ధిదారులకు ఖర్చు అవుతుందని అన్నారు.అర్హులైన ఎస్సీ,ఎస్టీలకు ఇందిరమ్మ ఇల్ల కోసం హామీ ఇచ్చి ఇప్పటివరకు లబ్ధిదారులకు అమలు చేయలేకపోయారని అన్నారు. అర్హులందరికీ రేషన్ కార్డుల విషయంలో ఆదాయం పరిమితి పెంచిన అర్హులందరికీ అందరికీ తెల్ల రేషన్ కార్డులు అందడం లేదని వారు అన్నారు.రాష్ట్రంలో ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చాలని లేనిపక్షంలో ప్రజలకు మద్దతుగా నిలబడతామని అన్నారు.ఈ కార్యక్రమంలో జమ్మికుంట మాజీ మార్కెట్ చైర్మన్ వాల బాలకిషన్ రావు,వీణవంక సింగిల్ విండో చైర్మన్ మావురపు విజయ భాస్కర్ రెడ్డి,మాజీ ఎంపీపీ ముసిపట్ల రేణుక తిరుపతి రెడ్డి,మాజీ జెడ్పిటిసి వనమాల సాధవ రెడ్డి, ఆయా గ్రామాల మాజీ సర్పంచులు మాజీ ఎంపీటీసీలు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# నిజమైన గౌరవం ఆత్మగౌరవంతోనే మొదలు

**హెరిటేజ్ గ్రూప్ ఆఫ్ కంపెనీల వ్యవస్థాపకుడు కేఆర్ గంగాధరన్**

**ఘనంగా అంతర్జాతీయ వృద్ధుల దినోత్సవ వేడుకలు**

**హైదరాబాద్, జనవరి 23 (జనంసాక్షి)**




నిజమైన గౌరవం ఆత్మగౌరవంతోనే మొదలవుతుందని హెరిటేజ్ గ్రూప్ ఆఫ్ కంపెనీల వ్యవస్థాపకుడు కేఆర్ గంగాధరన్ తెలిపారు. కేంద్ర సామాజిక న్యాయ, సాధికారత మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో హెరిటేజ్ ఫౌండేషన్ ప్రాంతీయ వనరుల శిక్షణా కేంద్రం (హైదరాబాద్)తో కలిసి 'అంతర్జాతీయ వృద్ధుల దినోత్సవం' వేడుకలను సికింద్రాబాద్లోని ప్రసిద్ధ హరి హర కళా భవన్లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ సంవత్సరం థీమ్ గౌరవం చుట్టూ కేంద్రీకృతమై ఉందన్నారు. మనల్ని మనం గౌరవించుకున్నప్పుడు.. సహజంగానే ఇతరుల నుంచి గౌరవాన్ని ప్రేరేపించగలమని చెప్పారు. వయోవృద్ధులు జాతీయ సంపద అని, సమాజానికి అమూల్యమైన వనరు అని, సీనియర్ సిటిజన్లపై వయోవృద్ధుల జాతీయ విధానం (1999) హైలైట్ చేసిందని తెలిపారు. ఐక్యరాజ్యసమితి కూడా యువతతో సమానంగా వయోవృద్ధులు సమాజ ప్రగతికి సమానంగా తోడ్పడతారని పేర్కొందన్నారు. మన వయస్సును, మన ప్రయాణం, దానితో వచ్చే అమూల్యమైన జ్ఞానాన్ని గర్వించాలన్నారు. వయస్సు అంటే కేవలం పెద్దవారిగా మారడం కాదని, అనుభవాలు, జ్ఞాపకాలు, శ్రేయస్సుతో సమృద్ధిగా పెరగడమని గుర్తించాలని తెలిపారు. ఈ సందర్భంగా గౌరవ అతిథి సిరిసిల్ల మాజీ ఎమ్మెల్యే వీ మోహన్ రెడ్డి మాట్లాడుతూ మన వయస్సులో ఉన్న వ్యక్తులను కలవడంలో ఒక ప్రత్యేకమైన ఆనందం ఉంటుందన్నారు. ప్రత్యేకించి మనం పెద్ద సంఖ్యలో కలిసినప్పుడు ఆ వాతావరణం ఉత్సాహపూరితమైన వేడుకగా మారుతుందన్నారు. ఆత్మీయతతో, ఉత్సాహంతో నిండిన వేడుకగా కనిపిస్తుందన్నారు. ఈ సందర్భాలు మన ఆనందాలను పంచుకోవడానికి, జ్ఞాపకాలను గుర్తు చేసుకోవడానికి, మన శ్రమలను తేలిక చేసుకోవడానికి అవకాశాలను కల్పిస్తాయన్నారు. ఇలాంటి క్షణాలలో మనకు సాంత్వన, అవగాహన, మన యాత్రను నిజంగా అర్థం చేసుకునే వారితో ఉన్నాదని తెలిసినప్పుడు, మనస్సు కొత్త ఉత్సాహాన్ని పొందుతుందన్నారు. జీవితం మన ప్రయాణాన్ని పంచుకునే వారితో కలిసి ఉన్నప్పుడు ఎక్కువగా ఆనందించగలమనే సత్యానికి ఈ సమావేశాలు గుర్తింపు ఇస్తాయని చెప్పారు. ఈ సందర్భంగా జీహెచ్ఎంసీ ఆసరా సెంట్రల్ ప్రాజెక్ట్ కమిటీ వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ జీ నాగేశ్వరరావు మాట్లాడుతూ ఇలాంటి కార్యక్రమాలు సీనియర్ సిటిజన్లలో నమ్మకం, ఉత్సాహాన్ని పెంపొందించి ఆరోగ్యకరంగా, సమృద్ధిగా జీవించేందుకు ప్రేరణ కలిగిస్తాయన్నారు. తెలంగాణలో సీనియర్ సిటిజన్స్ ముఖ్యమైన భాగంగా ఉన్నారన్నారు. పట్టణ ప్రాంతాల్లో 16 శాతం, గ్రామీణ ప్రాంతాల్లో 15 శాతం కలరన్నారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం సీనియర్ సిటిజన్లకు మద్దతు ఇచ్చేందుకు ఆర్టీసీ ఛార్జీలపై 30 శాతం తగ్గింపు కల్పిస్తుందని చెప్పారు. కేంద్ర ప్రభుత్వాన్ని రైలు ప్రయాణ ఛార్జీల మినహాయింపును పునరుద్ధరించమని విజ్ఞప్తి చేశామన్నారు. తద్వారా సీనియర్ సిటిజన్లకు చవకైన ప్రయాణ అవకాశాలు అందుబాటులోకి తెచ్చేందుకు ప్రయత్నం చేస్తున్నామని తెలిపారు. మా అభ్యర్థన మేరకు.. గౌరవ గవర్నర్ హైదరాబాద్లో సీనియర్ సిటిజన్ల కోసం రూ. 6 కోట్ల వ్యయంతో పది మల్టీ-డిసిప్లినరీ సెంటర్ల నిర్మాణానికి ఆమోదంతెలిపారన్నారు. ఈ కేంద్రాలు ఆరోగ్యం, వినోదం, సామాజిక ప్రోత్సాహానికి కేంద్ర బిందువులుగా సేవలందిస్తాయని తెలిపారు. ఇవి వారి జీవన నాణ్యతను మెరుగుపరుస్తాయని చెప్పారు. సీనియర్ సిటిజన్ల జీవన ప్రమాణాలను మెరుగుపరచడం, శ్రేయస్సును పెంపొందించడం, ఆయుష్షును పొడిగించడం లక్ష్యంగా వివిధ సామాజిక కార్యక్రమాలపై పని చేస్తున్నామని తెలిపారు.



# పరిశోధనలు, ఆలోచనలు భవిష్యత్తుకు మార్గదర్శకం




ఘనంగా 'ఫ్యూచర్ ఇజ్ హియర్' సదస్సు రెండో ఎడిషన్

**హైదరాబాద్, జనవరి 23 (జనంసాక్షి)**

ఎల్వీ ప్రసాద్ ఐ ఇన్స్టిట్యూట్లోని సెంటర్ ఫర్ అక్యులర్ రీజెనరేషన్ (కోర్) ఆధ్వర్యంలో బ్రైన్ హెూల్డెన్ రీసెర్చ్ సెంటర్ పరిశోధనా బృందాలు 'ఫ్యూచర్ ఇజ్ హియర్' సదస్సు రెండో ఎడిషన్ నిర్వహించాయి. ఈ సదస్సుకు 31 సంస్థల నుంచి 200 పైగా శాస్త్రవేత్తలు, గ్రాడ్యుయేట్ విద్యార్థులు, ఇంజనీర్లు, ఆఫ్తాల్మాలజిస్టులు హాజరయ్యారు. అమెరికా, జర్మనీ, ఆస్ట్రేలియా దేశాలతో పాటు భారతదేశంలోని ఐఐటీలు, సీఎస్ఐఆర్లు, కేంద్ర విశ్వవిద్యాలయాల నుంచి ప్రతినిధులు హాజరయ్యారు. ఈ సదస్సు జంతు, కృత్రిమ వ్యాధి నమూనాలు, కణాలు, జీన్లు, స్టెమ్ సెల్ థెరపీలు, బయోమెటీరియల్స్, డయాగ్నొస్టిక్స్ వంటి అంశాలపై దృష్టి సారించింది. ఈ సదస్సు పరిశోధన ప్రాంతాల్లో నిధులు, సహకారం తదితర అంశాలను కూడా చర్చించింది. ఈ సందర్భంగా ఎల్వీ ప్రసాద్ ఐ ఇన్స్టిట్యూట్లోని సెంటర్ ఫర్ అక్యులర్ రీజెనరేషన్ (కోర్) సీనియర్ సైంటిస్ట్, 'ఫ్యూచర్ ఇజ్ హియర్' సదస్సు ప్రధాన నిర్వాహకుల్లో ఒకరైన డాక్టర్ వివేక్ సింగ్ మాట్లాడుతూ ఈ సదస్సు ప్రపంచ వ్యాప్తంగా కంటి పునరుత్పత్తి, అనుబంధ సాంకేతికతలపై పని చేస్తున్న అత్యుత్తమ మేధావులను ఒక చోటుకు తీసుకు వచ్చిందని చెప్పారు. ఈ ఈవెంట్లో ప్రదర్శించిన పరిశోధనలు, ఆలోచనలు భవిష్యత్తుకు మార్గదర్శకం కానున్నాయని తెలిపారు. 'ఫ్యూచర్ ఈజ్ హియర్' సదస్సు రెండో ఎడిషన్లో పరిశోధనకు నిధులు, సహకారం, ట్రాన్స్లేషనల్ రోడ్మ్యాప్పై చర్చలు జరిగాయి. అమెరికాలోని నేషనల్ ఐ ఇన్స్టిట్యూట్ (ఎన్ఈఐ) లో ఓక్యులర్ అండ్ స్టెమ్ సెల్ ట్రాన్స్లేషనల్ రీసెర్చ్ విభాగానికి నాయకత్వం వహిస్తున్న డాక్టర్ కపిల్ భార్తి, జర్మనీలోని పియస్ హాస్పిటల్ ఓల్డెన్బర్గ్లో యూనివర్సిటీ క్లినిక్ ఫర్ ఆఫ్థాల్మాలజీ డైరెక్టర్ డాక్టర్ స్టెఫన్ శ్రేడర్ భారత పరిశోధకులకు తమ దేశాల్లో ఉన్న నిధుల అవకాశాలపై పంచుకున్నారు. ఎల్వీ ప్రసాద్ ఐ ఇనిస్టిట్యూట్ పూర్వ విద్యార్థులైన డాక్టర్ వీరేందర్ సంగ్వాన్ (కన్సల్టెంట్, డాక్టర్ ష్రాఫ్ చారిటీ ఐ హాస్పిటల్, న్యూఢిల్లీ), డాక్టర్ గీతా వెముగంటి (డీన్ ఆఫ్ మెడికల్ సైన్సెస్, విశ్వవిద్యాలయం) సహకరం, పరిశోధనా ప్రగతిలో కీలక పాత్ర పోషించినట్టు వివరించారు.

# సెంట్రల్ యూనివర్సిటీ పీజీ అడ్మిషన్లపై టి-సాట్ ప్రత్యేక లైవ్

**హైదరాబాద్ (జనంసాక్షి)**



ప్రతిష్ఠాత్మక విద్యా సంస్థ హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ హెచ్.సి.యు సహా దేశవ్యాప్త సెంట్రల్ యూనివర్సిటీల్లో పీజీ అడ్మిషన్లపై ఈ నెల 24వ తేదీ శుక్రవారం రోజు టి-సాట్ నెట్వర్క్ ఛానళ్లు ప్రత్యేక ప్రత్యక్ష ప్రసార కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు టి-సాట్ సీఈవో బోదనపల్లి వేణుగోపాల్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. దేశంలోని లక్షలాది మంది విద్యార్థులకు వివిధ కోర్సులలో విద్యాబోధన చేసి అత్యున్నత యూనివర్సిటీలుగా పేరుతెచ్చుకున్న కేంద్రీయ విశ్వ విద్యాలయాలలో ఏ కోర్సులు, ఏ భాషల్లో, ఎన్ని విభాగాల్లో అడ్మిషన్లు తీసుకోనున్నారనే వివరాలు ప్రత్యేక లైవ్ ద్వార విద్యార్థి లోకానికి తెలియచెప్పనున్నామని, లైవ్ కార్యక్రమంలో యూనివర్సిటీలకు సంబంధించిన ఫ్యాకల్టీ పాల్గొంటారని సీఈవో తెలిపారు. శుక్రవారం ఉదయం 11 నుండి 12 గంటల వరకు గంట పాటు నిపుణ ఛానల్ లో ప్రసారయ్యే ప్రత్యేక కార్యక్రమం మరసటి రోజు శనివారం సాయంత్రం ఏడు నుండి ఎనిమిది గంటల వరకు విద్య ఛానల్ లో ప్రసారమౌతుందన్నారు. అడ్మిషన్ల వివరాలు తెలుసుకునేందుకు విద్యార్థులు, వారి తల్లిదండ్రులు 040 23540326/726 టోల్ ఫ్రీ నం.1800 425 4039 లకు కాల్ చేయాలని వేణుగోపాల్ రెడ్డి సూచించారు.

# స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్ల పెంపు ఇంకెంత కాలం?

**హైదరాబాద్ (జనంసాక్షి)**

**మీ వైఖరితో బీసీలకు తీరని అన్యాయం**

**రిజర్వేషన్ల పెంపును విస్మరిస్తే ఊరుకోబోం**

**కామారెడ్డి బీసీ డిక్లరేషన్ ను అమలు చేయాల్సిందే..**

**సీఎం రేవంత్ రెడ్డికి బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత బహిరంగ లేఖ**

: స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీల రిజర్వేషన్లను 42 శాతానికి పెంచడానికి ఇంకెంత కాలం తాత్సారం చేస్తారని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ప్రశ్నించారు. అధికారంలోకి వచ్చిన 6 నెలల్లోనే కులగణన పూర్తి చేసి రిజర్వేషన్లు పెంచుతామని కామారెడ్డి బీసీ డిక్లరేషన్ ద్వారా కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చిందని, కానీ అధికారంలోకి వచ్చి ఏడాది గడిచినా ఇంకా అమలు చేయకపోవడం శోచనీయమన్నారు. ఈ మేరకు గురువారం నాడు ఎమ్మెల్సీ కవిత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి బహిరంగ లేఖ రాశారు. బీసీలకు ఏటా రూ. 20 వేల కోట్ల చొప్పున ఐదేళ్లలో రూ లక్ష కోట్ల బడ్జెట్ కేటాయిస్తామని హామీ ఇచ్చి 2024-25 బడ్జెట్ లో అరకొర కేటాయింపులు చేసి తొలి ఏడాదే కామారెడ్డి డిక్లరేషన్ ను సీఎం రేవంత్ రెడ్డి ఉల్లంఘించారని విమర్శించారు. కాబట్టి కాంగ్రెస్ ప్రభుత్వం పట్ల బీసీ వర్గాల్లో ఏ మాత్రం విశ్వాసం లేదని, ఈ వైఖరితో రాష్ట్రంలో బీసీలంతా తీరని అన్యాయానికి గురవుతున్నారని పేర్కొన్నారు. "కామారెడ్డి డిక్లరేషన్ లో ప్రధాన హామీ అయిన స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను కల్పించడం. "కుల గణన, బీసీ కమిషన్ నివేదిక ఆధారంగా అధికారంలోకి వచ్చిన 6 నెలల్లోపే బీసీలకు రిజర్వేషన్ల పెంపు" అని కామారెడ్డి బీసీ డిక్లరేషన్ లో స్పష్టంగా పేర్కొని ఉంది. 6 నెలలు గడిచాయి... ఏడాది గడిచింది.. అయినా కూడా రిజర్వేషన్ల పెంపునకు అతీగతీ లేదు. అశాస్త్రీయంగా బీసీ గణన నిర్వహించి, డెడికేటెడ్ కమిషన్ పేరిట కాలయాపన చేయడమే మీ ఆలోచనగా కనిపిస్తోంది." అని తెలిపారు. కుల గణన పూర్తయ్యి కూడా చాలా కాలం అవుతుందని, కానీ ఇప్పటి వరకు ప్రభుత్వం ఆ వివరాలను బహిర్గతం చేయలేదని ఎండగట్టారు. ఆ వివరాలను తక్షణమే బహిర్గతం చేయాల్సిన అవసరం ఉందని, డెడికేటెడ్ కమిషన్ నివేదిక సిద్ధమైనట్లు వార్తలు వస్తున్న నేపథ్యంలో తదుపరి కార్యాచరణపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. " బీసీల అంశాల పట్ల మీ ప్రభుత్వం ఎందుకు అంత నిర్లక్ష్యం వహిస్తోంది ? బీసీలంటే కాంగ్రెస్ పార్టీకి ఎందుకు చులకన ? 6 నెలల్లోపే అమలు చేస్తామన్న హామీ 12 నెలలు గడిచినా ఎందుకు అమలు చేయడం లేదు ? హామీని అమలు చేయడానికి ఇంకెంత కాలం పడుతుంది ?" అని ప్రశ్నల వర్షం కురిపించారు.
రాష్ట్రంలో గ్రామ పంచాయతీల పదవీకాలం ముగిసి దాదాపు ఏడాది పూర్తయ్యిందని, మండల, జిల్లా పరిషత్ ల పదవీకాలం కూడా ముగిసిందని, ప్రస్తుతం గ్రామాల్లో ప్రజా పాలన కాకుండా ప్రత్యేకాధికారుల పాలన సాగుతోందని వివరించారు. కానీ మీ ప్రభుత్వానికి త్వరగా రిజర్వేషన్లను పెంచి ఎన్నికలను నిర్వహించాలన్న సోయి లేనట్లు అర్థమవుతోందని అనుమానం వ్యక్తం చేశారు. బీసీలకు ఇచ్చిన హామీ ప్రకారం రిజర్వేషన్లను 42 శాతానికి పెంచాల్సిందేనని తేల్చిచెప్పారు. కుంటి సాకులు చెప్పి ఇచ్చిన మాట కంటే తక్కువ రిజర్వేషన్లు కల్పిస్తే మాత్రం తెలంగాణ సమాజం మిమ్మల్ని సహించబోదని, బీసీల పక్షాన పోరాడుతున్న బీఆర్ఎస్ పార్టీ మీ మెడలు వంచి హామీని అమలు చేయించుకుంటామని హెచ్చరించారు. కాబట్టి ప్రభుత్వం తక్షణమే స్థానిక సంస్థల్లో బీసీలకు రిజర్వేషన్లను తక్షణమే 42 శాతానికి పెంచడానికి చర్యలను ముమ్మరం చేయాలని ముఖ్యమంత్రికి విజ్ఞప్తి చేశారు.

# రాష్ట్రవ్యాప్తంగా ప్రైవేట్, కార్పొరేట్ మెడికల్ మాఫియా దందాను అరికట్టాలి

**ప్రభుత్వ ఆసుపత్రుల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలి**

**రాష్ట్రంలో వైద్య ఆరోగ్య శాఖను పూర్తి స్థాయిలో ప్రక్షాళన చేయాలి : ఏఐవైఎఫ్ డిమాండ్**

**హైదరాబాద్ (జనంసాక్షి)**




రాష్ట్రవ్యాప్తంగా ప్రైవేట్, కార్పొరేట్ మెడికల్ మాఫియా దందాను అరికట్టాలని,ప్రభుత్వ ఆసుపత్రుల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ అఖిల భారత యువజన సమాఖ్య(ఏఐవైఎఫ్) ఆధ్వర్యంలో కోఠి లోని డైరెక్టరేట్ ఆఫ్ పబ్లిక్ హెల్త్ కార్యాలయ ముట్టడి కార్యక్రమం నిర్వహించారు. ధర్నా నిర్వహించి, కార్యాలయం లోకి చొచ్చుకెళ్తున్న నేపథ్యంలో పోలీసుల అడ్డుకుని అక్రమంగా అరెస్ట్ చేసి సుల్తాన్ బజార్ పోలీస్ స్టేషన్ కు తరలించారు. ఏఐవైఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కె. ధర్మేంద్ర,రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నెర్లకంటి శ్రీకాంత్ మాట్లాడుతూ.. ప్రజల ప్రాణాలతో వ్యాపారం చేస్తున్న ఆస్పత్రులపై కఠిన చర్యలు తీసుకోవాలని వారు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజల ఆరోగ్యం పట్ల నిర్లక్ష్య ధోరణి కనబరుస్తున్నదని వాపోయారు. రాష్ట్రంలో ప్రైవేట్, కార్పొరేట్ ఆగడాలను అరికట్టడంలో పూర్తిగా విఫలం చెందారని ధ్వజమెత్తారు. ఇదే అదునుగా ప్రైవేట్ ఆసుపత్రులు తమ వికృత వ్యాపార మెడికల్ దందాకు తెరలేపిందని, ఈ నేపథ్యంలో ఇటీవల కాలంలో కిడ్నీ అక్రమ మార్పిడిలు, చర్మ సంబంధిత సర్జరీలు, బ్లడ్ అక్రమ దందాలు, నకిలీ డాక్టర్ల సేవలు, ప్రైవేట్ దయాగ్నోస్టిక్ సెంటర్ల విచ్చలవిడి దోపిడీలు తారాస్థాయికి చేరాయని వారు ఆరోపించారు. రాష్ట్రంలో వైద్య ఆరోగ్య శాఖ అధికారులు కాసుల కక్కుర్తికి అలవాటు పడి మామూళ్ల మత్తులో మునిగి తేలుతున్నారని ధ్వజమెత్తారు.అందుకే ప్రైవేట్, కార్పొరేట్ ఆస్పత్రులపై చర్యలు తీసుకోవడంలో మీనమేషాలు లెక్కిస్తున్నారని ఎద్దేవా చేశారు.రెండు రోజుల క్రితం రంగారెడ్డి జిల్లా సరూర్ నగర్ అలకనంద మల్టీ స్పెషలిటీ ఆసుపత్రిలో కిడ్నీ మార్పిడి ఆపరేషన్లు అక్రమంగా నిర్వహిస్తున్నారని, గోప్యంగా ఒక వ్యక్తి సమాచారంతో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులు స్పందించి సీజ్ అనే పేరిట తాత్కాలిక చర్యలు తీసుకున్నారన్నారు. కానీ, సదరు ఆసుపత్రి కేవలం 9 పడకలకు మాత్రమే అనుమతి పొంది, 32 పడకల ఆస్పత్రిగా చెలామణీ అవుతూ అక్రమంగా నడుస్తున్నా,అనుమతులు లేకున్నా జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులు ఎందుకు ముందే చర్యలు తీసుకోలేదో సమాధానం చెప్పాలని వారు డిమాండ్ చేశారు. కాబట్టి, రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల్లో వైద్య ఆరోగ్య శాఖ అధికారులు ప్రైవేట్, కార్పొరేట్ ఆసుపత్రుల యాజమాన్యాలకు ప్రత్యక్ష ఊడిగం చేస్తున్నారనే ఆరోపణలు వాస్తవమని ప్రజలు గమనించాలని వారు అన్నారు.అదే విధంగా దయాగ్నొస్టిక్ సెంటర్లు, ప్రైవేట్ ఆసుపత్రి యాజమాన్యాల మధ్య లోపాయికారి ఒప్పందం చేసుకొని కమిషన్లకు కక్కుర్తి పడి సామాన్య జనాల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారని ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వం, రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ ప్రత్యేక విభాగం ఏర్పాటు ద్వారా రాష్ట్ర మంతటా ప్రైవేట్, కార్పొరేట్ ఆసుపత్రిలపై దాడులు చేపట్టాలని, అనుమతులు లేకుండా నడుస్తున్న వాటిపై క్రిమినల్ చర్యలు చేపట్టాలని వారు డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా పెద్దఎత్తున పోరాటాలకు పిలుపు ఇస్తామని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు టి.సత్య ప్రసాద్, శ్రీమాన్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు షేక్ మహమూద్, పి.శివ కుమార్, మజీద్ అలీఖాన్, మధు, కళ్యాణ్, అనీల్ కుమార్, శేఖర్, వీరేశ్, భాను, సంజయ్, నగేష్, శివ కుమార్, జెట్టి శ్రీనివాస్, వంశీ, గణేష్ లతో పాటు 20మంది పాల్గొన్నారు.

# టిటిఏ అధ్యక్షుడిగా నవీన్ రెడ్డి మల్లిపెద్ది

**హైదరాబాద్ (జనంసాక్షి)**



మన తెలంగాణ అమెరికన్ తెలుగు అసోసియేషన్ (టిటిఏ) అధ్యక్షుడిగా నవీన్ రెడ్డి మల్లిపెద్ది బాధ్యతలు స్వీకరించారు. 2025 %-% 2026 సంవత్సరాల పదవీకాలానికి కొత్తగా ఎన్నికైన బోర్డ్ సభ్యులతో కలిసి ప్రమాణ స్వీకారం చేశారు. టీటీఏ వ్యవస్థాపకుడు డాక్టర్ పైళ్ళ మల్లారెడ్డి, సలహా మండలి ఛైర్మన్ డాక్టర్ విజయపాల్ రెడ్డి, కో-ఛైర్మన్ డాక్టర్ మోహన్ రెడ్డి పాటలోల్ల, సభ్యుడు భరత్ రెడ్డి మాదాది, అధ్యక్షుడు నవీన్ రెడ్డి మల్లిపెద్ది, మాజీ అధ్యక్షుడు వంశీ రెడ్డి కంచరకుంట్ల ఈ సందర్భంగా కొత్త బోర్డు సభ్యులకు శుభాకాంక్షలు తెలియజేశారు. బోర్డ్ సభ్యులుగా నవీన్ రెడ్డి మల్లిపెద్ది, డా. నరసింహారెడ్డి దొంతిరెడ్డి, కవితా రెడ్డి, సహోదర్ పెద్దిరెడ్డి, డా. దివాకర్ జంధ్యం, శివారెడ్డి కొల్ల, మనోహర్ బొడ్కె, ప్రదీప్ మెట్టు, సురేశ్ రెడ్డి వెంకన్నగరి, నిశాంత్ సిరికొండ, అమిత్ రెడ్డి సురకంటి, గణేశ్ మాధవ్ వీరమనేని, స్వాతి చెన్నూరి, ఉషారెడ్డి మన్నం, సంతోష్ గంటారం, నరసింహ పెరుక, కార్తిక్ నిమ్మల, శ్రీకాంత్ రెడ్డి గాలి, అభిలాష్ రెడ్డి ముదిరెడ్డి, మయూర్ బండారు, రంజిత్ క్యాతం, అరుణ్ రెడ్డి అర్కల, రఘునందన్ రెడ్డి అలుగుబెల్లి, దిలీప్ వాస, ప్రదీప్ బొద్దు, ప్రభాకర్ మదుపాటి, నరేంద్ర దేవరపల్లి, ప్రవీణ్ సామల, ప్రవీణ్ చింట, నరేశ్ బైనగరి, వెంకట్ అన్నపరెడ్డి కొత్తగా బోర్డ్ సభ్యులుగా నియమితులయ్యారు. మన తెలంగాణ అమెరికన్ తెలుగు అసోసియేషన్ అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించిన నవీన్ రెడ్డికి, బోర్డు సభ్యులకు స్వదేశం, స్వరాష్ట్రం నుంచి అభినందనలు, శుభాకాంక్షలు అందుతున్నాయి. నవీన్ రెడ్డి ఉద్యోగిగా అమెరికాలో అడుగుపెట్టి, కన్సల్టింగ్ కంపెనీలు, మీడియా, రెస్టారెంట్లు, గ్యాస్ స్టేషన్లతో పాటు అనేక ఇతర సంస్థలను స్థాపించి, ఎన్నో విజయాలు అందుకుంటూ, తెలుగు వారికి గర్వకారణంగా నిలుస్తున్నారంటూ ఈ సందర్భంగా పలువురు కొనియాడారు.

# జ్ఞానాన్ని పెంపొందించుకొని ప్రయోజకులు కావాలి

- విద్యార్థి భవిష్యత్‌కు పదవ తరగతి ఫలితాలే పునాది
- పాఠశాలలో అసౌకర్యాలపై ఆగ్రహం వ్యక్తం చేసిన కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్



**సూర్యాపేట ప్రతినిధి, జనవరి 23 (జనంసాక్షి) :** విద్యార్థి భవిష్యత్ కి పదవ తరగతి ఫలితాలే పునాది అని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవర్ అన్నారు.గురువారం చివ్వెంల మండలం బి.చందుపట్ల గ్రామంలోని జడ్పీహెచ్ఎస్, ప్రాథమిక పాఠశాలలను ఆకస్మికంగా సందర్శించారు.ముందుగా పాఠశాలల్లోని స్టాఫ్ రూమును పరిశీలించారు.అనంతరం పాఠశాలలోని తరగతి గదులను సందర్శించారు.పదవ తరగతి గదిలో జరుగుతున్న తెలుగు క్లాస్‌ని సందర్శించి, విద్యార్థులతో కొత్త బాట అనే పాఠాన్ని దివ్యశ్రీ, నవీన్ చేత చదివించారు.అనంతరం విద్యార్థులు రాసిన నోట్ పుస్తకాలను వారి చేతి రాతను పరిశీలించి, పరీక్షలలో హ్యాండ్ రైటింగ్ మంచిగా ఉండేలా చూసుకోవాలని సూచించారు.పదవ తరగతి వార్షిక పరీక్షలకు సమయం తక్కువ ఉన్నందున బాగా కష్టపడి చదవాలని,మంచి మార్కులు తెచ్చుకొని, పాఠశాలకి మంచి పేరు తేవాలని అన్నారు. పరీక్ష రాసే విధానాన్ని విద్యార్థులకు తెలపాలని ఉపాధ్యాయులకు సూచించారు.పాఠశాలలో అమ్మ ఆదర్శ పాఠశాల పనులు జరగకపోవటంపై ప్రధానోపాధ్యాయుడు, సంబంధిత ఇంజనీరింగ్ అధికారిపై ఆగ్రహం వ్యక్తం చేశారు.వారం రోజుల్లో పనులు పూర్తి చేయకపోతే కఠిన చర్యలు తీసుకుంటానని అన్నారు.స్టోర్ రూమ్ ని, మెనూ రిజిస్టర్, హాజరు పట్టికను పరిశీలించారు.పిల్లల కొరకు తయారు చేసిన మధ్యాహ్న భోజనం పరిశీలించి విద్యార్థులతో కలిసి భోజనం చేస్తూ వారితో ముచ్చటించారు.సోమ, బుధ, శుక్రవారంలో గుడ్లు పెడుతున్నారా అని, మెను ప్రకారం రోజువారీ కూరలు చేస్తున్నారా లేదా అని విద్యార్థులని అడిగి తెలుసుకున్నారు.తదుపరి ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించి పదవ తరగతి పరీక్షలలో నూరు శాతం సాదించాలని, అందు కొరకు ఉదయం, సాయంత్రం స్టడీ అవర్స్ ఏర్పాటు చేయాలని అన్నారు. విద్యార్థులు ఏదైనా సబ్జెక్ట్‌లో వెనుకబడి ఉంటే ప్రత్యేక తరగతులు నిర్వహించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో తహసీల్దార్ కృష్ణయ్య,ఉపాధ్యాయులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# అవినీతి పంచాయతీ కార్యదర్శిని సాగనంపాలి



**మెదక్ జిల్లా బ్యూరో, జనవరి 23 (జనం సాక్షి) :** పంచాయతీ కార్యదర్శిని మార్చాలంటూ జిల్లా అదనపు కలెక్టర్ నగేష్ ఎదుట ప్రజాపాలన గ్రామసభలో ప్రజలు అదనపు కలెక్టర్ తో వాగ్వాదానికి దిగారు. మెదక్ జిల్లా కొల్చారం మండలం కిష్టా పూర్ లో గురువారం ప్రజా పాలన గ్రామసభ తాసిల్దార్ మమ్మద్ గఫర్ మియా అధ్యక్షతన జరిగింది. ఈ గ్రామసభకు అదనపు కలెక్టర్ నగేష్ ముఖ్య అతిథిగా హాజరై ఇందిరమ్మ ఇల్లు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా తదితర పథకాల గురించి వివరించారు. ఇందిరమ్మ ఇల్లు మంజూరైన వారి పేర్లను తాసిల్దార్ మహ్మద్ గఫర్ మియా చదువుతుండగా ఇండ్లున్న వారికే మళ్లీ కొత్తగా ఇండ్లు మంజూరు కావడం పట్ల నిరుపేదలు ఆగ్రహం వ్యక్తం చేశారు. అసలైన నిరుపేదలకు ఇండ్లు మంజూరు చేయకుండా, అనర్హులకు లంచాలు తీసుకొని పంచాయతీ కార్యదర్శి పనులు చేస్తుందని, ఈ పంచాయతీ కార్యదర్శి మాకొద్దంటూ అదనపు కలెక్టర్‌తో గ్రామస్తులు వాగ్వాదానికి దిగారు. కంప్యూటర్ తప్పిదం వల్ల ఈ విధంగా జరిగిందని, ఎవ్వరూ ఆందోళన చెందవద్దని... మళ్లీ దరఖాస్తు చేసుకోవాలని అదనపు కలెక్టర్ సూచించారు. అయినప్పటికీ ప్రజలు గొడవ చేయడంతో ఏఎస్ఐ వాణి ఆధ్వర్యంలో పోలీసులు సముదాయించినా వినకపోవడంతో ఈ గొడవకు కారణమైన పంచాయతీ కార్యదర్శి మమత పట్ల అదనపు కలెక్టర్ అసహనం వ్యక్తం చేసి అక్కడి నుంచి వెళ్లిపోయారు. ఆ తర్వాత మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నాగుల గారి మల్లేశం గౌడ్ గ్రామస్తులు అందరిని సముదాయించి అర్హత కలిగిన నిరుపేదలందరు దరఖాస్తు చేసుకోవాలని... విడతలవారీగా అందరికీ ఇండ్లు మంజూరు చేయిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో తాజా మాజీ సర్పంచ్ గోదావరి, శ్రీకోదండ రామాలయ మాజీ చైర్మన్ కుమార్ యాదవ్, వెంకటరాములు, తదితరులు పాల్గొన్నారు.

# నేరేడు గుంట గ్రామాన్ని అభివృద్ధి చేస్తాం

- మంత్రి దామోదర్ రాజనర్సింహ



**జోగిపేట, జనవరి 23 (జనంసాక్షి) :** నేరేడు గుంట గ్రామాన్ని అంచలెంచెలుగా అభివృద్ధి పరుస్తామని ప్రభుత్వపరంగా వచ్చే పథకాలను అందజేయడానికి కృషి చేస్తామని వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ అన్నారు, ప్రజా పాలన కార్యక్రమంలో భాగంగా ఏర్పాటుచేసిన గ్రామసభలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు, గ్రామానికి రెండు దశాబ్దాల క్రితమే ఇందిరమ్మ ఇళ్ళను అందించామని ప్రస్తుతం గ్రామానికి అవసరమైన సదుపాయాలని సమకూరుస్తామన్నారు. ముఖ్యంగా ప్రభుత్వం ప్రవేశపెట్టిన 6 గ్యారెంటీలను సత్వరమే అమలు పారుస్తామన్నారని అన్నారు. ఇందులో ఇందిరమ్మ ఇల్లు రైతు రోసా రేషన్ కార్డులు అర్హులైన వారందరికీ అమలు పరచడానికి కృషి చేస్తా మన్నారు ,దానికోసం అర్హులైన వారందరూ దరఖాస్తు చేసుకోవాలన్నారు, ముఖ్యంగా గ్రామానికి అవసరమైన ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఇందిరమ్మ ఇళ్లను ఒకేరోజు శంకుస్థాపన చేస్తానన్నారు, అలాగే గ్రామం నుండి ఎర్రారంకు రోడ్డు సౌకర్యం ఇంకా గ్రామం నుండి బ్రాహ్మణపల్లి గ్రామానికి రోడ్డు సౌకర్యాలు కావాలని ప్రజలు కోరుతున్నారని దాని తొందరలోనే మంజూరు చేస్తామన్నారు ఈ కార్యక్రమంలో సంగారెడ్డి జిల్లా కలెక్టర్ వల్లూరి క్రాంతి, అడిషనల్ కలెక్టర్ చంద్రశేఖర రావు ,అందోల్ ఆర్డిఓ పాండు జోగిపేట మార్కెట్ చైర్మన్ మక్కా జగన్మోహన్ రెడ్డి ,మాజీ సర్పంచ్ చందులత వీరమల్లప్ప ,మండల పార్టీ అధ్యక్షులు శివరాజ్ మాజీ ఎంపిటిసి రాజిరెడ్డి, గ్రామ కార్యదర్శి, ఎమ్మార్వో విష్ణు సాగర్, ఎంపీడీవో రాజేష్ కుమార్ పాల్గొన్నారు.

# అర్హులకు పథకాలు అందేలా చూస్తాం



**హుజూర్‌నగర్, జనవరి 23 (జనంసాక్షి) :** తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజాపాలన లబ్ధిదారుల ఎంపికలో అర్హులకు పథకాలు అందేలా చూస్తామని మున్సిపల్ చైర్‌పర్సన్ గెల్లీ అర్చనరవి, వైస్ చైర్మన్ కోతి సంపత్ రెడ్డి లు అన్నారు. గురువారం హుజూర్ నగర్ మున్సిపాలిటీ పరిధిలో 15,16,17,18,19,20,21 వార్డులో నిర్వహించిన ప్రజాపాలన వార్డు సభలలో మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డిలతో కలిసి పాల్గొని దరఖాస్తులను పరిశీలించి, అర్హులైన వారి వద్ద నుండి దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకొని గత పది సంవత్సరాల నుంచి ఇవ్వని రేషన్ కార్డులను పెద ప్రజలకు ఇవ్వాలని సదుద్దేశంతో ఈ నెల 26 నుండి రేషన్ కార్డుతో సహా ఇతర పథకాలకు శ్రీకారం చుట్టిందన్నారు. నూతన రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్లు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రైతు భరోసా పథకాలకు అర్హులైన అందరి దగ్గర నుండి దరఖాస్తుల స్వీకరించడం జరుగుతుందని చెప్పారు.

# అందరికీ సంక్షేమ పథకాలు అందేలా కృషి చేస్తాం

- జిల్లా ప్రత్యేక అధికారి అనితా రామచంద్రన్



**చిట్యాల, జనవరి 23 (జనంసాక్షి) :** అందరికీ సంక్షేమ పథకాలు అందేలా కృషి చేస్తున్నామని రాష్ట్ర మహిళ శిశు సంక్షేమ శాఖ కార్యదర్శి,నల్లగొండ జిల్లా ప్రత్యేక అధికారి అనితా రామచంద్రన్ ఐఏఎస్ అన్నారు.ప్రజా పాలన గ్రామసభలలో భాగంగా గురువారం ఆమె నల్గొండ జిల్లా,చిట్యాల మండలం,పెద్దకాపర్తి లో నిర్వహించిన గ్రామసభకు జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి తో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అర్హులైన పేద ప్రజలకు రేషన్ కార్డులు,ఇందిరమ్మ ఇండ్ల, రైతు భరోసా,ఇందిరమ్మ ఆత్మీయ భరోసా అందించేందుకు ప్రజా పాలన గ్రామసభలను నిర్వహిస్తున్నదని తెలిపారు. ఇప్పటివరకు రేషన్ కార్డులు లేని వారికి,అలాగే కార్డులలో ఎవరి పేరైనా చేర్చాల్సి వస్తే దరఖాస్తు చేసుకున్న అర్హతను బట్టి ప్రతి ఒక్కరికి ఇవ్వడం జరుగుతుందని చెప్పారు. ఇప్పటివరకు ఇంకా ఎవరైనా దరఖాస్తు చేసుకోనట్లయితే గ్రామ సభలలో కూడా దరఖాస్తు చేసుకోవచ్చని,గతంలో దరఖాస్తు చేసుకున్నవారు మళ్లీ దరఖాస్తు చేసుకోవాల్సిన అవసరం లేదని తెలిపారు. ప్రజా పాలన ,మీసేవ, గ్రామసభల్లో ధరకాస్తూ చేసుకున్న వారందరికీ, అర్హత ఉన్న ప్రతి ఒక్కరికి రేషన్ కార్డులు వస్తాయని చెప్పారు. కార్యక్రమంలో ప్రత్యేక అధికారి శ్రవణ్ కుమార్, ఎమ్మార్వో జీ.కృష్ణ నాయక్, ఎంపీఓ సత్యనారాయణ, మాజీ ఏఎంసి చైర్మన్ కాటం వెంకటేశం, పంచాయతీ సెక్రెటరీ కంచర్ల గౌతంరెడ్డి, నాయకులు కందిమల్ల శిశుపాల్ రెడ్డి,మర్రి జలంధర్ రెడ్డి, రమణారెడ్డి,లింగస్వామి,ఇందిరమ్మ కమిటీ సభ్యులు,తదితరులు పాల్గొన్నారు.

# అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు



**శ్రీరంగాపూర్, జనవరి 23 (జనంసాక్షి) :** శ్రీరంగాపూర్ గ్రామపంచాయతీ కార్యాలయం దగ్గర మరియు మండల పరిధిలోని సేరిపల్లి గ్రామంలో గ్రామపంచాయతీ కార్యాలయంలో దగ్గర మూడవరోజు ప్రజాపాలన గ్రామసభలో పాల్గొన్న వనపర్తి నియోజకవర్గం ఎమ్మెల్యే తుడిమేగా రెడ్డి మాట్లాడుతూ ప్రజా పాలనలో కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో ప్రకటించిన దాని ప్రకారం ప్రతి అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ పథకాలు అందుతాయని ఎవరు కూడా ఆందోళన చెందవలసిన అవసరం లేదని కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారంటీల్లో మొట్టమొదట ఉచిత బస్సు ప్రయాణం మహిళలకు కల్పించామని, రెండోది ప్రతి ఇంటికి విద్యుత్ 200 యూనిట్ల వరకు ఫ్రీ కరెంటు ఇస్తున్నామని.మూడోది 500 కే గ్యాస్ సిలిండర్ లబ్ధిదారులకు ఇస్తున్నామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో శ్రీరంగాపూర్ మండల తాసిల్దార్ మురళి గౌడ్ మండల ఎంపీడీవో రవి నారాయణ డిడబ్ల్యూఓ సుధారాణి,పెబ్బేరు మండల మార్కెట్ కమిటీ చైర్మన్ గౌని ప్రమోదిని రెడ్డి మరియు మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఎద్దుల విజయవర్ధన్ రెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రాజేంద్రప్రసాద్ యాదవ్ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బి రాములు యాదవ్, మండల కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీహరి రాజు ,మండల కాంగ్రెస్ నాయకుల బీరం రాజశేఖర్ రెడ్డి, బున్యాదిపూర్. మాజీ సర్పంచ్ వెంకటేష్ కురుమయ్య ,ఆశన్న , కుర్మయ్య,శ్రీరంగాపూర్ మాజీ సర్పంచ్ కురుమయ్య , సేరుపల్లి ఎం వెంకటయ్య యాదవ్ మాజీ సర్పంచ్, నాగరాజు సాగర్ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొనడం జరిగింది.

# ప్రజాపరిపాలన కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలి

- పేర్లు లేని లబ్దిదారులు ఎవరు కూడా ఆందోళన చెందవద్దు
- రేషన్ కార్డు ప్రక్రియ నిరంతరం కొనసాగుతుంది
- లబ్దిదారులు పొందే పథకాల్లో జాప్యం ఉండద్దు
- ప్రజాపరిపాలన కోసం వచ్చే లబ్దిదారులకు అన్ని వసతులను ఏర్పాటు చేయాలి
- జిల్లా అధికారులను ఆదేశించిన మెదక్ ఎమ్మెల్యే డా. మైనంపల్లి రోహిత్



**మెదక్ జిల్లా బ్యూరో, జనవరి 23 (జనంసాక్షి) :** తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాపరిపాలన కార్యక్రమానికి తిరిగి గత రెండు రోజుల నుండి నిర్వహిస్తున్న విషయం అందరికి తెలిసిందేనని ప్రభుత్వం ఏర్పాటు అయ్యాక నిర్వహించిన ప్రజాపరిపాలన లో నమోదు చేసుకున్న లబ్దిదారుల పేర్లు లీస్టులో రాకపోతే ఎవరు కూడా ఆందోళన చెందవద్దని మెదక్ ఎమ్మెల్యే డా. మైనంపల్లి రోహిత్ లబ్దిదారులకు తెలియజేశారు. గురువారం మెదక్ లో పర్యటించిన ఎమ్మెల్యే పట్టణంలోని పలు వార్డుల్లో లబ్ధిదారులతో ముఖాముఖిగా మాట్లాడడమే కాకుండా వారి వద్ద నుండి దరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డా. మైనంపల్లి రోహిత్ మాట్లాడుతూ రేషన్ కార్డు ప్రక్రియ అనేది నిరంతరం కొనసాగుతుందని, రేషన్ కార్డు దాని కోసం ఎవరు కూడా ఆందోళన చెందవద్దని ఆయన సూచించారు. లబ్దిదారులు పొందే పథకాల్లో జాప్యం ఉండకుండా అధికారులు చొరవ చూసుకోవాలని ఆయన ఆదేశించారు. అంతే కాకుండా ప్రజాపరిపాలన కోసం వచ్చే లబ్దిదారులకు అన్ని విధాలుగా వసతులను ఏర్పాటు చేయాలని జిల్లా అధికారులకు ఎమ్మెల్యే డా. మైనంపల్లి రోహిత్ ఆదేశించారు. అనంతరం ప్రజాపాలనలో వచ్చిన దరఖాస్తులను ఏవిధంగా రిజిష్టర్ లో నమోదు చేస్తున్నారన్న విషయాన్ని పరిశీలించారు. ఆయన వెంట మెదక్ మున్సిపల్ చైర్మన్ తడుపునూరి చంద్రపాల్ , మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు

- జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్



**సూర్యాపేట ప్రతినిధి, జనవరి 23 (జనంసాక్షి) :** అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతాయని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవర్ అన్నారు.గురువారం సూర్యాపేట మున్సిపాలిటీ పరిధిలోని 28వ వార్డులో జరిగిన వార్డు సభలో ఆయన పాల్గొని మాట్లాడారు.జనవరి 26 నుండి అమలు చేయబోయే నాలుగు ప్రభుత్వ సంక్షేమ పథకాలైన రైతుభరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇండ్లు, కొత్త రేషన్ కార్డులు మంజూరు లాంటి పథకాలకు లబ్ధిదారులను గుర్తించేందుకు గ్రామ, వార్డు సభలు నిర్వహించటం జరుగుతుందని అన్నారు. 28వ వార్డులో గతంలో నిర్వహించిన ప్రజాపాలన సభలో ఇందిరమ్మ ఇండ్ల కొరకు 461 మంది దరఖాస్తు చేసుకోగా 46 మందికి ఇండ్ల స్థలాలు ఉండగా,415 మందికి ఇండ్ల స్థలాలు లేవని, అలాగే రేషన్ కార్డుల గురించి 295 దరఖాస్తులు రాగా అందులో ప్రజా పాలనలో 195, మీ సేవా ద్వారా 50, కలెక్టరేట్ ద్వారా 50 మొత్తం 295 దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. 28వ వార్డు ప్రజాపాలన వార్డు సభలో ఇందిరమ్మ ఇండ్ల కొరకు 113 కొత్త దరఖాస్తులు, రేషన్ కార్డులు కొరకు 123 దరఖాస్తులు వచ్చాయని అన్నారు. పరిశీలన అనంతరం అర్హులైన జాబితాను రూపొందించటం జరుగుతుందని తెలిపారు.జాబితాపై ఏమైనా అభ్యంతరాలు ఉంటే దరఖాస్తు చేసుకోవాలని, అలాగే జాబితాలో పేరు లేకపోయినా వార్డ్ సభలో దరఖాస్తు చేసుకోవాలని అన్నారు. తదుపరి క్షేత్ర స్థాయిలో పరిశీలించి అర్హులైన జాబితాను జనవరి 26 నుండి విడుదల చేయటం జరుగుతుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ బి.శ్రీనివాస్, వార్డ్ కౌన్సిలర్ రాపర్తి శ్రీనివాస్,అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ అధికారుల పరువు తీస్తున్న ప్రజాపాలన గ్రామసభలు

- అట్టర్‌ఫ్లాప్‌గా అగ్రస్థానంలో ప్రజా పాలన గ్రామ సభలు..
- రసాభాసగా గ్రామ సభలు జరుగుతున్న వైనం...



**దమ్మపేట, జనవరి 23 (జనంసాక్షి) :** కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం చేపట్టి ప్రజా సమస్యలను తీర్చడానికి ప్రజా పాలన అనే మహత్తర కార్యక్రమం చేపట్టి విజయం సాధించిందని చెప్పాలి.కానీ గ్రామ సభలు నిర్వహించి వారి సమస్యలను పరిష్కారం చూపుతుందని ప్రజలు ఎంతో ఆశతో గ్రామసభలకు వెళ్లిన క్రమంలో ప్రజా పాలనలో తమ సమస్యలను తెలిపిన గ్రామసభలో అవి పరిష్కారం కాకపోగా అర్హత ఉన్న వారిని వదిలేసి అనర్హులకు ప్రభుత్వ పథకాలలో లబ్ధిదారుల ఎంపికలు, వారి పేర్లు రావటంతో ప్రజలు తీవ్ర నిరాశకు గురై ఆగ్రహంతో అధికారులను ప్రశ్నించగా వారి వద్ద సమాధానం లేకపోయింది. మందలపల్లి గ్రామ సభలో ప్రజలు అధికారులపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. అర్హులైన వారికి రేషన్ కార్డులు,ఉపాధి హామీ పథకంలో పేర్లు,ఇందిరమ్మ ఇల్లు జాబితాలలో అర్హులైన వారి పేర్లు లేకపోవడంతో గ్రామ ప్రజలు విచారం వ్యక్తం చేస్తూ,అధికారులు తూతూ మంత్రంగా సర్వే నిర్వహించారని,ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురిలో ముగ్గురికి ఇందిరమ్మ ఇల్లు లబ్ధిదారులుగా చూపారని,సర్వేకి వచ్చిన అధికారులు అద్దెనివాసాలలో ఉంటున్న వారిని డాబాల ముందు ఫోటోలు దింపి డాబాలు ఉన్నవారిని రేకుల షెడ్డు ముందు ఫోటోలు దింపి,అర్హులకు ఇల్లు ఉన్నట్లుగా అనర్హులకు ఇల్లు లేనట్లుగా వారికి ఇళ్ళు మంజూరు చేశారని,అసలు ఇందిరమ్మ కమిటీ సభ్యులు ఎవరని,ఎవరికి తెలిపి ఇందిరమ్మ కమిటీ వేశారని,మూడు నాలుగు సంవత్సరాల క్రితం పెళ్లిళ్లు అయిన వారికి కొత్త రేషన్ కార్డులు మంజూరు చేశారని,10 సంవత్సరాలు క్రితం పెళ్లయిన వారికి రేషన్ కార్డులు మంజూరు కాలేదని, అధికారుల నిర్లక్ష్యంతో బడుగు,బలహీన ప్రజలు ప్రభుత్వ పథకాలకు నోచుకోవడం లేదని,అనర్హులకు పెద్దపీట వేస్తూ పేదవారిని పట్టించుకోవడంలేదని ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.సర్వే కి వచ్చిన అధికారులు కొందరి చెప్పు చేతల్లో ఉన్నారా అని ప్రజలు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.మరికొద్ది రోజుల్లో స్థానిక సంస్థల ఎన్నికలు ఉన్నవేళ గ్రామ సభలో జరుగుతున్న పరిణామాలు కాంగ్రెస్ ప్రభుత్వం పై కచ్చితంగా ఎఫెక్ట్ పడుతుందని పలువురు నాయకులు ప్రజలు తెలుపుతున్నారు.ఇకనైనా అధికారులు సమగ్రంగా అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ పథకాలు అందేలా చూడాలని ప్రజలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.దీనిపై స్పందిస్తూ అధికారులు ఇది తుది జాబితా కాదని ఎవరు అధైర్య పడవద్దు అని అర్హులైన ప్రతి ఒక్కరూ మరల దరఖాస్తు చేసుకోమని తెలిపారు. మండల వ్యాప్తంగా జరిగిన గ్రామసభలలో పలుచోట్ల గ్రామసభలు రసభసగా జరిగాయి అర్హులయి జాబితాలో పేర్లు లేని వారు తీవ్ర అసహనానికి గురై పకడ్బందీగా మరల సర్వే జరగనియెడల పంచాయతీ కార్యాలయాలు ముట్టడి,రాస్తారోకోకు వెనకాడబోని ప్రజలు వాపోతున్నారు.

## ప్రభుత్వ భవనాల నిర్మాణం కోసం స్థలాన్ని పరిశీలించిన కలెక్టర్



**అల్లాదుర్గం, జనవరి 23 (జనంసాక్షి) :** అల్లాదుర్గం సబ్ డివిజన్ లోని పలు కార్యాలయాల కోసం గురువారం మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ ఆయా ప్రభుత్వ భూములను పరిశీలించారు. క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా రెవెన్యూ యంత్రాంగం తో కలిసి ప్రభుత్వ భవనాల నిర్మాణం కోసం, గురుకుల పాఠశాల, ఐటిఐ, ఫైర్ స్టేషన్ నూతన భవనాల నిర్మాణం కోసం అల్లాదుర్గం లో ప్రభుత్వ భూములను కలెక్టర్ పరిశీలించారు. ఎస్ టి ఓ, ఐసిడిఎస్, ఎంపీడీవో, ఐ టి ఐ,గురుకుల పాఠశాల, ఫైర్ స్టేషన్, కార్యాలయాల భవన నిర్మాణానికి ప్రభుత్వ భూమిని కలెక్టర్ పరిశీలించారు. ఆయా స్థలాలకు సంబంధించిన పూర్తి వివరాలతో కూడిన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని రెవెన్యూ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. కార్యక్రమంలో తాసిల్దార్ మల్లయ్య, ఎంపిడిఓ, చంద్ర శేఖర్, మండల కాంగ్రెస్ అధ్యక్షులు శేషారెడ్డి, ఆర్ ఐ, సందీప్,తదితరులు ఉన్నారు.

# పెట్టుబడుల గమ్యస్థానం అస్సాం

**సింగిల్ విండో క్లియరెన్స్ సిస్టమ్‌తో రెడీ**

**అస్సాం పాఠశాల విద్య, ఉన్నత విద్య, గిరిజన వ్యవహారాల మంత్రి (ఫ్లెయిన్) డాక్టర్ రనోజ్ పెగు**

**హైదరాబాద్‌లో 'అడ్వాంటేజ్ అస్సాం 2.0' రోడ్డు షో**

హైదరాబాద్, జనవరి 23 (జనంసాక్షి)



అస్సాంను పెట్టుబడుల గమ్యస్థానంగా రూపొందించడం తమ లక్ష్యమని అస్సాం పాఠశాల విద్య, ఉన్నత విద్య, గిరిజన వ్యవహారాల మంత్రి (ఫ్లెయిన్) డాక్టర్ రనోజ్ పెగు తెలిపారు. పెట్టుబడిదారులకు సింగిల్ విండో క్లియరెన్స్ సిస్టమ్‌తో రెడీగా ఉన్నామన్నారు. అస్సాంలోని గౌహతిలో ఫిబ్రవరి 25, 26వ తేదీలలో 'అడ్వాంటేజ్ అస్సాం 2.0' పేరుతో నిర్వహించనున్న పెట్టుబడులు, మౌలిక సదుపాయాల సదస్సుకు పెట్టుబడిదారులను సమాయత్తం చేయడమే లక్ష్యంగా హైదరాబాద్‌లో రోడ్డు షో నిర్వహించారు. ఈ మేరకు హైదరాబాద్‌లోని తాజ్ కృష్ణ హొటల్‌లో ఈవెంట్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అస్సాంలో ఉన్న అవకాశాలపై జాతీయ, అంతర్జాతీయ సంస్థల నుంచి పెద్దఎత్తున ఆసక్తి వ్యక్తమవుతుందని చెప్పారు. అస్సాంను ప్రముఖ పెట్టుబడి కేంద్రంగా మార్చడానికి సహాయపడగల మేధావులు, వ్యాపారులతో మమ్మల్ని కలుపుతుందని నమ్ముతున్నామని తెలిపారు. ఇటీవల కాలంలో అస్సాం శ్రేయోభివృద్ధిలో కీలక మార్పులు జరిగాయన్నారు. కమ్యూనికేషన్, మౌలిక సదుపాయాలు, పరిశ్రమల అభివృద్ధిలో ప్రగతి సాధించామని తెలిపారు. అత్యంత వేగంగా రాష్ట్రం అభివృద్ధి చెందుతుందన్నారు. విద్య రంగంలో సాంకేతికతను వినియోగిస్తూ.. వ్యవస్థలను విప్లవాత్మకంగా మార్చామన్నారు. పాఠశాలల కోసం ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఆధారిత మేనేజ్‌మెంట్ సిస్టమ్‌ను ప్రవేశపెట్టామన్నారు. ఇది ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల మధ్య సంబంధాలను పెంచుతుందన్నారు. మెడికల్, ఇంజనీరింగ్ కాలేజీల సంఖ్యను పెంచామన్నారు. 2026-2027 నాటికి మరిన్ని సంస్థలను ప్రారంభనున్నామని తెలిపారు. ప్రత్యేకంగా సైన్స్, టెక్నాలజీ కోసం, ఏఐ, ఎంఎల్ వంటి నూతన సాంకేతికతలపై ప్రత్యేకంగా దృష్టి పెట్టే విశ్వవిద్యాలయాలను ప్రారంభించనున్నామని చెప్పారు. గత దశాబ్దంలో 25 శాతం జనాభాను పేదరికం నుంచి బయటకు తేవడంలో విజయవంతం అయ్యామన్నారు. అస్సాం వేగంగా పారిశ్రామికాభివృద్ధి సాధించబోతుందన్నారు. తూర్పు భారతదేశం ముఖ్యంగా అస్సాంలోని అవకాశాలను అన్వేషించడానికి మిమ్మల్ని ఆహ్వానిస్తున్నామని చెప్పారు. ప్రజల మనోభావాలు మారాయన్నారు. అభివృద్ధిని నడిపించడానికి ఆసక్తి చూపిస్తున్నారని తెలిపారు. దక్షిణ భారతదేశంలో అర్హత కలిగిన యువత ఉద్యోగాల కోసం వలస వెళ్లడాన్ని అరికట్టడానికి..

అస్సాం స్కిల్ యూనివర్సిటీని స్థాపించామన్నారు. ఈ యూనివర్సిటీ విద్యార్థులను నైపుణ్యం కలిగిన మానవ వనరులుగా తీర్చిదిద్దేందుకు కట్టుబడి ఉందన్నారు. పరిశ్రమలకు నైపుణ్యం కలిగిన శ్రామికశక్తిని నిరంతరం అందించేందుకు, పెట్టుబడులకు దోహదపడే సహాయాలు, ప్రోత్సాహకాలు, రాయితీలను అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. అస్సాం అభివృద్ధిలో భాగస్వామ్యం కావాలని కోరారు. ఈ సందర్భంగా అస్సాం కార్మిక సంక్షేమ శాఖ అదనపు ప్రధాన కార్యదర్శి బీ కల్యాణ్ చక్రవర్తి మాట్లాడుతూ గడచిన దశాబ్దంలో అస్సాం అసాధారణ ఆర్థిక వృద్ధిని సాధించిందన్నారు. రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ 29 బిలియన్ల డాలర్ల నుంచి 68 బిలియన్ల డాలర్లకు పెరిగిందన్నారు. 2030 నాటికి 130 బిలియన్ల డాలర్ల లక్ష్యాన్ని చేరుకోవడానికి అస్సాం సంకల్పబద్ధంగా ముందుకు సాగుతుందన్నారు. అస్సాం వృద్ధి రేటు జాతీయ సగటును రెండు శాతం అధిగమించడం రాష్ట్ర పురోగతిని ప్రతిఫలిస్తున్నదన్నారు.

# గ్రామ సభలే ప్రజా వ్యతిరేకతకు, కాంగ్రెస్ పతనానికి నాంది

**ఆర్మూర్ మాజీ ఎమ్మెల్యే జీవన్ రెడ్డి**

ఆర్మూర్,జనవరి 23( జనం సాక్షి):



కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల తిరుగుబాటుకు గ్రామ సభలే సాక్ష్యంగా నిలుస్తున్నాయని బీఆర్ఎస్ నిజామాబాద్ జిల్లా అధ్యక్షుడు,మాజీ ఎమ్మెల్యే ఆశన్నగారి జీవన్ రెడ్డి అన్నారు.గురువారం మీడియాతో మాట్లాడుతూ గ్రామసభల సాక్షిగా కాంగ్రెస్ ప్రభుత్వ అన్యాయాలను నిలదీయాలన్నారు.ఆర్మూర్ లో ఎమ్మెల్యే రాకేష్ రెడ్డి పై ఇళ్లు ఎప్పుడు కట్టిస్తావని మహిళలు తిరగబడ్డారని,భువనగిరి ఎమ్మెల్యేను ఉరికిచ్చికొట్టారని ప్రతిఘటించారు.కేవలం కాంగ్రెస్ కార్యకర్తలకే ఇందిరమ్మ ఇళ్ళు,రేషన్ కార్డులు ఇస్తామని నాగర్ కర్నూలు కాంగ్రెస్ ఎమ్మెల్యే అనడం కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరికి నిదర్శనమనీ విమర్శించారు. ఇందిరమ్మ ఇళు ్ళ,రేషన్ కార్డుల మంజూరు పేరుతో నిర్వహిస్తున్న గ్రామసభల్లో ప్రజల తిరుగుబాటు కాంగ్రెస్ ప్రజావ్యతిరేక పాలనకు నిలువెత్తు నిదర్శనమన్నారు. అమలుకాని ఆరు గ్యారెంటీలే కాంగ్రెస్ ప్రభుత్వ పతనానికి నాంది అంటూ ధ్వజమెత్తారు.స్థానిక సంస్థల ఎన్నికల్లో హీరో కావాలనుకున్న కాంగ్రెస్ పార్టీ, గ్రామ సభల్లో నిలదీతతో జీరోగా మారింద న్నారు.రాష్ట్రవ్యాప్తంగా గ్రామసభలు నిర్వహిస్తున్న సీఎం, మంత్రుల పత్తా లేకుండా పోయిందని, ఎమ్మెల్యే లను గ్రామాల్లోకి రానివ్వడం లేదని చెప్పారు .నిజామాబాద్ జిల్లా ప్రజలంతా ప్రభుత్వ మోసాలపై నిరసన గళమెత్తాలని జీవన్ రెడ్డి పిలుపు నిచ్చారు.

# రెండుసార్లు ప్రజలు చీకొట్టినా బుద్ధి రాలేదా కాటా?

**దమ్ముంటే నేరుగా ఎదురుకో..**

**పార్టీ అధిష్టానానికి ఫిర్యాదు చేస్తాం..**

**ఘటనలో పాల్గొన్న ప్రతి ఒక్కరిపై కేసులు నమోదు కావాల్సిందే.. :**

**ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి**

పఠాన్ చెరు, జనవరి23 (జనంసాక్షి)



ప్రజలు రెండుసార్లు చీకొట్టినా బుద్ధి మారకుండా తిరిగి నియోజకవర్గంలో నీచ రాజకీయాలు చేస్తూ వ్యక్తిగత దాడులకు పాల్పడడం మానుకోకపోతే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని పటాన్చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జి కాటా శ్రీనివాస్ గౌడ్ ను హెచ్చరించారు. గురువారం పటాన్చెరువు ఎమ్మెల్యే క్యాంపుకార్యాలయం పై కాటా శ్రీనివాస్ గౌడ్ వర్గానికి సంబంధించిన వ్యక్తులు దాడి ఘటనను నిరసిస్తూ ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎమ్మెల్యే నివాసం ఉండే క్యాంపు కార్యాలయంపై కార్యకర్తలను రెచ్చగొట్టి దాడులకు దిగడం ప్రజాస్వామ్యానికి పెను ప్రమాదం లాంటిదన్నారు. పటాన్చెరు నియోజకవర్గ ప్రజల ఆశీర్వాదంతో మూడుసార్లు గెలిచి హ్యాట్రిక్ ఎమ్మెల్యేగా ప్రజల హృదయాలను గెలుచుకోవడం జరిగిందని తెలిపారు. కాటా శ్రీనివాస్ గౌడ్ కి అమీన్పూర్ సర్పంచ్ గా ప్రజలు అవకాశం అందిస్తే నిధులు పక్కదారి పట్టించి జైలు పాలు కావడంతోపాటు, రెండుసార్లు ఎమ్మెల్యేగా పోటీ చేసి దారుణ ఓటమికి గురైన వ్యక్తులు నేడు తనపై వ్యాఖ్యలు చేయడం సిగ్గుగా ఉందన్నారు. తన 30 ఏళ్ల రాజకీయ జీవితంలో ఇలాంటి నీచ రాజకీయాలను చూడలేదన్నారు. ప్రభుత్వ కార్యక్రమాలలో ప్రోటోకాల్ ప్రకారం మాత్రమే ఆహ్వానాలు అందజేశారు తప్ప.. పార్టీలకు అనుగుణంగా నిర్వహించడం జరుగుతుందా అని ప్రశ్నించారు. తమ కార్యకర్తలు ప్రతిఘటిస్తే పరిస్థితులు ఎలా ఉండేవని ప్రశ్నించారు. తన కార్యకర్తలు తమ మీద ఒత్తిడి చేసిన నేను వాళ్ళను కంట్రోల్ చేసుకుంటూ అక్కడికి ఎవరిని రాకుండా ఎలాంటి హింస వాతావరణం చోటు చేసుకోకుండా నియంత్రించానని వెల్లడించారు. ఇలాంటి దాడుల సంస్కృతి పటాన్ చెరు ప్రాంతంలో ఇప్పటివరకు లేదని తమ ఓపికను పరీక్షిస్తే తీవ్ర పరిణామాలు తప్పవని హెచ్చరించారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృత్తం చేస్తే చూస్తూ ఊరుకోబోమని అందుకు తగ్గమూల్యం చెల్లిస్తామని తీవ్రంగా స్పందించారు. క్యాంపు ఆఫీసుపై దాడి చేసిన దుండగులపై పోలీసులు కఠినంగా వ్యవహరించాలని వారిపై కేసులు నమోదు చేసి జైలుకు పంపాలని పోలీసులను డిమాండ్ చేశారు. ఈ ఘటనపై ఇప్పటికే ఐజి సత్యనారాయణ దృష్టికి తీసుకెళ్లడం జరిగిందని జిల్లా ఎస్పీకి ఫిర్యాదు చేశామని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ అధిష్టానానికి సైతం ఫిర్యాదు చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ సమావేశంలో ప్రజా ప్రతినిధులు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఆదాయ పన్ను తగ్గాలి..

బడ్జెట్‌లో మెజారిటీ ట్యాక్స్‌పేయర్స్ కోరేదిదే రాబోయే బడ్జెట్‌లో ఆదాయ పన్ను (ఐటీ) రేట్లు తగ్గాలనే అత్యధిక వ్యక్తిగత పన్ను చెల్లింపుదారులు కోరుకుంటున్నట్లు బుధవారం గ్రాంట్ థోంటన్ భారత్ ప్రీ-బడ్జెట్ సర్వే తెలిపింది.

రాబోయే బడ్జెట్‌లో ఆదాయ పన్ను (ఐటీ) రేట్లు తగ్గాలనే అత్యధిక వ్యక్తిగత పన్ను చెల్లింపుదారులు కోరుకుంటున్నట్లు బుధవారం గ్రాంట్ థోంటన్ భారత్ ప్రీ-బడ్జెట్ సర్వే తెలిపింది. 57 శాతం మందిది ఇదే మాట అని స్పష్టం చేసింది. వచ్చే ఆర్థిక సంవత్సరానికి (2025-26)గాను ఫిబ్రవరి 1న పార్లమెంట్‌లో కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ బడ్జెట్‌ను ప్రవేశ పెట్టబోతున్నారు. ఈ క్రమంలో తాజా సర్వే ఫలితాలు ప్రాధాన్యాన్ని సంతరించుకున్నాయి.

ప్రోత్సాహకాలు పెరగాలి

ప్రస్తుతం వ్యక్తిగత పన్ను చెల్లింపుదారుల్లో 72 శాతం మంది కొత్త ఆదాయ పన్ను విధానాన్నే ఎంచుకుంటున్నారు. అయినప్పటికీ 63 శాతం మంది పాత ఆదాయ పన్ను విధానం కిందనున్న ప్రోత్సాహకాలు మరింత పెరగాల్సిన అవసరం ఉందని కూడా అభిప్రాయపడుతున్నట్లు సర్వే పేర్కొన్నది. ఇక కొత్త పన్ను విధానంలోనూ పన్ను రేట్లు తగ్గాలని దాదాపు 46 శాతం మంది డిమాండ్ చేస్తుండగా, ఈసారి పన్ను మినహాయింపు పరిమితుల్ని పెంచుతారన్న విశ్వాసాన్ని 26 శాతం మంది వ్యక్తం చేశారు. ఈ సర్వేలో 500 మందికిపైగా పాల్గొనగా, వ్యక్తిగత ఆదాయ పన్ను తగ్గి, వ్యక్తుల ఆదా యం పెరిగేలా రాబో యే బడ్జెట్ నిర్ణయాలుండాలని అంతా కోరుకుంటున్నట్లు గ్రాంట్ థోంటన్ వెల్లడించింది.

10 సర్వేలో డిమాండ్లు

కొత్త ఆదాయ పన్ను విధానం కింద హౌజ్ ప్రాపర్టీ నష్టాలను

తమ వ్యక్తిగత ఆదాయాలకు తగ్గట్టు సర్దుబాటు చేసుకునేలా కేంద్ర ప్రభుత్వం అనుమతించాలని 53 శాతం మంది ట్యాక్స్‌పేయర్స్ కోరుతున్నారు.

పాత ఆదాయ పన్ను విధానంలో సర్దుబాట్ల పరిమితిని పెంచాలని లేదా రూ.2 లక్షల పరిమితిని తొలగించాలని సుమారు 47 శాతం మంది ట్యాక్స్‌పేయర్స్ డిమాండ్ చేస్తున్నారు.

నష్టాల సర్దుబాటుతో నిర్మాణ రంగంలో పెట్టుబడులకు దన్ను లభిస్తుందని మెజారిటీ వ్యక్తిగత ఆదాయ పన్ను చెల్లింపుదారులు అభిప్రాయపడుతున్నారు.

# మహిళలను ఆర్మీలుగా తయారుచేసిన యోధుడే నేతాజీ

సుభాష్ చంద్రబోస్ ఒరిస్సాలోని కటక్ లో జనవరి 23,1897లో జానకి నాథ్ బోస్, ప్రభావతి బోషులకు తొమ్మిదవ సంతానంగా, ధనిక కుటుంబంలో జన్మించాడు. విద్యలో చురుకైన విద్యార్థి 1920లో ఇండియన్ సివిల్ సర్వీసులో, పరీక్షలో దేశవ్యాప్తంగా నాలుగవ స్థానంలో సివిల్ సర్వీస్ పరీక్షలో ఉత్తీర్ణుడై, కలెక్టర్గా బ్రిటిష్ వారితో ఇమడలేక కలెక్టర్ ఉద్యోగానికి రాజీనామా చేశాడు. బ్రిటిష్ వారు భారతీయులను తక్కువ చేసి బానిసలుగా, కించపరిచిన మాటలు ఆయన తట్టుకోలేక, కాంగ్రెస్ లో జాయిన్ అయ్యాడు. గాంధీ గారి శాంతి అహింస సరిపోదని, చూపుడు వేలుతో యుద్ధం చేయడం, జర్మనీతో ఒప్పందం సొంతంగా రేడియో స్టేషన్ ప్రారంభించి, స్వాతంత్ర నినాదాలు, జర్మనీకి బందీలుగా ఉన్నటువంటి సుమారు 5000 మంది పోగుచేసి, అంతకుముందు తన 16వ ఏటనే కాలేజీలో భారతీయ విద్యార్థులను తక్కువ చేసి కించపరుస్తుంటే చూడలేక ప్రొఫెసర్ పై దాడికి కూడా దిగాడు, స్వరాజ్ అనే పత్రికను, 1923లో యూత్ కాంగ్రెస్ ప్రెసిడెంట్గా ఎన్నికయ్యాడు. కాంగ్రెస్ పార్టీని ప్రభుత్వంగా భావించాలని ఒక పార్టీగా చూడకూడదని, చంద్రబోస్ మాటలు గాంధీజీకి నచ్చలేదు. గాంధీజీ అహింసా సిద్ధాంతాన్ని, నేతాజీ పోరాటం గాంధీజీకి నచ్చకపోవడం వల్ల, 1939లో కాంగ్రెస్ కు రాజీనామా చేశాడు. భారత జాతీయ ఫార్వార్డ్ బ్లాకును, ఏర్పాటు చేసి రెండు లక్షల మందితో మీటింగ్ , ఆ తర్వాత రెండో ప్రపంచ యుద్ధం, ఓటమిని 1945 ఆగస్టు 15న ఓటమిని అంగీకరించడంతో భారత జాతీయ సైన్యం విరమించుకుంది. ఫార్వర్డ్ పార్టీ స్థాపించిన తర్వాత ఆంధ్రప్రదేశ్, ఏలూరు కాకినాడ, రాజమండ్రి, విద్యార్థులు సభలు ఉద్యమాలు చేయడం మొదలు పెట్టే క్రమంలో జుమావుద్దీన్ గా రకరకాల మారువేశాలలో కూడా, సభలు సమావేశాలు, విద్యార్థి నాయకులను కూడా తయారుచేయడం జరిగింది. సాయుధ పోరాటం ద్వారా ఆంగ్లేయులను దేశం నుండి తరిమికొట్టే క్రమంలో, అరెస్ట్ కావడం అనారోగ్యంతో కూడా 11 మార్లు జైల్లో ఉండడం, అయినా బ్రిటిష్ వారికి చుక్కలు చూపించిన గట్టి స్వతంత్ర పోరాటయోధుడు, నాకు రక్తం ఇవ్వండి నేను మీకు స్వేచ్ఛను ఇస్తాను అని శపథం చేసి జర్మనీ జపాన్ సింగపూర్ బర్మా తైవాన్ మలేషియా పిలిపిన్ ఇలాంటి దేశాలలో 40 వేల సైన్యాన్ని పోగుచేసి, ఆ క్రమంలో పుట్టిందే, ఇండియన్ నేషనల్ ఆర్మీ , అప్పుడే భారతీయులను ఆర్మీల లాగా యూనిఫామ్ గా ఏకం చేసి పోరాటం చేసి, ఆంగ్లేలను పరిగెత్తించడంలో పని పెట్టుకున్న స్వతంత్ర యోధుడు సుభాష్ చంద్రబోస్, అయినా జననం 128 సంవత్సరాల అయినప్పటికీ, ఆజాద్ హింద్ పౌజు నిధులతో ఉద్యమాన్ని నడుపుతూ, ఉద్యమంలో భాగంగా, సోవియేట్ యూనియన్ నుండి తప్పించుకొని 1941లో అభిబు రెహ్మాన్ నేతాజీ కలిసి సైగోనుండి విమానం బయలుదేరడం, రహిమాన్ దగ్గర , ఆజాది హిందూ పౌజు కుసంబంధించిన పత్రాలు ఉండడం అప్పటికి విమానంలో నేతాజీ చనిపోయాడని, చైనావాజ్ కమిటీ , 1956 లో కమిటీ విచారణ జరిపి నేతాజీ మరణం ఒక మిస్టరీగా, భారతీయుల కోసం, ఆ రోజుల్లో ఉన్నత ఉద్యోగాన్ని వదిలి, స్వాతంత్రం సుభాష్ చంద్రబోస్ వల్లనే వచ్చింది అని ఆక్లి బ్రిటన్ ప్రధాని చెప్పినటువంటి మాటలు అది కూడా ఇండియన్ నేషనల్ ఆర్మీ వల్ల పోరాటం చేసి ,బ్రిటిష్ వారిని పరిగెత్తించి పారిపోయేలా చేసిన ,స్వతంత్ర వీరుడు సుభాష్ చంద్రబోస్. ఆయనఉద్యమకర్తే కాదు రచయిత కూడా ద ఇండియన్ స్ట్రగుల్ అనేపుస్తకాన్ని కూడా రాశాడు చావు కూడా తెలియకుండా పోరాడిన, స్వాతంత్ర ఉద్యమ నాయకుడు సుభాష్ చంద్రబోస్ కి 128వ జయంతి శుభాకాంక్షలు.


(జనంసాక్షి)


**అలివేలు మంగ**

**- వాసవి శ్రీ నిలయ మా భూమి**

# అసుదుద్దీన్ ఓవైసీ కుంభమేళాలో పాల్గొన్నారా..?



మహాకుంభ మేళాలో పాల్గొనడం కోసం ప్రతి రోజూ లక్షలాది మంది భక్తులు ప్రయాగ్‌రాజ్ తరలి వెళ్తున్నారు. ఇప్పటికే కోట్లాది మంది భక్తులు గంగా నదిలో స్నానాలు చేయగా.. మొత్తం 45 కోట్ల మంది వరకూ గంగా నదిలో స్నానం చేస్తారనే అంచనాలు ఉన్నాయి. మహా కుంభ మేళాలో అనేక మంది ప్రముఖులు ఇప్పటికే స్నానాలు చేయగా.. ఏఐ ద్వారా చాలా మంది సెలబ్రిటీలు గంగా నదిలో స్నానం చేస్తున్నట్లుగా ఉన్న ఫొటోలు క్రియేట్ చేస్తున్న ఘటనలు కూడా చోటు చేసుకుంటున్నాయి.

ప్రయాగ్‌రాజ్ వేదికగా జరుగుతున్న మహా కుంభమేళాకు భారీ ఎత్తున జనం తరలి వస్తున్నారు. నిత్యం లక్షలాది మంది భక్తులు గంగా నదిలో స్నానం ఆచరిస్తున్నారు. మహా కుంభమేళాకు సంబంధించి నిత్యం పెద్ద సంఖ్యలో వార్తలొస్తున్నాయి. అలాగే ఫేక్ న్యూస్, తప్పుదోవ పట్టించే వార్తలు కూడా సోషల్ మీడియాలో భారీగానే వస్తున్నాయి. మజ్లిస్ అధినేత అసదుద్దీన్ ఓవైసీ ప్రయాగ్ రాజ్ వెళ్లి గంగా నదికి నమస్కరిస్తున్నట్లుగా ఓ వీడియో కనిపించింది.

కాషాయ వస్త్రాలు, కాషాయ రంగు టోపీ ధరించి.. మెడలో రుద్రాక్ష మాలతో ఉన్న అసదుద్దీన్ ఓవైసీ గంగా నదికి ప్రణామం చేస్తుండగా.. ఆయన పక్కనే సాధువులు ఉన్న వీడియోను హింద తనవాలా యోగేష్ అనే ఎక్స్ హ్యాండిల్‌లో జనవరి 17న పోస్ట్ చేశారు. 'మన వారసుల పాపాలను పోగొట్టుకోవడానికి మహ కుంభ మేళాకు వస్తాం' అని దీనికి క్యాప్షన్ జోడించారు.

దీంతో యూజర్ పోస్టు చేసిన వీడియో స్క్రీన్ షాట్ తీసి టూల్ ద్వారా పరీక్షించగా.. అది ఫేక్ ఇమేజ్ అయ్యే అవకాశం 91.07 శాతం ఉందని తేలింది. ముస్లిం నేత అసదుద్దీన్ ఓవైసీ మహా కుంభమేళాకు వస్తే అది పెద్ద వార్త అవుతుంది. కానీ ప్రధాన మీడియాలో ఎక్కడా దీనికి సంబంధించి వార్తలు కనిపించలేదు.

అని ఎక్స్‌లో సెర్చ్ చేయగా.. ఓవైసీ గంగా నదిలో స్నానం చేస్తున్నట్టుగా ఉన్న వీడియోను మరికొందరు షేర్ చేయడం కనిపించింది.

లోక్‌పహల్ జన్‌మంచ్ అనే ఎక్స్ హ్యాండిల్‌లో మాత్రం ఇది ఏఐతో రూపొందించిన వీడియో అని పేర్కొన్నారు. మరోవైపు ఏఐ టూల్స్ సైతం వైరల్ అవుతోన్న వీడియో స్క్రీన్ షాట్ ఫేక్ ఇమేజ్ అని తేల్చడంతో.. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ద్వారా రూపొందించిన వీడియో అని సజగ్ టీమ్ నిర్ధారణకు వచ్చింది.మజ్లిస్ నేత అసదుద్దీన్ ఓవైసీ ప్రయాగ్ రాజ్‌లోని మహాకుంభ మేళాలో పాల్గొన్నారంటూ సోషల్ మీడియాలో ప్రచారంలో ఉన్న క్లెయిమ్ అవాస్తవం. ఇది ఏఐ సాయంతో రూపొందించిన వీడియో అని సజగ్ టీమ్ దర్యాప్తులో తేలింది. బాలీవుడ్ నటులు, అంతర్జాతీయ ప్రముఖులు మహా కుంభ మేళాకు వచ్చారంటూ కొద్ది రోజుల ముందు కూడా ఫొటోలు వైరల్ కాగా.. అవి ఫేక్ అని సజగ్ టీమ్ తేల్చింది.

## వాస్తవమేంటి?

**ఈ వీడియో నిజమేనా అని తెలుసుకోవడం కోసం మేం ముందుగా అసదుద్దీన్ ఓవైసీ ఎక్స్ హ్యాండిల్ ను పరిశీలించాం. ప్రయాగ్ రాజ్‌లో మహా కుంభ మేళా 2025 జనవరి 13న ప్రారంభమైన నాటి నుంచి ఇప్పటి వరకూ ఆయన ఎక్స్ ఖాతాలో ఇలాంటి పోస్టులేవీ కనిపించలేదు. తర్వాత సంబంధిత కీవర్డ్స్‌తో గూగుల్‌లో సెర్చ్ చేశాం. దీనికి సంబంధిం చిన కథనాలు కనిపించలేదు.**

# సామాన్యుడి పెళ్లి బరాత్‌కు పెద్ద ఎత్తున భద్రత..

సామాన్యంగా ఎవరి పెళ్లి బరాత్‌లో అయినా స్నేహితులు, బంధువులు.. చుక్కా, ముక్కా ఉంటాయి. అలాగే పెద్ద ఎత్తున డీజేలు పెట్టుకుంటూ.. ఉల్లాసంగా, ఉత్సాహంగా నృత్యాలు చేస్తూ రచ్చ చేస్తుంటారు. కానీ మనం ఇప్పుడు చూడబోయే పెళ్లి బరాత్‌లో మాత్రం బంధువులతో పాటు పోలీసులు కూడా ఉన్నారు. అలా అని వారేమీ కొత్త పెళ్లి జంటకు స్నేహితులు కాదు. ఒక సామాన్యుడి భద్రత కోసమే వారంతా అతడి బరాత్‌కు వచ్చారు. మరి అందుకు గల కారణాలు ఏంటో మనం ఇప్పుడు తెలుసుకుందాం.

బరాత్ అనగానే.. అందరికీ కొత్త పెళ్లి జంటతో పాటు వారి బంధువులు, స్నేహితులు పెద్ద పెద్ద డీజేలు పెట్టుకుని డ్యాన్సులు చేయడం గుర్తుకు వస్తుంది. అలాగే చుక్క, ముక్కలు తీసుకుంటూ అక్కడికి వచ్చిన వారంతా రచ్చ చేయడం కూడా మనకు తెలుసు. కానీ మనమిప్పుడు చూడబోయే పెళ్లి బరాత్‌లో మాత్రం బంధువులు, స్నేహితులతో పాటు పోలీసులు కూడా ఉన్నారు. మొత్తం 400 మంది పోలీసులు తుపాకీలు, లాఠీలు చేత పట్టుకుని ఆ బరాత్‌కు వచ్చారు. అలా అని కొత్త జంటకు వారంతా స్నేహితులు అనుకుంటున్నారేమో. అదేం కాదండీ.. యూనిఫాంలోనే వారంతా అక్కడకు వచ్చి భద్రత చేపట్టారు. పెళ్లి బరాత్‌కు పోలీసులు ఎందుకంత భద్రత కల్పించారో మనం ఇప్పుడు తెలుసుకుందాం.

రాజస్థాన్‌లోని అజ్మీర్ జిల్లా శ్రీనగర్ గ్రామానికి చెందిన మోహన్ బకోలియా దళిత కుటుంబానికి చెందిన వాడు. అయితే ఇటీవలే మోహన్ బకోలియా తన కుమారుడు లోకేష్‌కు.. లావెరా గ్రామానికి చెందిన నారాయణ్ కొర్వాల్ కుమార్తె అరుణతో పెళ్లి నిశ్చయం చేశాడు. జనవరి 21వ తేదీన వీరి పెళ్లికి ముహూర్తం కూడా ముందే పెట్టుకున్నారు. అయితే తమ సంప్రదాయం ప్రకారం పెళ్లిరోజు అబ్బాయి.. అమ్మాయి ఇంటికి బరాత్‌గా రావాలి. అయితే బరాత్‌లో భాగంగా పెళ్లి కొడుకు గుర్రంపై కూర్చుంటాడు. ఈ విషయాలన్నీ ముందుగానే ఇరుకుటుంబాల పెద్దలు చర్చించుకున్నారు. అయితే ఓ దళిత వర్గానికి చెందిన వరుడు గుర్రంపై వస్తాడన్న విషయం తెలుసుకున్న గ్రామ అగ్ర వర్ణాల ప్రజలు.. అందుకు తాము ఒప్పుకోమని చెప్పారు. నారాయణ్ కొర్వాల్‌ను పిలిపించి మరీ బరాత్ చేయడానికి వీల్లేదని వివరిం చారు. కానీ ముందుగానే అబ్బాయి తరఫు వాళ్లకు బరాత్ చేసేందుకు ఓకే చెప్పిన ఇతడు.. ఏం చేయాలా అని ఆలోచించాడు.

# అర్హులందరికీ సంక్షేమ పథకాలు అమలు చేస్తాం

**రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి**

**పదేళ్లలో ఒక్క రేషన్ కార్డు ఇవ్వలేని వారు విమర్శలు**

**ఆదిభట్లలో రూ. 25 కోట్లతో రహదారి నిర్మాణానికి శంకుస్థాపన**

**ఇబ్రహీంపట్నం, జనవరి 23(జనం సాక్షి)**



రాష్ట్రంలో అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అమలు చేస్తామని రోడ్లు భవనాలు సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి వెల్లడించారు. ఆదిభట్ల మున్సిపాలిటీ లో స్థానిక ఎమ్మెల్యే మల్రెడ్డి రంగారెడ్డి, మున్సిపల్ చైర్మన్ మర్రి నిరంజన్ రెడ్డితో కలిసి ఆదిభట్ల నుండి కొంగరకలాన్ చౌరస్తా మీదుగా మంగళపల్లి వరకు రూ. 25 కోట్ల రూపాయల నిధులతో రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి మాట్లాడుతూ ప్రజా పాలనలో దరఖాస్తు చేసుకున్న వారిలో అర్హులైన ప్రతి ఒక్కరికి పథకాలు అందుతాయని, ఇది నిరంతర ప్రక్రియ అన్నారు. ఇచ్చిన మాట ప్రకారం ఉచిత బస్సు ప్రయాణం, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, అదేవిధంగా రూ. 500 లకే సిలిండర్ అందిస్తున్నామని చెప్పారు. ఇందిరమ్మ ఇల్లు, కొత్త రేషన్ కార్డులు, రైతు భరోసా ప్రజలకు ఇచ్చిన హామీలను ఎన్ని ఇబ్బందులు ఎదురైనా అందిస్తామని తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలో ఇందిరమ్మ ప్రజా పాలనలో ప్రజల కోసం నిరంతరం కష్టపడుతున్నామని వారి సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తున్నామన్నారు. గత పది ఏళ్లలో ఒక్క రేషన్ కార్డు కూడా ఇవ్వలేని మాజీ మంత్రులు నేడు విమర్శలు చేస్తున్నారని దుయ్యబట్టారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ లు చిలుక మధుసూదన్ రెడ్డి, కంబాలపల్లి గుర్నాథ్ రెడ్డి, వైస్ చైర్మన్ లు భాస్కర చారి, కరుణాకర్, ఇబ్రహీంపట్నం మున్సిపల్ చైర్మన్ స్రవంతి చందు, మాజీ జెడ్పీటీసీ మహిపాల్, మున్సిపల్ అధ్యక్షులు బాలరాజుగౌడ్, లక్ష్మీపతి గౌడ్, పార్టీ నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు, ప్రజలు పాల్గొన్నారు.

# కరీంనగర్ లో వెజ్, నాన్ వెజ్ మార్కెట్ ను ప్రారంభించిన కేంద్ర మంత్రి బండి సంజయ్

**కరీంనగర్ బ్యూరో, జనవరి 23 (జనంసాక్షి) :**



**నేడు కరీంనగర్ కు కేంద్ర మంత్రి ఖట్టర్...రాష్ట్ర మంత్రులు హాజరవుతున్నారు.**

**ప్రజలంతా తరలివచ్చి బహిరంగ సభను విజయవంతం చేయాలని కోరిన సంజయ్.**

కరీంనగర్ లోని పద్మానగర్ లో దాదాపు రూ.14 కోట్ల వ్యయంతో నూతనంగా నిర్మించిన ఇంటిగ్రేటెడ్ వెజ్, నాన్ వెజ్ మార్కెట్ ను కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాజీమంత్రి గంగుల కమలాకర్, నగర మేయర్ సునీల్ రావు తదితరులతో కలిసి బండి సంజయ్ మీడియాతో మాట్లాడారు. కరీంనగర్ లో రూ.14 కోట్లతో నిర్మించిన ఈ వెజ్, నాన్ వెజ్ మార్కెట్ ను ప్రారంభించడం సంతోషంగా ఉందని నాకు తెలిసి రాష్ట్రంలో ప్రభుత్వ నిధులతో నిర్మించిన ఇంత మంచి మార్కెట్ ఎక్కడా లేదనుకుంటాను అని అన్నారు. ఈ మార్కెట్ కరీంనగర్ ప్రజలకు ఎంతో సౌకర్యంగా ఉంటుందని దీంతోపాటు కరీంనగర్ లోని ఇతర వార్డుల్లోనూ ప్రజల సౌకర్యార్థం ఈ మార్కెట్లను నిర్మించి అందుబాటులోకి తీసుకురావాల్సిన అవసరం ఉందన్నారు. దానివల్ల ప్రజలకు దూరాభారం తగ్గుతుందని ట్రాఫిక్ సమస్య తగ్గుతుందన్నారు. ఈ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం ఇంకా సహకరించాలని కోరుతున్నానని అట్లాగే వివిధ అభివృద్ధి పనులకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం పెండింగ్ నిధులను చెల్లించాల్సి ఉందని వాటిని వెంటనే మంజూరు చేయాలని కోరుతున్నానని తెలిపారు. నేడు కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రి మనోహర్ లాల్ ఖట్టర్ కరీంనగర్ లో 24 గంటలపాటు మంచి నీటి సరఫరా కార్యక్రమాన్ని ప్రారంభించేందుకు సిద్ధంగా ఉన్నారని ఈ కార్యక్రమానికి రాష్ట్ర మంత్రులు శ్రీధర్ బాబు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, పొన్నం ప్రభాకర్ హాజరు కాబోతున్నారన్నారు. ఈ కార్యక్రమం సందర్భంగా కరీంనగర్ లోని హౌజింగ్ బోర్డులో నిర్వహించే సభకు ప్రజలంతా తరలివచ్చి సభను విజయవంతం చేయాలని కోరుతున్నానని కేంద్ర మంత్రి బండి సంజయ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆరెస్ నగర అధ్యక్షులు చల్ల హరిశంకర్, స్థానిక 16 డివిజన్ కార్పొరేటర్ బోనాల శ్రీకాంత్, కార్పొరేటర్లు, బీఆరెస్ నాయకులు, బిజెపి నాయకులు, కార్యకర్తలు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి

**కరీంనగర్ బ్యూరో, జనవరి 23 (జనంసాక్షి) :**



**వ్యవసాయం చేసే వారికి ... రైతు కూలీలకు రైతు భరోసా ఇస్తాం.**

**దశలవారీగా ఇందిరమ్మ ఇండ్ల బిల్లులను ప్రభుత్వం చెల్లిస్తుంది.**

**కరీంనగర్ రూరల్ మండలం చామనపల్లిలో ప్రజా పాలన గ్రామ సభకు హాజరైన సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి.**

ప్రజలందరూ ఓపికతో రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని శాతవాహన అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి కోరారు. గురువారం కరీంనగర్ రూరల్ మండలం చామనపల్లి గ్రామంలో నిర్వహించిన ప్రజా పాలన ఇందిరమ్మ గ్రామసభకు ముఖ్య అతిథిగా హాజరై నరేందర్ రెడ్డి మాట్లాడారు. వ్యవసాయం చేసే రైతులకు పెట్టుబడి సాయాన్ని ప్రభుత్వం అందిస్తుందని రైతు కూలీలకు సైతం ఇందిరమ్మ ఆత్మీయ భరోసా ద్వారా 12000 ఆర్థిక సహాయాన్ని ప్రభుత్వం అందజేస్తుందని చెప్పారు. గతంలో పాలించిన టిఆర్ఎస్ ప్రభుత్వంలో రాళ్లు రప్పలు వ్యవసాయ యోగ్యత లేని భూములకు కొండలకు గుట్టలకు రైతు భరోసా ఇచ్చారని ఆరోపించారు. ఇందులో నిజమైనటువంటి రైతులకు తీవ్ర అన్యాయం జరిగిందని విమర్శించారు. ప్రతి ఒక్కరికి డబుల్ బెడ్ రూములు ఇస్తామని ఆనాడు కేసీఆర్ ఘోరంగా ప్రజలను మోసం చేసి వంచించారన్నారు. దశలవారీగా ఏందిరమ్మ ఇళ్లకు బిల్లులను చెల్లిస్తామని, పూర్తిగా స్థలం లేని వారికి ఏం చేయాలనని ప్రభుత్వం త్వరలో నిర్ణయం తీసుకుంటుంది అన్నారు. ప్రజలందరూ ఎవరు ఆందోళన చెందకుండా ఓపికతో ప్రభుత్వ సంక్షేమ పథకాలను దరఖాస్తు చేసుకొని సంక్షేమ ఫలాలను పొందాలని పిలుపునిచ్చారు. గత బి ఆర్ ఎస్ పాలన అవినీతిమయంగా మారిందని, టిఆర్ఎస్ దొంగల ముఠా లక్షల కోట్లు దోచుకుని రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చిందని ఆరోపించారు. అందుకే ప్రజల్లో బిఆర్ఎస్ పార్టీ విశ్వసనీయత కోల్పోయిందని, రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని అత్యధికంగా మెజార్టీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అధికారులు ఎంపీవో జగన్మోహన్ రెడ్డి, ఏఈఓ సూచ్చారిత, పంచాయతీ సెక్రటరీ మహేందర్, గ్రామశాఖ అధ్యక్షుడు దీకొండ శంకరయ్య, మాజీ ఎంపీటీసీ దోమటి అశోక్, యూత్ అధ్యక్షుడు గంగయ్యా, టెంపుల్ చైర్మన్ రాజయ్యా, తదితరులు పాల్గొన్నారు.

# ప్రపంచ ఆర్థిక వేదికలో పాల్గొన్న మంత్రి శ్రీధర్ బాబు

**మంథని, (జనంసాక్షి) :**




దావోస్‌లో ప్రపంచ ఆర్థిక వేదిక సదస్సు సందర్భంగా ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి, పరిశ్రమలు–ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ఉన్నతాధికారులు ప్రఖ్యాత విప్రో (విప్రో లిమిటెడ్ ) సంస్థ ఎగ్జిక్యూటివ్ చైర్మన్ రిషద్ ప్రేమ్‌జీ తో సమావేశమయ్యారు. రాష్ట్రంలో పెట్టుబడుల విస్తరణకు విప్రో సంస్థ అంగీకారం తెలిపింది. విప్రో కంపెనీ హైదరాబాద్ లో తమ క్యాంపస్ విస్తరించనున్నట్లు ప్రకటించింది. ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌లోని గోపనపల్లి లో కొత్తగా మరో ఐటీ సెంటర్ నెలకొల్పనుంది. దీంతో అదనంగా 5000 మందికి ప్రత్యక్షంగా పరోక్షంగా ఉద్యోగాలు లభిస్తాయి.


హైదరాబాద్‌లో ఐటీ రంగం వృద్ధిలో విప్రో కీలక భాగస్వామి. విప్రో క్యాంపస్ విస్తరణతో రాష్ట్రంలో సాంకేతిక రంగం మరింత వృద్ధి చెందనుంది. ఐటీ రంగంలో ఉపాధి అవకాశాలు పెరుగనున్నాయి.

కొత్త ఐటీ సెంటర్ రాబోయే రెండు మూడేండ్లలో పూర్తవుతుంది. ప్రభుత్వంతో విప్రో చేసుకున్న ఒప్పందంతో ప్రపంచ ఐటీ పెట్టుబడుల గమ్యస్థానంగా తెలంగాణ ఖ్యాతి మరింత బలోపేతమవుతుంది.

విప్రో విస్తరణ ప్రణాళికను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వాగతించారు. విప్రో లాంటి పేరొందిన సంస్థలకు తగిన మద్దతు ఇచ్చేందుకు, వ్యాపారాలకు అనువైన వాతావరణం కల్పించేందుకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉంటుందన్నారు.

కొత్త ఆవిష్కరణలను ప్రోత్సహించేందుకు, అవకాశాలు సృష్టించడానికి తెలంగాణ ప్రభుత్వంతో కలిసి పనిచేయడం తమకు ఉత్సాహంగా ఉందని ఈ సందర్భంగా విప్రో ఎగ్జిక్యూటివ్ చైర్మన్ రిషద్ ప్రేమ్‌జీ అన్నారు. యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీతో పాటు ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలలో భాగస్వామ్యం పంచుకోవాలని మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు విప్రో కంపెనీని ఆహ్వానించారు.

# ప్రజాపాలన గ్రామ సభలో జిల్లా కలెక్టర్



**ప్రభుత్వ పథకాలు అమలు నిరుపేదల కుటుంబాలకు ప్రాధాన్యత**

**జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్**

**గాంధారి జనవరి 23 (జనం సాక్షి)**

అర్హులైన నిరు పేదలకు ప్రభుత్వ పథకాలు అమలులో ప్రాధాన్యత కల్పించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ అన్నారు. గురువారం గాంధారి మండలం మాధవపల్లి గ్రామంలో ప్రజాపాలన గ్రామ సభలో కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రభుత్వ పథకాల అమలు నిరుపేద కుటుంబాలకు ప్రాధాన్యత కల్పించడం జరుగుతుందని తెలిపారు. రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ రైతు భరోసా, రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్ల పథకాలకు సంబంధించిన లబ్ధిదారులకు ఈ నెల 26 నుండి అమలు పరచడం జరుగుతుందని తెలిపారు. వ్యవసాయ యోగ్యమైన భూములకు రైతు భరోసా అందించడం జరుగుతుందని తెలిపారు. భూములు లేని నిరుపేదలకు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా అందించడం జరుగుతుందని, ఉపాధి జాబ్ కార్డు కలిగి ఉండి, 2023-24 సంవత్సరంలో కనీసం 20 రోజులపాటు పనులు చేసి ఉండాలని తెలిపారు. కొత్త రేషన్ కార్డుల కొరకు గత ప్రజాపాలన దరఖాస్తు చేసుకున్న వారికి, కొత్తగా కుటుంబ సభ్యుల పేర్లు నమోదు చేసుకోవడం కోసం, గతంలో దరఖాస్తు చేసుకోని వారు ప్రస్తుత గ్రామ సభల్లో ఏర్పాటు చేసిన కౌంటర్ లలో దరఖాస్తులు సమర్పించవచ్చనీ తెలిపారు. ఇందిరమ్మ ఇండ్లు కొరకు ఇండ్ల స్థలాలు ఉండి పక్క ఇళ్లు లేని నిరుపేదలు, ఇళ్ల స్థలాలు ఉండి పక్క ఇళ్లు లేని వారికి గ్రామ సభ ఆమోదం మేరకు మంజూరు చేయడం జరుగుతుందని తెలిపారు. ఇట్టి నాలుగు పథకాలలో అర్హులైన ముసాయిదా జాబితాలను గ్రామసభలో చదివి వినిపించడం జరుగుతుందని, వాటిపై ఏమైనా అభ్యంతరాలు, ఆక్షేపణలు ఉన్నట్లయితే తెలియజేయాలని అన్నారు. పథకాలలో అర్హులైన వారికి అమలు పరచడం నిరంతర ప్రక్రియ అని తెలిపారు.

# గ్రామసభలు ఉత్తముచ్చటేనా ?...

## రానున్న ఎన్నికల స్టంట్ కోసమే గ్రామ సభలు

**తూ తూ మంత్రంగా రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించడం సిగ్గుచేటు.**

**మాజీ మేయర్, పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి సర్దార్ రవీందర్.**

**కరీంనగర్ బ్యూరో, జనవరి 23 (జనంసాక్షి) :**



బూటకపు హామీలిచ్చి అధికారంలోకి వచ్చాక మొండిచెయ్యి చూపిన కాంగ్రెస్ పై ప్రజల్లో ఆగ్రహం వెల్లువెత్తుతూనే ఉన్నదని మాజీ మేయర్, మాజీ రాష్ట్ర సివిల్ సప్లయ్ కార్పొరేషన్ చైర్మన్, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల అభ్యర్థి సర్దార్ రవీందర్ సింగ్ మండిపడ్డారు. అన్ని అర్హతలు ఉన్నా గతంలోనూ దరఖాస్తు చేసుకున్నా జాబితాలో పేర్లు రాలేదని, లబ్ధిదారులుగా ఎంపిక చేసిన వారికి రశీదు ఇవ్వలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. రేషన్ కార్డులు, రైతుభరోసా, ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల ఎంపిక కోసం ప్రభుత్వం నిర్వహిస్తున్న గ్రామసభలు కేవలం ఎన్నికల స్టంట్ కోసమే అని సర్దార్ రవీందర్ సింగ్ అన్నారు. ఇందిరమ్మ ఇండ్లకు అనర్హులను ఎంపిక చేశారని, రుణమాఫీ, పింఛన్లు అందడం లేదని, మహాలక్ష్మి డబ్బులను ఎప్పుడు పంపిణీ చేస్తారని అధికారులు, ప్రజాప్రతినిధుల పై ఆయా గ్రామస్తులు ప్రశ్నల వర్షం కురిపించడమే కనిపించిందని ఆయా గ్రామాల్లో ఎదురైన ప్రశ్నలకు సమాధానాలు చెప్పలేక అధికారులు, పజాప్రతినిధులు తలలు పట్టుకున్నారని , పలుచోట్ల సర్వే సరిగ్గా లేదని, అవకతవకలు జరిగాయని అధికారులకు చెప్పిన పట్టించుకోవడం లేదని సర్దార్ రవీందర్ సింగ్ అన్నారు. ఇందిరమ్మ ఇండ్ల పై కాంగ్రెస్ ప్రభుత్వం కర్కశంగా వ్యవరిస్తుం దని ఉన్నవారికే ఇండ్లిస్తరా? గరీబోళ్లను పట్టిం చుకోరా?' అంటూ సర్దార్ రవీందర్ సింగ్ ధ్వజమె త్తారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం మేల్కొని ప్రజా సమస్యలను పరిగణనలోకి తీసుకుని గ్రామ సభల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై పారదర్శకంగా దృష్టిసారించి అర్హులకే పథకాలను అమలు చేయాలని సర్దార్ రవీందర్ సింగ్ డిమాండ్ చేశారు. ఈ విలేకరుల సమావేశంలో గుంజపడుగు హరిప్రసాద్, ఎడ్ల అశోక్, పొన్నం అనీల్ గౌడ్, కెమసారం తిరుపతి, పెండ్యాల మహేష్ , మేకల చంద్రశేఖర్ యాదవ్, తూల భాస్కర్ రావు పాల్గొన్నారు.

# ఆరెకటికలకు వ్యాపార సముదాయాల కేటాయింపు

**కామారెడ్డి జిల్లా ప్రతినిధి జనవరి 23 (జనం సాక్షి)**



కామారెడ్డి పట్టణంలోని డైలీ మార్కెట్లో సూర్యవంశ ఆరెకటికలకు వ్యాపార సముదాయాలను కేటాయించి వారికి 32 మంది అర్హులకు ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ షబ్బీర్ అలీ గురువారం సంబంధిత పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా షబ్బీర్ అలీ మాట్లాడుతూకామారెడ్డి పట్టణంలో గత 23 సంవత్సరాల క్రితం మంత్రిగా ఉన్నప్పుడు నిర్మించిన మటన్ షాపులు నేటి వరకు వారికి కేటాయించలేదన్నారు. 23 సంవత్సరాల తర్వాత మళ్లీ నా దృష్టికి ఈ సమస్య వచ్చినప్పుడు వెంటనే సంబంధిత అధికారులతో మాట్లాడి 32 మందికి దుకాణాల కేటాయింపు పత్రాలు నా చేతులమీదుగానే అందీయడం చాలా ఆనందంగా ఉందన్నారు. అలాగే వారి ఆమోద యోగ్యమైన సమస్యలన్నీ పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. జనవరి 26న రైతు భరోసా తో పాటు కొత్త రేషన్ కార్డులను పేదలకు అందిస్తున్నామన్నారు. వ్యవసాయ యోగ్యమైన భూములకే రైతు భరోసా అందేలా చూడాలని అధికారుల ఆదేశించాం అన్నారు. రైతు భరోసా, ఇందిరమ్మ ఇళ్ల పథకాల అమల్లో గ్రామ సభ నిర్ణయాలే కీలకమని చెప్పారు. గ్రామసభలో వచ్చిన అభ్యంతరాలను 10 రోజుల్లో అధికారులు నివృత్తి చేస్తానన్నారు. కొత్త రేషన్ కార్డులు ఇస్తున్న వేళ పాత రేషన్ కార్డులు తొలగిస్తారని వస్తున్న వార్తల్లో నిజం లేదన్నారు. రేషన్ కార్డుల జారీ, ఇందిరమ్మ ఇళ్ల పంపిణీ అనేవి నిరంతర ప్రక్రియ అని స్పష్టం చేశారు. తెలంగాణ రైతులకు రైతుభరోసా నిధుల విడుదల చేస్తామన్నారు, అదే రోజున రైతు కూలీలకు అకౌంట్‌లోకి ఎకరాకు రూ. 12 వేల చొప్పున పెట్టుబడి సాయాన్ని ప్రభుత్వం అందిస్తుందన్నారు. వ్యవసాయానికి యోగ్యమైన భూములకే, అది కూడా భూభారతిలో నమోదైన భూమికే రైతు భరోసా ఇస్తామని మార్గదర్శకాల్లో స్పష్టం చేశామన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీల కంటే ఎక్కువగానే అమలు చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ గడ్డం ఇందుప్రియ చంద్రశేఖర్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు లబ్ధిదారులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి పనులు

**మల్కాజిగిరి,జనవరి23(జనంసాక్షి)**



మల్కాజిగిరి నియోజకవర్గాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి చేయడానికి ప్రణాళికాబద్ధంగా ముందుకు వెళ్తున్నామని ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి పేర్కొన్నారు. మల్కాజిగిరి డివిజన్ పరిధిలోని విష్ణుపురి ఎక్స్ టెన్షన్ లో కోటి అయిదు లక్షల వ్యయంతో బాక్స్ డ్రైన్ త్వరలోనే ఏర్పాటు కానున్న సందర్భంగా అధికారులతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గత సంవత్సర కాలంగా నియోజకవర్గ పరిధిలోని జరగవలసిన అభివృద్ధి పనులను మంజూరు చేయించాలని ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపించామని, దాని ఫలితంగానే ఇప్పుడు కోటి అయిదు లక్షల బాక్స్ డ్రైన్ పనులు జరుతున్నాయని, ఇక పై అన్ని పనులను ప్రారంభించుకునే విధంగా ప్రణాళికతో ముందుకు సాగుతామని, ప్రభుత్వంలో నిధుల కొరతతో పనుల్లో జాప్యం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇంజనీ రింగ్ అధికా రులు ఈఈ లక్ష్మణ్, డిఈ మహేష్ ,మాజీ కార్పొరేటర్ నిరుగొండ జగదీష్ గౌడ్, వాసగోని శ్రీనివాస్ గౌడ్, మురుగేశ్ , సతీష్,రాములు, రవీందర్, వేణు యాదవ్, శ్రీకాంత్, సురేష్ యాదవ్ శ్రీనివాస్ యాదవ్,నాగరాజు, వివిఎస్ఎన్ శర్మ తదితరులు పాల్గొన్నారు.

# మంజూరు అయిన నిర్మాణ పనులను వెంటనే గ్రౌండింగ్ చేయాలి



**కొడంగల్ ,జనవరి 23 (జనం సాక్షి)**

మంజూరు అయిన నిర్మాణ పనులను వెంటనే గ్రౌండింగ్ చేయాలని సంబంధిత అధికారులను జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ ఆదేశించారు. గురువారం కడా కార్యాలయంలో కొడంగల్ అభివృద్ధి నియోజకవర్గలో జరుగుతున్న వివిధ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై వికారాబాద్, నారాయణపేట జిల్లా కలెక్టర్ లు ప్రతీక్ జైన్, శిక్తా పట్నాయక్ లు సంబంధిత శాఖల అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్లు అధికారులను ఉద్దేశించి మాట్లాడుతూ జిల్లాలో ఇప్పటికే మంజూరైన వివిధ నిర్మాణ పనులను వెంటనే మొదలు పెట్టాలన్నారు. మంజూరు అయిన బీసీ గురుకుల పాఠశాలలు, జూనియర్ కళాశాల నిర్మాణ పనులను వెంటనే మొదలుపెట్టాలని తెలిపారు. బొమ్మరాస్ పేట, గుండు మాల్ మండలాల్లో చేపట్టే సమీకృత పాఠశాల భవనాలను వారంలోపు చేపట్టాలని అధికారులకు సూచించారు. ఆర్ అండ్ బి ద్వారా చేపట్టే పనులను వెటర్నరీ, వైద్య కళాశాలలకు సంబంధించిన పనులను కూడా త్వరలో మొదలు పెట్టాలని అధికారుల సూచించారు సంబంధిత అధికారులకు సూచించారు.

ఈ సందర్భంగా వెటర్నరీ, వైద్య కళాశాల పవనాల మ్యాప్ లను పరిశీలించారు. ఈ సమావేశంలో తాండూర్ సబ్ కలెక్టర్ ఉమా శంకర్ ప్రసాద్, అసిస్టెంట్ కలెక్టర్ లు ఉమా హారతి, గరిమ నరుల, కడ ప్రత్యేక అధికారి వెంకట్ రెడ్డి, నారాయణ పేట ఆర్డీఓ రామచందర్, పంచాయతి రాజ్ ఎస్ఈ శ్రీనివాస్ రెడ్డి, ఆర్ అండ్ బి ఎస్ఇ వసంత్ నాయక్, ఈడబ్ల్యూఐడిసి ఇఇ వై.వి రాంకుమార్, డిఇ రాజు, ఇంజినీరింగ్ విభాగం ఇఇ, డిఇ తదితరలు పాల్గొన్నారు.

# పేదల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ

**బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్**

**బెల్లంపల్లి, జనవరి 23, (జనంసాక్షి)**



: పేదల ఆరోగ్యంపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తుందని బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ అన్నారు. బెల్లంపల్లి పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో గురువారం ఆయన బెల్లంపల్లి నియోజకవర్గం నెన్నెల మండలం గొల్లపల్లి గ్రామానికి చెందిన పొలం శంకర్ అనే లబ్ధిదారునికి సీఎంఆర్ఎఫ్ చెక్కును అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేదల కష్టాలు తెలిసిన వ్యక్తి కావడంతో రాజకీయాలకు అతీతంగా అర్హులైన అందరికి ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి ఆదుకోవాలని నిశ్చయించుకున్నారని అన్నారు. పేదల ఆరోగ్యంపై కాంగ్రెస్ ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ వహిస్తుందని, ఆరోగ్యశ్రీ పరిమితి పది లక్షలకు పెంపు దీనికి నిదర్శనం అన్నారు. ఈకార్యక్రమంలో నెన్నెల మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గట్టు మల్లేష్, గొల్లపల్లి కాంగ్రెస్ పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు తమ్మినవేణి రాజేష్, నాయకులు మహ్మద్ జలీల్, ఉయ్యాల లింగయ్య, జాడి రాజ్ కుమార్ పాల్గొన్నారు.

# బ్యాంకుల భద్రతపై అధికారులు దృష్టి పెట్టాలి

**వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా**

**వరంగల్ బ్యూరో, జనవరి 23 (జనం సాక్షి)**



వినియోగదారుల సొమ్ము కాపాడేందుకు బ్యాంక్ అధికారులు బ్యాంకు భద్రత పై ప్రత్యేక దృష్టి పెట్టాలని వరంగల్ పోలీస్ కమిషనర్ తెలిపారు. వినియోగదారుల సొమ్మును భద్రపరుస్తున్న సంబంధిత బ్యాంక్ అధికారులు తీసుకోవాల్సిన భద్రత చర్యలపై వరంగల్ పోలీస్ కమిషనర్ ట్రై సిటి పరిధిలో ప్రభుత్వ రంగ సంస్థ బ్యాంకులు, ప్రవైయిట్ బ్యాంకుల చెందిన బ్యాంకర్ల గురువారం పోలీస్ కమషనరేట్ కార్యాలయములో ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేసారు. ఈ సమావేశంలో ముందుగా వినియోగదారుల సోమ్ము భద్రత కోసం తీసుకుంటున్న చర్యలను బ్యాంకర్లు వివరించారు. అనంతరం ఇటీవల జరిగిన కొన్ని సంఘటనను ఉదారణగా ప్రస్తావిస్తూ బ్యాంకర్ల తప్పిదాలపై పోలీస్ కమిషనర్ వివరించారు. అనంతరం పోలీస్ కమిషనర్ బ్యాంకర్లకు పలుసూచనలు చేస్తూ బ్యాంకర్లు తప్పనిసరిగా బ్యాంకులతో పాటు ఏటియంల భద్రత కోసం సెక్యూరిటీ గార్డులను ఏర్పాటు చేయడంతో పాటు వారు ఏవిధంగా విధులు నిర్వహిస్తున్నారని సంబంధిత బ్యాంక్ అధికారులు క్షేత్ర స్థాయిలో తనిఖీ చేయాల్సి వుంటుందని. ముఖ్యంగా సిసి కెమెరాల పనీతీరుకు ఎప్పటికప్పుడు పరిశీలించడంతో పాటు, వీల్కెనంత వరకు బ్యాంక్ లోపల, బయట వైపు సిసి కెమెరాల ఏర్పాటు చేయాలని. ముఖ్యంగా చోరీ యత్నించే అవకశాలు వున్న ప్రదేశాల్లో సిసి కెమెరాలు ఏర్పాటు చేయాలని. అలాగే సిసి కెమెరాల దృష్యాలను క్లౌడ్ స్టోరేజీ లేదా ప్రత్యామ్నయ స్టోరేజ్ సిస్టంలో భద్రపర్చాలని. బ్యాంక్ పరిసరాల్లో ఎప్పటికప్పుడు పిచ్చి మొక్కలను తొలగించడంతో పాటు వెలుగు కోసం లైట్లను ఏర్పాటు చేయాలని. ప్రస్తుతం నూతన టెక్నాలజీ సంబంధించి అలారములను ఏర్పాటు చేసుకోవడం పాటు, అధిక భద్రత వున్న అల్మారాలను ఏర్పాటు చేసుకోవాల్సి వుంటుందని. బ్యాంక్ ప్రధాన కార్యాలయము నిబంధనలను అనుసరించి సాయుధ సిబ్బందితో తగిన భద్రతతో ఏటియంల్లో డబ్బును లోడ్ చేసేందుకు డబ్బును తరలించే సమయంలో బ్యాంకర్ల నిబంధనలను తప్పక పాటించాల్సి వుంటుందని. బ్యాంక్‌లో అనుమానస్పదంగా సంచరించే వ్యక్తుల పట్ల అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా వ్యవహరించాలని పోలీస్ కమిషనర్ బ్యాంకర్లకు సూచించారు.
ఈ సమావేశంలో సెంట్రల్ జోన్ డిసిపి షేక్ సలీమా, ఏసిపిలు జితేందర్, తిరుమల్, దేవేందర్ రెడ్డి,విజయ్‌కుమార్ పాల్గోన్నారు.

# మురుగునీటి మధ్య తెలంగాణ కాలనీ..

**దోమలు దుర్వాసనతో**
**గృహవాసులు రోగాల పాలు**
**డ్రైనేజీ వ్యవస్థ**
**నిర్మించాలంటూ**
**కాలనీవాసుల డిమాండ్**



**వరంగల్ ఈస్ట్, జనవరి 23 (జనం సాక్షి)**

వరంగల్ తూర్పు నియోజకవర్గం లోని 42వ డివిజన్ రంగసాయిపేట తెలంగాణ కాలనీవాసులు మురుగు నీటి మధ్య అష్ట కష్టాలు పడుతున్నారు.కాలనీ ఏర్పడి ఏళ్ల తరబడి జరిగిన ఇక్కడ సరైన డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడంతో ఇండ్ల మధ్యనే నీరు చేరి దుర్వాసన దోమలతో గృహవాసులు రోగాల పాలవుతున్నారు .తమ సమస్య పరిష్కరించాలని నగర మేయర్ కమిషనర్ కలెక్టర్ తో పాటు సంబంధిత అధికారులు అందరికీ వందలసార్లు మొరపెట్టుకున్న ఫలితం శూన్యం.అంతేకాకుండా రాష్ట్ర అటవీ పర్యావరణ దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ ప్రమాణ స్వీకారం చేసి వరంగల్ కు వచ్చిన మొదటిసారి తెలంగాణ కాలనీ సందర్శించారు.అక్కడ ఉన్న పరిస్థితిని క్షుణ్ణంగా గమనించి కాలనీలో మురుగునీరు నిల్వకుండా ఏర్పాట్లు చేయాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు ఇచ్చారు.అయినా కూడా నేటి వరకు పరిస్థితి అదే పద్ధతిలో ఉంది.అసలు కాలనీలో వాడే నీరు బయటికి వెళ్లలేని పరిస్థితి ఉండడంతో వర్షాకాలమే కాదు ఎండాకాలం చలికాలం కూడా ఇండ్ల మధ్య నీరు ఉండడం తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తుంది.కొందరి ఇండ్లు అమ్మకానికి పెట్టి ఆ ఇండ్లు ఖాళీ చేసి వెళ్లిన దుస్థితి ఏర్పడింది.ఇప్పటికైనా సంబంధిత అధికారులు ప్రజాప్రతినిధులు తమ సమస్యను పరిష్కరించి తాము
కాలనీలో సుఖంగా సంతోషంగా ఉండేలా చూడాలని కాలనీవాసులు వేడుకుంటున్నారు.

# రసభాసాగా గ్రామసభ

**ఏటూరునాగారం, జనవరి 23 (జనంసాక్షి)**



: మండలంలోని రామన్నగూడెం గ్రామంలో గ్రామ సభ సజావుగా మొదలైనప్పటికి రైతు భరోసా, రైతు ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డ్ లు, సంక్షేమ ఫలాలు అర్హులందరికీ అందిస్తామని ప్రభుత్వం చెప్పినప్పటికీ అధికారులు మాత్రం రైతు ఆత్మీయ భరోసా ఇందిరమ్మ ఇండ్ల పేర్లలో అధికారులు అర్హులైన వారికి కాకుండా అనర్హుల పేర్లను ఎంపిక చేయడం పట్ల ప్రజలు నిరసన వ్యక్తం చేసి అధికారులను నిలదీశారు. ఎపిడిఓ రాజ్యలక్ష్మి, గ్రామ కార్యదర్శి మారేపల్లి జ్యోతి, సభలో ప్రజలందరికీ నచ్చ చెప్పి అర్హులైన వారందరికీ సంక్షేమ ఫలాలు అందిస్తామని గ్రామ సభను సజావుగా నడిపించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడివో రాజ్యలక్ష్మి, గ్రామ కార్యదర్శి మరేపల్లి జ్యోతి, గ్రామ ప్రజలు పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

# గ్రామసభల్లో రచ్చ రచ్చ

**లబ్ధిదారుల ఎంపిక**
**పారదర్శకంగా లేదని లొల్లి**
**ఇల్లు ఉన్నోడికి మళ్లీ ఇల్లు.. లేనోడికి**
**అందని సంక్షేమ పథకాలు**
**కొన్నిచోట్ల తమకు అనుకూలమైన**
**వారి పేర్లు లేవని కాంగ్రెస్**
**నాయకుల మధ్య లొల్లి**
**గ్రామ సభల్లో పాల్గొన్న పోలీస్**
**ఉన్నత స్థాయి అధికారులు**

**వికారాబాద్ జిల్లా బ్యూరో జనవరి 23 (జనం సాక్షి)**



: అందరూ ఊహించినట్లుగానే గ్రామ సభల్లో లబ్ధిదారుల ఎంపికపై లొల్లి సాగుతుంది. గ్రామ సభల్లో లొల్లి జరగకుండా పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేసిన ప్రజలు అధికారులను ప్రశ్నిస్తున్నారు. అయినోళ్లకే అన్ని ఇస్తే ఇంకెందుకు గ్రామ సభలంటూ అధికారులను నిలదీస్తున్నారు. కొన్నిచోట్ల తమకు అనుకూలమైన వారి పేర్లు జాబితాలో లేవని కాంగ్రెస్ నాయకుల మధ్య గ్రామసభల్లో లొల్లి జరుగుతుంది. అటు చూసినా ఎటు చూసినా అంతా లొల్లి. ప్రభుత్వం ఆశించిన పారదర్శకంగా లబ్ధిదారుల ఎంపిక జరుగుతుందో లేదో చూడాల్సిందే... వివరాల్లోకి వెళితే వికారాబాద్ జిల్లా కొడంగల్ నియోజకవర్గం దౌల్తాబాద్ వికారాబాద్ నియోజకవర్గం బంటారం కో ట్ పల్లి మండలాల్లోని కొన్ని గ్రామా సభల్లో ఆరు గ్యారంటీ పథకాల అమలు లబ్ధిదారుల ఎంపికపై గ్రామ సభలో లొల్లి జరిగింది. రెండో రోజున గ్రామసభల సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న కొడంగల్ నియోజకవర్గం లోని దౌల్తాబాద్ మండలంలోని సుల్తాన్ పూర్ సురాయిపల్లి కుప్పం గిరి గ్రామాల గ్రామసభల్లో గురువారం లొల్లి జరిగింది. ఇందిరమ్మ ఇండ్లు. రేషన్ కార్డుల మంజూరి లో అయినోళ్లకే మంజూరయ్యాయని ప్రజలు గ్రామ సభకు వచ్చిన అధికారులను నిలదీశారు. సభలు సవ్యంగా జరగకుండా అడ్డుకున్నారు. నచ్చినల్లకే అన్ని మంజూరు చేస్తే ఇంకా గ్రామసభలు ఎందుకని ప్రశ్నించారు. గ్రామ సభల కంటే ముందు సంక్షేమ పథకాల కోసం అర్హులైన వారిని ఇంటింటికి వెళ్లి అధికారులు సర్వే చేశారని అర్హులను గుర్తించాలని వారి జాబితాలో ఉన్న వారికి సంక్షేమ పథకాలు ఇవ్వకుండా అడ్డగోలుగా మంజూరు చేశారని ఆరోపించారు. ఈ విషయమై అధికారులతో వాగ్వివాదానికి దిగారు. అలాగే వికారాబాద్ నియోజకవర్గంలోని కోటపల్లి మండలం కరీంపూర్ గ్రామంలో గ్రామ సభ రచ్చ రచ్చ అయింది. ఇందిరమ్మ ఇండ్లు తమకు అనుకూలమైన వారికి ఇల్లు ఉన్నవారికి కేటాయించారని ప్రజలు అధికారులు నిలదీశారు. గ్రామసభను జరగనివ్వకుండా అడ్డుకున్నారు. అధికారులు ప్రజలకు సర్ది చెప్పడానికి చేసిన ప్రయత్నం బెడిసి కొట్టింది. దీంతో గ్రామసభను పూర్తిగా నిర్వహించకుండా అసంపూర్తిగా పూర్తిచేసి అధికారులు మధ్యలో నుంచి వెళ్లి పోవలసిన పరిస్థితి నెలకొంది. సంక్షేమ పథకాల అర్హులైన లబ్ధిదారుల ఎంపికపై గ్రామసభల్లో లొల్లి జరుగుతుండగా మరోవైపు రాష్ట్ర జిల్లా స్థాయి ఉన్నత అధికారులు గ్రామ సభల్లో పాల్గొంటున్నారు . వికారాబాద్ జిల్లా కలెక్టర్ ప్రతీక్ జెన్ వికారాబాద్ ఎస్పీ నారాయణరెడ్డి రోజు ఏదో ఒక ప్రాంతాన్ని ఆకస్మికంగా గ్రామసభల్లో పాల్గొంటున్నారు. గ్రామసభల పనితీరును పర్యవేక్షిస్తున్నారు. అంతేకాకుండా గ్రామ సభలు రెండవ రోజు తెలంగాణ రాష్ట్ర డిజిపి జితేందర్ ఆదేశాల మేరకు మల్టీ జోన్-2 ఐ జి పి నారాయణ రెడ్డి దుద్యాల మండలం హకీంపేట బొమ్ రాస్ పెట్ మండలం తుంకిమెట్ల గ్రామసభల్లో పాల్గొన్నారు. ప్రజా సంక్షేమ పథకాలపై ప్రజలకు వివరించారు. ఇంకా రెండు రోజుల పాటు గ్రామ సభలు జరగనున్నాయి. గ్రామసభల అనంతరం లబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగా ఉంటుందో లేదో. ప్రభుత్వ లక్ష్యం నెరవేరుతుందో లేదో వేచి చూడాల్సిందే....

# అర్హులకు సంక్షేమ పథకాలను అందించడమే లక్ష్యం

**ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు**

**చిట్యాల/మొగుళ్లపల్లి/టేకుమట్ల, జనవరి 23 (జనంసాక్షి) :**



అర్హులైన లబ్ధిదారులకు సంక్షేమ పథకాలను అందించడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ అన్నారు. ఈ మేరకు గురువారం జయశంకర్ భూపాలపల్లి జిల్లాలలోని చిట్యాల, మొగుళ్లపల్లి ,టేకుమట్ల మండలాల్లోని గ్రామాల్లో జరిగిన ప్రజా పాలన గ్రామసభల్లో ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు పాల్గొన్నారు.అర్హులైన చిట్ట చివరి లబ్ధిదారులకు అభివృద్ధి, సంక్షేమ పథకాలను అందించడమే లక్ష్యంగా ప్రజా ప్రభుత్వం రోజుకు పద్దెనిమిది గంటల పాటు శ్రమిస్తున్నట్లు ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు, అడిషనల్ కలెక్టర్ విజయలక్ష్మి తెలిపారు. జనవరి 26వ తేదీ నుండి ప్రజా ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా అమలు చేయనున్న ఇందిరమ్మ ఇండ్లు, రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ పథకం, రేషన్ కార్డుల పంపిణీకి సంబంధించి గత మూడు రోజులుగా గ్రామ సభలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. లిస్టు లో పేర్లు లేనివారు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని అన్నారు. ప్రజా పాలన, కులగణన సర్వేలో భాగంగా సేకరించిన ఫిర్యాదులతో పాటు ఆన్లైన్ లో దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారుల వివరాలను సిబ్బంది ఇంటింటికి వెళ్లి అర్హులైన వారి వివరాలను సేకరించి ఎంపిక చేయడం జరిగిందని తెలిపారు. ఎంపిక చేయబడిన లబ్ధిదారుల వివరాలను గ్రామసభలలో ప్రజల సమక్షంలో చదివి ఎంపిక చేయడం జరుగుతుందని ,గ్రామ పంచాయతీ కార్యాలయాల వద్ద కూడా అతికించడం జరుగుతుంది . అర్హులైన వారు ఉండి జాబితాలో పేరు లేనివారు తిరిగి దరఖాస్తు చేసుకుంటే వారి దరఖాస్తులను కూడా పరిశీలించి ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్ల పథకం నిరంతర ప్రక్రియ అని అర్హత ఉన్నప్పటికీ పథకంలో పేరు లేని వారు నిరాశ నిస్పృహలకు లోను కావద్దని ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ అమలులో భాగంగా అర్హులైన వారందరికీ పంపిణీ చేయడం జరుగుతుందని తెలిపారు. రేషన్ కార్డుల జారీ నిరంతర ప్రక్రియ అని, ఇందిరమ్మ ఇళ్లు మొదటి దశలో సొంత స్థలం ఉన్న వారికి ఇస్తున్నట్లు తెలిపారు. తరువాతి దశలో భూమి లేని వారికి ఇస్తామని తెలిపారు.

# ఉద్యోగులు ట్రాఫిక్ రూల్స్ పాటించాలి

**హెల్మెట్ తప్పనిసరి ధరించాలి**

**మంచిర్యాల ట్రాఫిక్ సిఐ బి.సత్యనారాయణ**

**నస్పూర్, జనవరి 23 (జనంసాక్షి):**



సింగరేణి ఉద్యోగులు ట్రాఫిక్ రూల్స్ పాటిస్తూ,ప్రమాదాలకు తావీయకుండా వాహనాలను నడపాలని మంచిర్యాల ట్రాఫిక్ సిఐ బి.సత్యనారాయణ అన్నారు.బుధవారం శ్రీరాంపూర్ ఏరియాలోని ఆర్కే 6 గనిలో రోడ్డు భద్రత,ట్రాఫిక్ రూల్స్ పై ఏర్పాటుచేసిన అవగాహన సదస్సు లో ఆయన పాల్గొని మాట్లాడారు.ద్విచక్ర వాహనాలపై ప్రయాణిస్తూ విధులకు హాజరయ్యే ఉద్యోగులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించి విధులకు హాజరవ్వాలని తెలిపారు.ట్రాఫిక్ నిబంధనలు పాటించడం ద్వారా ప్రమాదాలను నివారించవచ్చని తెలిపారు.మద్యం సేవించి వాహనాలు నడపరాదని,డ్రంక్ అండ్ డ్రైవ్ లో పట్టుబడితే జరిమానా తో పాటు జైలు శిక్ష కూడా తప్పదని హెచ్చరించారు.అనంతరం గని మేనేజర్ ఇ.తిరుపతి మాట్లాడుతూ ట్రాఫిక్ రూల్స్ ప్రతి ఒక్క ఉద్యోగి పాటించాలన్నారు.రక్షణతో కూడా ఉత్పత్తి సాధించాలన్నారు.ఈ కార్యక్రమంలో సేఫ్టీ ఆఫీసర్ కాదాసి శ్రీనివాస్, అడిషనల్ మేనేజర్ మర్రి కొమురయ్య,సర్వే ఆఫీసర్ ఎస్ పి వర్మ,సీనియర్ పర్సనల్ ఆఫీసర్ సురేందర్,గుర్తింపు సంఘం ఫిట్ సెక్రటరీ సంఘం సదానందం,డిప్యూటీ జనరల్ సెక్రటరీ ముష్కే సమ్మయ్య,ఆఫీస్ సిబ్బంది,ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

# విజ్ఞప్తులు స్వీకరించిన మంత్రి కొండా సురేఖ



**వరంగల్ ఈస్ట్, జనవరి 23 (జనం సాక్షి)**

: హన్మకొండ రాంనగర్ లోని తన నివాసంలో అటవీ, పర్యావరణ, దేవాదాయ ధర్మాదాయ శాఖామాత్యులు శ్రీమతి కొండా సురేఖ గారు ప్రజల నుంచి విజ్ఞప్తులు స్వీకరించారు. ఒక్కొక్కరిగా ప్రజల నుంచి వినతులు స్వీకరించిన మంత్రి గారు ఆయా శాఖలు అధికారులను ఫోన్లలో సంప్రదించి, సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాల్సిందిగా ఆదేశించారు. సులువుగా పరిష్కరించాల్సిన సమస్యల విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన అధికారులను మంత్రి సురేఖ మందలించారు. మరోసారి బాధ్యతారాహిత్యంగా ప్రవర్తించినట్లు తన దృష్టికి వస్తే కఠిన చర్యలకు వెనుకాడనని మంత్రి సురేఖ వారికి స్పష్టం చేశారు. కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం జనవరి 26 నుంచి అమలు చేస్తున్న నూతన పథకాలు అర్హులకు అందేలా ప్రభుత్వం పక్కా ప్రణాళికతో ముందుకు సాగుతున్నందున ఈ విషయంలో ఆందోళన చెందవద్దని మంత్రి సురేఖ ప్రజలకు పిలుపునిచ్చారు. ప్రభుత్వం అమలుచేస్తున్న పథకాల విషయంలో లబ్దిదారుల ఎంపిక అనేది నిరంతర ప్రక్రియ అని మంత్రి తేల్చి చెప్పారు. అర్హులైన ప్రతి ఒక్కరికి న్యాయం జరిగేలా కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం కార్యాచరణ ప్రణాళికను అమలు చేస్తున్నదని మంత్రి సురేఖ స్పష్టం చేశారు.

# అర్హులందరికీ సంక్షేమ పథకాలు అపోహలు నమ్మవద్దు

**ములుగు జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్**

**గోవిందరావుపేట, జనవరి 23 (జనంసాక్షి)**



: నిజమైన లబ్ధిదారులను ఎంపిక చేస్తామని, జిల్లాలో ఎలాంటి వ్యతిరేకత లేదని, రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ ఫలాలను నిజమైన లబ్ధిదారులకు అందజేస్తామని, లబ్ధిదారుల ఎంపికపై వస్తున్న అపోహలను నమ్మవద్దని జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. అన్నారు. గురువారం మండలం లోని పస్ర గ్రామపంచాయతీ కార్యాలయంలో ప్రజా పాలన గ్రామసభ లో జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. పాల్గొన్నారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఏర్పాటు చేసిన సమావేశంలో గ్రామసభలలో స్వీకరించిన దరఖాస్తులు కానీ గతంలో ఇచ్చిన దరఖాస్తులను పరిగణ ల్లోకి తీసుకొని తొలి జాబితాలు ప్రకటించడం జరుగుతుందని, పూర్తి పరిశీలన అనంతరమే తుది జాబితా ప్రకటించడం జరుగుతుందని అన్నారు. వివిధ పథకాలకు అర్హులైన లబ్ధిదారులు ఇప్పుడే కాకుండా ఏప్పటికైనా దరఖాస్తు చేసుకోవచ్చని, ఆయా పథకాలకు అర్హత ఉన్న లబ్ధిదారులను కచ్చితంగా గుర్తించి అందజేస్తామని తెలిపారు. ఇందిరమ్మ ఇళ్లతో పాటు నూతన రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని నిరంతరం కొనసాగిస్తామని, నిజమేనా అర్హులను గుర్తించిన అనంతరమే గ్రామ సభలలో పేర్లను ప్రకటించడం జరుగుతుందని స్పష్టం చేశారు. గతంలో ప్రభుత్వ పథకాల లబ్ధి పొందడానికి పలు గ్రామాలకు చెందిన ప్రజలు జిల్లా మండల కార్యాలయల చుట్టూ తిరిగేవారని, నేడు గ్రామాలలోనే అధికారుల సమక్షంలో లబ్ధిదారులు ఎంపిక చేయడం గ్రామీణ ప్రజలకు ఎంతోగాను ఉపయోగపడుతుందని అన్నారు. ప్రభుత్వ పథకాలు రాని పక్షంలో అర్హులైన ప్రజలు దరఖాస్తు చేసుకోవచ్చని ప్రతిరోజు దరఖాస్తులను స్వీకరించడం జరుగుతుందని ఆయన తెలిపారు. ప్రభుత్వ పథకాలపై గ్రామీణ ప్రజలకు అవగాహన కల్పించడం జరుగుతున్నాయని, పలు పథకాలను లబ్ధి పొందని అర్హులు దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో జోహార్ రెడ్డి, తాహసిల్దార్ సృజన్ మరియు ఆయా శాఖల సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# విద్యతోపాటు క్రీడారంగంలో రాణించాలి

**రాష్ట్ర ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్**
**అయితే ప్రకాష్ రెడ్డి**
**గ్రీన్ వుడ్ కాన్సెప్ట్ పాఠశాలలో**
**క్రీడాఉత్సవాలు ప్రారంభోత్సవం**

**మహదేవపూర్, జనవరి 23 (జనంసాక్షి)**




విద్యతోపాటు క్రీడారంగంలో రాణించాలని రాష్ట్ర ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్ అయితే ప్రకాష్ రెడ్డి అన్నారు. గ్రీన్ వుడ్ కాన్సెప్ట్ పాఠశాలలో వార్షికోత్సవ క్రీడా ఉత్సవాలను గురువారం ఆయన ముఖ్యఅతిథిగాహాజరై ప్రారంభించారు. పాఠశాల కరస్పాండెంట్ చీర్ల శ్రీనివాస్ రెడ్డి రాష్ట్ర ట్రేడ్ ప్రమోషన్ చైర్మన్ ను సన్మానించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడాకారులు విద్యతో పాటు క్రీడ రంగములో రాణించాలని క్రీడాలంటే కేవలం ఆటలే కాదు జీవితానికి అనుసంధానమైనటువంటి గెలుపు ఓటమి ధైర్య సాహసాలకు ప్రతి కలని క్రీడాకారులకుఆట ద్వారా శరీరక మానసిక ఉల్లాసం కలుగుతుందని విద్యతోపాటు క్రీడాలగూడ సమ ప్రాధాన్యతనిస్తూ విద్యార్థులు రాష్ట్ర జాతీయ స్థాయి క్రీడాకారులుగా తీర్చిదిద్దుతున్న పాఠశాల యజమాన్యాన్ని ప్రశంసిం చారు. ఈ కార్యక్రమంలో పాఠశాల
కరస్పాండెంట్ చర్ల శ్రీనివాస్ రెడ్డి. ప్రధానోపాధ్యాయులు చీర్ల శ్రీనివాస్ రెడ్డి. సింగల్ విండో చైర్మన్ చర్ల తిరుపతిరెడ్డి. మహదేవపూర్ మండల విద్యాధికారి ప్రకాష్ బాబు.
సబ్ ఇన్స్పెక్టర్ అమూల్య. మాజీ సింగల్ విండో చైర్మన్ వామన్ రావు.మాజీ జెడ్పిటిసి గుడాల అరుణ. మాజీ ఎంపీటీసీ ఆకుతోట సుధాకర్. పాఠశాల డైరెక్టర్ పాల్గొన్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
శుక్రవారం
24 జనవరి 2025

# ఇథనాల్ పరిశ్రమను తరలించాల్సిందే..

- పెద్ద ధన్వాడలో కొనసాగుతున్న ఆందోళనలు
- కంపెనీ అనుమతులు రద్దు చేయాలని ఉద్యమం
- రద్దు చేసే వరకూ పోరాటం ఆగదు
- పంటపొలాలు బీడుగా మారుతాయని ఆవేదన
- రద్దు చేయకపోతే ఆత్మహత్య చేసుకుంటాం




**రాజోలి, జనవరి 23 (జనంసాక్షి) :** జోగులాంబ గద్వాల జిల్లా రాజోలి మండలంలోని పెద్ద ధన్వాడ శివరులో ఇథనాల్ పరిశ్రమ ఏర్పాటుకు వ్యతిరేకంగా గురువారం ఆయా గ్రామాల ప్రజలు పెద్ద ఎత్తున ప్లకార్డులు పట్టుకుని నినాదాలతో నిరసన చేపట్టారు. పరిశ్రమ ఏర్పాటును రద్దు చేసేంతవరకు తమ పోరాటం ఆగదని రైతులు స్పష్టం చేశారు. ఈ ఫ్యాక్టరీ ఏర్పాటు వల్ల తమ పంట పొలాలతో పాటు పర్యావరణం సైతం దెబ్బతింటుందని, పరిశ్రమ ఏర్పాటును ఎట్టి పరిస్థితిలో అడ్డుకుంటామని తేల్చి చెప్పారు. మహమ్మారి ఫ్యాక్టరీ రద్దుపై పోరాటంలో భాగంగా యాజమాన్యం కుట్రపూరితంగా అక్రమ కేసులు పెట్టుతున్నారని, పరిశ్రమ రద్దు అయ్యే వరకూ ఈ పోరాటం ఆపేది లేదని హెచ్చరించారు.

### రైతులు సంధిస్తున్న ప్రశ్నలు.!

పెద్ద ధన్వాడలో ఇథనాల్ ఫ్యాక్టరీ ఏర్పాటు వద్దని చుట్టుపక్కల రైతులు పోరాటం చేస్తుంటే, రాష్ట్రసర్కారు ఎందుకు స్పందించడం లేదు? చట్టాలను ఉల్లంఘించి..జలవనరుల సమీపంలో కంపెనీకి ఎలా అనుమతులు ఇస్తారు ? ఇందులో కేంద్ర, రాష్ట్ర సర్కారుల పాపమెంత ? తేల్చేదెవరు. రేపటి తరాలకు మనం ఇవ్వగలిగేది మంచి వాతావరణమేనని అధికారులు ఎన్నోసార్లు చెప్పారు. మరి పర్యావరణాన్ని హననం చేసే ఇథనాల్ కంపెనీకి అనుమతులు ఎలా ఇచ్చారు? పోనీ..మంత్రులో, నేతలదో, అధికారులదో తప్పైతే దాన్ని సరిదిద్దే బాధ్యత అధికారులది కాదా.? గత నెలల నుండి రైతులు చేస్తున్న పోరాటం ఇంకెప్పుడు సర్కారుకు సోయి వస్తుంది.? ఇవే ఫ్యాక్టరీ సమీపంలోని ఆయా గ్రామాల రైతులు సంధిస్తున్న ప్రశ్నలు.

### సంఘీభావం తెలిపిన అఖిలపక్షం నాయకులు

ప్రజాభిప్రాయానికి వ్యతిరేకంగా ఇథనాల్ పరిశ్రమ నిర్మాణ అనుమతులను రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వం బేషరతుగా రద్దు చేయాలని రాజోలి మండల కాంగ్రెస్ అధ్యక్షులు దస్తగిరి, జిల్లా ప్రజాసంఘాల నాయకులు చిట్టెం క్రిష్టన్న, బహుజన రాజ్య సమితి జిల్లా అధ్యక్షులు వినోద్ కుమార్ డిమాండ్ చేశారు. నిరసన కార్యక్రమంలో భాగంగా గ్రామ రైతులతో కలిసి వారు ధర్నా చేపట్టారు. ప్రజాభిప్రాయానికి వ్యతిరేకంగా పరిశ్రమ నిర్మాణం ప్రభుత్వం వ్యవహరిస్తే పెద్దఎత్తున ఉద్యమాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. విషవాయువుల వ్యర్థాలు తుంగభద్ర నదిలో కలిస్తే అలంపూర్ నియోజకవర్గం ప్రజలకు భవిష్యత్‌లో తాగునీరు కూడా పూర్తిగా కలుషితమయ్యే అవకాశం ఉందని, ప్రజల ప్రాణాలతో చెలగాట మాడుతున్న కంపెనీ నిర్మాణాన్ని అనుమతులు వెంటనే రద్దు చేయాలని డిమాండ్ వారు డిమాండ్ చేశారు.

#### ప్రజలకు హానికలిగించే ఇథనాల్ రద్దుచేయాలి



పరిశ్రమలు నిర్మించాలంటే వాటి వెంట ఉన్న ప్రజల అభిప్రాయ సేకరణ చేపట్టిన తర్వాతే నిర్మాణాలు చేపట్టాలి. తమకు హాని ఉందని ప్రజలు ఆందోళనలు చేస్తే అధికారులు పర్యవేక్షించాలి. ఇక్కడి గ్రామాల ప్రజల అభిప్రాయం సేకరించిన తర్వాతే నిర్మించాలి. ఇథనాల్ పరిశ్రమ నిర్మాణంతో కాలుష్యంతో పల్లెలు, వ్యవసాయ భూములు నిండిపోతాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుమతులు రద్దు చేయాలి.

–బాబురావు, మానుదొడ్డి

#### వారి ఇష్టం వచ్చినట్లు నిర్మాణాలు చేపడితే ఎట్లా?



భూములున్నా, మా అభిప్రాయం తీసుకోకుండా వారి ఇష్టం వచ్చినట్లు నిర్మాణాలు చేపడుతున్నారు. ఇది సరికాదు. ఈ ఇథనాల్ పరిశ్రమ నిర్మాణం మొదలైనప్పటి నుంచి భూములను ఎవరూ కొనుగోలు చేయడం లేదు.

–తిరుపతయ్య, చిన్న ధన్వాడ

#### రెక్కాడితే గాని, డొక్కాడని పేద బతుకులు మావి



అసలే ఈ గ్రామాలు అభివృద్ధిలో వెనుకబడి ఉన్నాయి. రెక్కాడితే గాని, డొక్కాడని పేద బతుకులు ఇక్కడ బతుకుతున్నాం. ఉన్న అరకొర భూమినే నమ్ముకున్న కుటుంబాలెన్నో ఉన్నాయి. ఇలాంటి ఎన్నో జీవితాలు ప్రశ్నార్థకంగా మారుతాయన్న పరిస్థితి ప్రస్తుతం ఆందోళనకు గురిచేస్తోంది. భూములు బీడుగా మారి, తినేందుకు పంటలు, తాగేందుకు నీరు కూడా దొరకవు. మా కంటిమీద కునుకు లేకుండా పోతుంది. ప్రజలకు కనీసం సమాచారం ఇవ్వకుండా ఫ్యాక్టరీని ఎలా ఏర్పాటు చేస్తారు ?

–వీరన్న గౌడ్, పెద్ద ధన్వాడ

#### వెంటనే రద్దు చేయాలి



ఇథనాల్ పరిశ్రమ ఏర్పాటుతో భవిష్యత్తులో తమకు పూర్తిగా అంధకారమేనని స్థానిక ప్రజలు అంటున్నారు. ప్రభుత్వం దీనిని పరిగణనలోకి తీసుకొని వీలైనంత త్వరగా పరిశ్రమను నిలిపివేయాలి. లేకపోతే పరిశ్రమ మూసే వరకు మా పోరాటాలను ఉధృతం చేస్తాం. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణమే స్పందించి ఫ్యాక్టరీని రద్దు చేయాలి.

–సందీప్, చిన్న తాండ్రపాడు

#### ఇథనాల్ పరిశ్రమ వద్దు



వ్యవసాయాన్ని నమ్ముకున్న మేము బతుకుడు కష్టమైతది. పరిశ్రమ చుట్టూ ఉన్న భూముల్లో ఏడాదికి మూడు పంటలు వేసే టోళ్లం. ఒక్క పంట కూడా తీయలేక ఆగమైపోతం. మా భూములు, నీళ్లు, గాలి అన్నీ కలుషితం అవుతాయి. భూములు పాడైయ్ రోడ్డు మీద పడాల్సి వస్తది. అందుకే మాకు ఇథనాల్ పరిశ్రమ వద్దు

– అభిమన్యు, నౌరోజి క్యాంప్

#### కంపెనీ అనుమతులు రద్దు చేసే వరకూ పోరాటం



ఇథనాల్ కంపెనీ అనుమతులు రద్దు చేసే వరకూ అఖిలపక్షం నాయకులు, ప్రజలకు మద్దతుగా విద్యార్థి సంఘాల తరఫున పోరాటం కొనసాగిస్తాం. ఈ కంపెనీ నిర్మాణం జరిగితే భవిష్యత్‌లో జరిగే పరిణామాలను ఎవరూ ఊహించలేరు. గ్రామంలో ఉన్న ప్రతీ ఒక్కరు ముందుకు కదలాలి. లేదంటే భవిష్యత్ అంధకారంలోకి వెళుతుంది. జిల్లావ్యాప్తంగా ఇప్పటికే కంపెనీ నిర్మాణం ఆపేందుకు చేపట్టవలసిన కార్యక్రమాలను రూపొందించాం.

–ఏబెల్, నసనూర్

## పేద బిడ్డలకు ఎందుకు లాప్‌ట్యాప్స్ పంపిణీ చేయడం లేదు?

- బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్




**హైదరాబాద్, జనవరి 23 (జనంసాక్షి) :** బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ప్రతి ఏడాది గౌలిదొడ్డి(బాయ్స్) గురుకులంలో చదువుతూ ఐఐటీ, ఎన్ఐటీల్లో సీట్లు పొందిన విద్యార్థులకు ల్యాప్‌టాప్స్ అందించేవారని ఇప్పుడు ఎందుకు అందించడం లేదని బీఆర్ఎస్ నేత ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ ప్రశ్నించారు. కానీ ఈ ఏడాది మాత్రం ఇప్పటి వరకు విద్యార్థులకు ల్యాప్‌టాప్స్ అందలేదన్నారు. గొప్ప చదువులు చదవాలనుకునే గురుకుల విద్యార్థులు నిర్లక్ష్యానికి గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అయితే గురుకులాల్లో లాప్‌ట్యాప్స్ అందలేదని ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు మెసేజ్ పెట్టడంతో ఈ మేసేజ్‌పై ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ స్పందించారు. మీరు హైదరాబాద్ నుండి కరీంనగర్‌కు హెలికాప్టర్‌లో పోయిన ఖర్చుతో ఈ పేద బిడ్డలకు మంచి ల్యాప్‌టాప్స్ పంపిణీ చేయవచ్చు. రూ. 32 వేల ప్లేటు మీల్స్ గురించి నేను మాట్లాడను అని రేవంత్ రెడ్డి సర్కార్‌కు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ చురకలంటించారు.

## రహదారుల అభివృద్ధిపై కేంద్రం ఫోకస్

- చేగుంట నుంచి దుబ్బాక మీదుగా రాజన్నసిరిసిల్లకు నేషనల్ హైవేకు ఎంపీ రఘురందన్‌రావు హామీ

**హైదరాబాద్, జనవరి23 (జనంసాక్షి) :** తెలంగాణలో రహదారుల అభివృద్ధిపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఫోకస్ పెట్టాయి. ఇప్పటికే అనేక మార్గాల్లో కొత్త రహదారులు మంజూరు చేశారు. ఇప్పటికే అందుబాటులో ఉన్న పలు జాతీయ రహదారులను కూడా విస్తరిస్తున్నారు. తెలుగు రాష్ట్రాల మధ్య అత్యంత రద్దీగా ఉండే హైదరాబాద్–విజయవాడ రహదారిని 4 నుంచి 6 వరుసలుగా విస్తరించేందుకు ప్లాన్ చేస్తున్నారు. త్వరలోనే అందుకు సంబంధించిన పనులు ప్రారంభం కానున్నాయి. మరికొన్ని ప్రాంతాల మధ్య కొత్తగా రహదారులు నిర్మించేందుకు కసరత్తు చేస్తున్నారు. ఇందులో రాష్ట్ర ప్రభుత్వం కొన్ని రహదారులు నిర్మిస్తుండగా.. మరికొన్ని రోడ్లను కేంద్రం నిర్మిస్తోంది. తాజాగా తెలంగాణలో మరో నేషనల్ హైవే నిర్మాణంపై కీలక హామీ వచ్చింది. చేగుంట నుంచి దుబ్బాక మీదుగా రాజన్నసిరిసిల్ల వరకు నేషనల్ హైవే నిర్మించాలని ఎప్పట్నుంచో డిమాండ్ ఉంది. ఈ విషయంపై స్థానికులు పలు మార్లు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు వినతులు కూడా సమర్పించారు. తాజాగా.. ఆ నేషనల్ హైవేపై మెదక్ ఎంపీ రఘునందన్ రావు కీలక హామీ ఇచ్చారు. జాతీయ రహదారి నిర్మాణం విషయాన్ని కేంద్రప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని చెప్పారు. స్థానిక ప్రజల ఆంకాంక్షల మేరకు రోడ్డు మంజూరయ్యేలా కృషి చేస్తానని అన్నారు. దుబ్బాక డెవలప్‌మెంట్ ఫోరం ఆధ్వర్యంలో పలువురు ఈ విషయంపై ఎంపీకి వినతిపత్రం అందించారు. చేగుంట –సిరిసిల్ల మధ్య నేషనల్ హైవే చేపడితే రాష్ట్రంలో సుప్రసిద్ధ పుణ్యక్షేత్రం అయిన వేములవాడకు ఈజీగా చేరుకోవచ్చునని అన్నారు. వేములవాడ– హైదరాబాద్ మధ్య కూడా దూరం తగ్గుతుందని చెప్పారు. వారి వినతిపై సానుకూలంగా స్పందించిన ఎంపీ రఘునందన్ రావు ఈ రహదారి అంశాన్ని తప్పకుండా కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తాన న్నారు. నేషనల్ హైవే మంజూరుకు తాను శాయశక్తుల కృషి చేస్తానని చెప్పారు. త్వరలోనే కేంద్రమంత్రి నితిన్ గడ్కరీని కలిసి రహదారి నిర్మాణంపై చర్చిస్తానని ఎంపీ రఘునందన్ రావు హామీ ఇచ్చారు. కాగా, ఎంపీ ప్రకటనతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. చాలా ఏళ్లుగా ఈ రహదారి నిర్మాణం కోసం పోరాడుతు న్నామని చెప్పారు. త్వరితగతిన రహదారి మంజూరైతే.. ఈ ప్రాంతం రూపురేఖలు మారిపోతాయని అంటున్నారు.

## మేయర్, డిప్యూటీ మేయర్‌లపై అవిశ్వాస తీర్మానం

- పార్టీలో చర్చించి నిర్ణయం తీసుకుంటాం
- నగరంలో పనులు ఆగిపోయాయన్న తలసాని
- కమిషన్ ఇలంబర్తిని కలసి వినతి పత్రం సమర్పణ



**హైదరాబాద్, జనవరి 23(జనంసాక్షి) :** మేయర్, డిప్యూటీ మేయర్‌పై అవిశ్వాస తీర్మానంపై శనివారం పార్టీ మీటింగ్‌లో చర్చించి నిర్ణయం తీసుకుంటామని మాజీమంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ ఆధ్వర్యంలో గురువారం బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కార్పొరేటర్లు జీహెచ్ఎంసీ కమిషనర్ ఇలంబర్తిని కలిశారు. కమిషనర్‌ను కలిసి హైదరాబాద్‌లోని ప్రజా సమస్యలు, అభివృద్ధి పనులపై నేతలు వినతిపత్రం సమర్పించారు. జీహెచ్ఎంసీ కమిషనర్‌తో గ్రేటర్ హైదరాబాద్‌కు చెందిన బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు భేటీ అయ్యారు. ఈ సందర్భంగా తలసాని శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ... నగరంలో ప్రజలు చాలా సమస్యలు ఎదుర్కొంటున్నారని చెప్పారు. ప్రజా సమస్యలపై కమిషనర్‌ను కలిసి వినతిపత్రం ఇచ్చామన్నారు. స్ట్రీట్ లైట్స్ ఎక్కడ వెలగట్లేదు, రోడ్లు సరిగ్గా లేవు అని చెప్పారు. ఫ్లైఓవర్లపై నిర్మాణాలు ఆగిపోయాయని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన మొదటి ఏడాది ఏ పనులు చేయకపోయినా తాము సైలెంట్‌గా ఉన్నాం.. ఇకనుంచి ప్రజా సమస్యలపై ప్రభుత్వాన్ని నిలదీస్తామని అన్నారు. లక్షల సంఖ్యలో రేషన్ కార్డుల అప్లికేషన్లు వచ్చాయి.. దరఖాస్తు చేసుకున్న వారికి రేషన్ కార్డులు ఇవ్వాలని తలసాని శ్రీనివాస్ యాదవ్ డిమాండ్ చేశారు. ప్రజాప్రతినిధులకు సంబంధించిన ప్రోటోకాల్‌ను ఎందుకు పాటించడం లేదని ప్రశ్నించారు. స్థానిక ఎమ్మెల్యేలకు చెప్పకుండానే శంకుస్థాపనలు ఎలా చేస్తున్నారని నిలదీశారు. అధికారులు తమ ఫోన్లు ఎత్తడం లేదు.. తమ నెంబర్లు బ్లాక్ చేస్తున్నారని ఆరోపించారు. వైకుంఠ ధామాల నిర్మాణాలు మధ్యలో ఆగిపోయాయని చెప్పారు.

## ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ముఖ్యమంత్రి ఫోటో పెట్టని ఎమ్మెల్యే మాకొద్దు!

- ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డిని వెంటనే సస్పెండ్ చేయాలి
- పటాన్ చెరు లో ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి దిష్టిబొమ్మ దహనం
- సేవ్ కాంగ్రెస్ నినాదాలతో నిరసన చేపట్టిన కాంగ్రెస్ శ్రేణులు
- పటాన్ చెరులో కాంగ్రెస్ పార్టీని భూస్థాపితం చేస్తున్నాడంటూ ఆవేదన
- జాతీయ రహదారిపై కాంగ్రెస్ శ్రేణుల నిరసన





**పటాన్‌చెరు, జనవరి 23 (జనం సాక్షి) :** పటాన్ చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డికి వ్యతిరేకంగా కాంగ్రెస్ పార్టీ శ్రేణులు ఆందోళన చేపట్టారు. ఇటీవల బొల్లారం మున్సిపాలిటీలో జరిగిన సంఘటనను నిరసిస్తూ, నిఖార్సైన కాంగ్రెస్ పార్టీ నాయకులను, కార్యకర్తల పట్ల ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి నిర్లక్ష్యంగావ్యవహరిస్తున్నారని నిరసనకు దిగారు. ఎమ్మెల్యేను కాంగ్రెస్ పార్టీ నుండి సస్పెండ్ చేయాలని కోరుతూ పటాన్ చెరు పట్టణంలో కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు జాతీయ రహదారిపై ధర్నా నిర్వహించారు. నియోజకవర్గంలోని అన్ని ప్రాంతాల నుండి కాంగ్రెస్ శ్రేణులు భారీ సంఖ్యలో తరలివచ్చి నిరసన కార్యక్రమంలో పాల్గొన్నారు. జాతీయ రహదారిపై బైఠాయించి ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి డౌన్ డౌన్ సేవ్ కాంగ్రెస్ అంటూ కాంగ్రెస్ శ్రేణులు ఎమ్మెల్యేకు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. అన్నింటిలో బీఆర్ఎస్ నాయకులను ప్రాధాన్యత ఇస్తున్నాడని ఆరోపంచారు. కాంగ్రెస్ కార్యకర్తలు ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి దిష్టిబొమ్మను దగ్ధం చేసేందుకు ప్రయత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఫోటో పెట్టాలని డిమాండ్ చేస్తూ పెద్ద ఎత్తున కాంగ్రెస్ శ్రేణులు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయానికి చేరుకున్నారు. కార్యాలయంలో దూసుకెళ్తున్న కార్యకర్తలను పోలీసులు అడ్డుకున్నారు. అయినప్పటికీ పలువురు కార్యకర్తలు లోపలికి వెళ్లి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఫోటోను పెట్టారు. ఈ సందర్భంగా పలువురు కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి కాంగ్రెస్ పార్టీ ప్రజాపతినిధులు, నాయకులను నిర్లక్ష్యం చేస్తూ కార్యక్రమాలకు సంబంధించిన సమాచారం సైతం ఇవ్వకుండా బీఆర్ఎస్ ప్రజా ప్రతినిధులు, నాయకులతో కార్యక్రమాలు చేపడుతున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీలో చేరిన మహిపాల్ రెడ్డి క్యాంపు కార్యాలయంలో ముఖ్యమంత్రి ఫోటో ఎందుకు పెట్టడం లేదని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇటీవల బొల్లారం మున్సిపాలిటీలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి కాంగ్రెస్ పార్టీ నాయకులపై అనుచిత వ్యాఖ్యలు చేశారని విమర్శించారు. పనులు పూర్తికాకముందే హడావుడి చేసి ప్రారంభోత్సవాలు చేశారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో ఉంటూ పార్టీ అసలైన నాయకులు, కార్యకర్తలను ఇబ్బంది పెడుతున్న ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డిని వెంటనే సస్పెండ్ చేయాలని వారు డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ అధిష్టానం వెంటనే చర్యలు చేపట్టాలన్నారు.



## సికింద్రాబాద్ ఎమ్మెల్యే పద్మారావు గౌడ్‌కు ఎర్రబెల్లి దయాకర్‌రావు పరామర్శ

**పాలకుర్తి జనవరి 23 (జనం సాక్షి) :** మాజీ మంత్రివర్యులు, సికింద్రాబాద్ ఎమ్మెల్యే తీగుల్ల పద్మారావు గౌడ్ ఉత్తరాఖండ్ పర్యాటనకు వెళ్లి అస్వస్థతకు గురై చికిత్స అనంతరం హైదరాబాద్ చేరుకున్న విషయం తెలుసుకుని గురువారం వారి స్వగృహానికి వెళ్లి పరామర్శించి, ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్న పంచాయతీరాజ్ శాఖ మాజీ మంత్రివర్యులు ఎర్రబెల్లి దయాకర్ రావు పరామర్శించారు, ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు, పరామర్శించిన వారిలో జనగామ జిల్లా బిఆర్ఎస్ నాయకులు బబ్బూరి శ్రీకాంత్ గౌడ్, డా. రఘు తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధి పనులకు మంత్రి కొండా సురేఖ శంకుస్థాపన



**వరంగల్ ఎంజీఎం, జనవరి 23(జనంసాక్షి):** బల్దియా పరిధి 22 వ డివిజన్ మర్రి వెంకటయ్య కాలనీ లో గురువారం ముఖ్యమంత్రి సహాయ నిధి (సి ఎం ఏ)ఫండ్ రూ.2 కోట్ల 60 లక్షల అంచనా వ్యయంతో నిర్మించనున్న సి సి రోడ్లు డ్రైన్ పనులకు, ఇదే ప్రాంతం లో 15 వ ఆర్థిక సంఘం నిధులు రూ. 50 లక్షల అంచనా వ్యయంతో నిర్మించనున్న డ్రైనేజీ, సి సి రోడ్ల పనులకు శంకుస్థాపన చేసిన రాష్ట్ర అటవీ దేవాదాయ పర్యావరణ శాఖ కొండ సురేఖ.ఈ కార్యక్రమంలో నగర మేయర్ గుండు సుధారాణి, జిడబ్ల్యూఎంసీ కమిషనర్ డాక్టర్ అశ్విని తానాజీ వాకడే, స్థానిక డివిజన్ కార్పొరేటర్ బస్వరాజు కుమారస్వామి తో పాటు ఈ ఈ శ్రీనివాస్, స్థానిక డివిజన్ వాసులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారంలో 'జనంసాక్షి'

#### జనంసాక్షి క్యాలెండర్ ఆవిష్కరణలో తహసీల్దార్, ఎంపీడీఓ





**పర్వతగిరి, జనవరి 23 (జనం సాక్షి) :** పర్వతగిరి మండల కేంద్రంలోని తహాశీల్దార్ కార్యాలయం ఆవరణలో మండల జనం సాక్షి రిపోర్టర్ షేక్ అజిమ్ ఆధ్వర్యంలో స్థానిక మండల అధికారులు తహాశీల్దార్ టి.వెంకట స్వామి, ఎంపీడీవో మాలోత్ శంకర్ నాయక్, మండల వ్యవసాయ అధికారి ప్రశాంత్ కుమార్, మండల పంచాయతీ అధికారి పాక శ్రీనివాస్ సహితంగా జనం సాక్షి నూతన సంవత్సర క్యాలెండర్‌ను గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు ప్రభుత్వం దృష్టికి తీసుకెళుటలో జనం సాక్షి దినపత్రిక ముందుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ స్రవంతి, అసిస్టెంట్లు నీరటి వీరేష్, పబ్బ శంకర్, ప్రెస్ క్లబ్ మండల అధ్యక్షుడు మధుర కోళ నాగరాజు, గౌరవ అధ్యక్షుడు కొల్లూరి నాగరాజు, ప్రధాన కార్యదర్శి గొల్లపల్లి సంతోష్ కుమార్, కోశాధికారి నాగుల రాజు, ఎగ్జిక్యూటివ్ నెంబర్స్ గడ్డం రాజశేఖర్, భూక్య ప్రవీణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Plot No. 16E/4, IDA, Kattedan, Ranga Reddy Dist, Telangana - 500077, Published at #119&120, 1st Floor, Down Town Mall, Lakdikapul, Hyderabad, Telangana-500004. Editor : M.M.RAHMAN RNINo. APTEL/2013/50370